V3 NEWS

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

ఆదివారం
03-11-2024

సంపుటి : 01 | సంచిక : 181 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్




డా॥ కాచం సత్యనారాయణ
CMD

# ఉగ్రవాదులను చంపకూడదు

## ప్రాణాలతో పట్టుకోవాలి

- వారిని బంధిస్తే వ్యూహాలు తెలుస్తాయి
- ఫరూక్ అబ్దుల్లా వివాదాస్పద వ్యాఖ్యలు
- ఫరూక్ వ్యాఖ్యలను తేలిగ్గా తీసుకోవద్దు: శరద్ పవార్
- ఉగ్రవాదులకు సరిగ్గా బదులిస్తాం: రాజ్‌నాథ్ సింగ్



**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్‌లో ఉగ్రదాడులకు పాకిస్థానే కారణమని ఇటీవల పదేపదే చెబుతున్న నేషనల్ కాన్ఫరెన్స్ అగ్రనేత, మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదులను చంపకుండా, ప్రాణాలతో పట్టుకోవాలని వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయంగా దుమారం రేపుతున్నాయి. ఉగ్రవాదులను సజీవంగా బంధించి వారిని విచారిస్తే.. ఉగ్రమూకల వ్యూహాలు తెలుస్తాయని ఆయన చెబుతున్నప్పటికీ.. విపక్ష ఎన్డీయే నుంచి తీవ్ర అభ్యంతరం మిగతా2లో...

గత పదేళ్లలో నెలకొన్న చీకటి, నిరాశను తాము గత 11 నెలల్లో పారదోలామని, తెలంగాణ రాష్ట్రం ప్రస్తుతం సూర్యుడిలా ఉదయిస్తోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ చేసిన విమర్శలపై స్పందించిన సీఎం, ఎక్స్ వేదికగా వివరణ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రాజీవ్ ఆరోగ్య శ్రీ కింద రూ.10 లక్షల సదుపాయాన్ని అమల్లోకి తీసుకొచ్చామన్నారు. ఒక్కో హామీని అమలు చేస్తున్నామన్నారు. ప్రతి వాగ్దానంపై నిబద్ధతతో ఉన్నామన్నారు.

# ప్రతి వాగ్దానంపై నిబద్ధతతో ఉన్నాం



**దేశంలోనే అతిపెద్ద రుణమాఫీ అమలు చేశాం**

రూ.500కే సిలిండర్ ఇస్తున్నాం

- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం
- 50 వేలకు పైగా ఉద్యోగ నియామకాలు చేపట్టాం
- మూసీ పునరుజ్జీవానికి నడుం బిగించాం
- కబ్జాకు గురైన నీటి వనరులను సంరక్షిస్తున్నాం
- స్కిల్ వర్సిటీ, స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటు చేస్తున్నాం
- ఒక్కో హామీని అమలు చేస్తున్నాం
- ఏ బీజేపీ పాలిత రాష్ట్రంతో పోల్చినా మాదే రికార్డు
- మోదీ విమర్శలకు రేవంత్ జవాబు

**విశ్వంభర, హైదరాబాద్:** ప్రధాని మోదీ విమర్శలకు 'ఎక్స్' వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి సమాధానమిచ్చారు. ''అధికారంలోకి వచ్చిన 2 రోజుల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ.10 లక్షల సదుపాయాన్ని అమల్లోకి తీసుకొచ్చాం. ఉచిత బస్సు ప్రయాణం వల్ల మహిళలకు రూ.3433 కోట్లు ఆదా అయింది. ఏడాది కాకముందే దేశంలోనే అతిపెద్ద రుణమాఫీ అమలు చేశాం. 22 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశాం. ఇందులో భాగంగా కేవలం 25 రోజుల్లోనే రూ.18 వేల కోట్లు జమ చేశాం. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాం. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో గ్యాస్ ధరలు అధికంగా ఉన్నాయి. తెలంగాణలో రూ.500కే సిలిండర్ ఇస్తున్నాం. మిగతా2లో...



## దెబ్బతిన్న వ్యవస్థలను పునరుద్ధరించాలి


- వర్సిటీలను ప్రక్షాళన చేయాలి
- వీసీలకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం

2

స్పెయిన్‌లో విలయం

## సృష్టించిన వరదలు


- 205 మంది మృత్యువాత
- ఇప్పటికీ నీటిలోనే నగరాలు
- శిథిల భవనాల్లోని శవాల వెలికితీతకు ప్రయత్నం



2

## 'విశ్వమిత్ర'గా ఎదుగుతున్న భారత్

- వీలైనంత ఎక్కువమందితో స్నేహం చేయాలి
- ఎక్కువమందితో సత్సంబంధాలు పెట్టుకోవాలి
- విదేశాంగ మంత్రి ఎస్. జై శంకర్



2



9

## ఢిల్లీలో దారుణంగా వాయు నాణ్యత

- పలు ప్రాంతాల్లో గరిష్ఠ స్థాయి 999కి చేరిన ఏక్యూఐ
- తీవ్ర అనారోగ్య సమస్యలకు గురవుతున్న నగర వాసులు
- సఫార్ సంస్థ సర్వేలో వెల్లడి

## మెట్రో రైలు రెండో దశకు పరిపాలన అనుమతులు

అయిదు కారిడార్లకు మంజూరు



**విశ్వంభర, హైదరాబాద్:** మెట్రో రైలు రెండో దశ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన అనుమతులు జారీ చేసింది. రెండో దశలో 76.4 కిలోమీటర్ల మేర మెట్రో రైలు నిర్మాణం మిగతా2లో...


## ఆ ప్యాలెస్‌లో గుండె చెదిరిపోయే నిజాలు



2

- ఒక ముఖ్యమంత్రి విలాసం కోసం పర్యావరణాన్ని విధ్వంసం చేసి భవన నిర్మాణాలు
- ఈ భవనాలు చూసి ఆశ్చర్యం, ఉద్వేగం కలిగాయి
- అధికారంలో శాశ్వతంగా ఉంటాననే భ్రమలతో ఇలాంటివి కట్టారు
- రుషికొండపై నిర్మించిన భవనాలను పరిశీలించిన సీఎం చంద్రబాబు

## సీతారామ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలి




- భూసేకరణ కోసం ప్రత్యేక సర్వే బృందాలు
- సమీక్షలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్:** ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలో సాగు నీరు,తాగు నీటితో పాటు పారిశ్రామిక అవసరాలను తీర్చేందుకుద్దేశించిన సీతారాం లిఫ్ట్ ప్రాజెక్టును వేగవంతంగా పూర్తి చేసేందుకు రూట్ మ్యాప్ రూపొందించాలని రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖమంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.అందుకు అవసరమైన భూసేకరణ కోసం ప్రత్యేక సర్వే టీంలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. సీతారాం లిఫ్టు ప్రాజెక్ట్ నిర్మాణపు పనులపై శనివారం ఎర్రమంజిల్ కాలనీ లోని జలసౌధలో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు ,నీటిపారుదల శాఖా ముఖ్య కార్యదర్శి మిగతా3లో...

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి

## పట్టాలు తప్పిన రేవంత్ పాలన

- మొన్న టీజీఎస్పీ పోలీసుల భార్యలు రోడ్డెక్కితే, నేడు హోంగార్డుల భార్యలు రోడ్డెక్కారు
- ఎక్కడ చూసినా పోలీసుల ఆందోళనలు, శాంతి భద్రతలు అడుగంటిన దృశ్యాలే
- ప్రభుత్వంపై మండిపడ్డ మాజీమంత్రి హరీశ్‌రావు



2

## తెలంగాణలో మళ్లీ ఎమర్జెన్సీ రోజులు



హక్కులు అడిగితే బెదిరింపులు.. పోరాడితే సస్పెన్షన్లు

బీఆరెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**విశ్వంభర, హైదరాబాద్:** పదేళ్లు స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకున్న తెలంగాణలో మళ్లీ ఎమర్జెన్సీ రోజులొచ్చాయని బీఆరెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. పోలీస్ యాక్ట్ అమలు విషయమై 'ఎక్స్' వేదికగా స్పందించిన ఆయన.. రాష్ట్రంలో ప్రభుత్వ చర్యలను తప్పు పట్టారు. ప్రజాస్వామిక తెలంగాణలో... బూటు కాళ్ల శబ్దాలతో తెల్లవారే రోజులొచ్చాయని వ్యాఖ్యానించారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రశ్నిస్తే కేసులు, హక్కులు అడిగితే బెదిరింపులు, పోరాడితే సస్పెన్షన్లు చేస్తున్నారని మండిపడ్డారు. ఇది నియంతృత్వ రాజ్యమని.. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్బంధిస్తోందన్నారు. తెలంగాణకుపోరాటం కొత్త కాదు.. ఈ మట్టి పొత్తిళ్లలోనే పోరాటం ఉందని పేర్కొన్నారు. మిగతా2లో...



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 128 | ₹ 150 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 218 | ₹ 248 |



ఝార్ఖండ్‌లో కాంగ్రెస్ విజయంతోనే

## రాజ్యాంగ పరిరక్షణ

ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం భట్టి

**విశ్వంభర, హైదరాబాద్:** ఝార్ఖండ్ ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమి విజయంతోనే రాజ్యాంగ పరిరక్షణ ఉంటుందని తెలంగాణ ఉపముఖ్యమంత్రి మిగతా2లో...

## పంచాంగం

**03-11-2024, ఆదివారం**

శ్రీ క్రోధినామ సంవత్సరం
ఆశ్వయుజ మాసం కృష్ణపక్షం
తిథి: విదియ రా.10.02 వరకు తర్వాత తదియ
నక్షత్రం: అనురాధ ఉ.07.57 వరకు
సూర్యోదయం: ఉ.6.19
సూర్యాస్తమయం: సా.5.40
వర్జ్యం: ఉ.10.19 నుంచి మ.12.03వరకు
దుర్ముహూర్తం: సా.04.09 నుంచి సా.04.54 వరకు
రాహుకాలం: సా.04.14 నుంచి సా.05.40 వరకు
అమృత ఘడియలు: రా.08.45 నుంచి రా.10.30 వరకు

# ఆ ప్యాలెస్‌లో గుండె చెదిరిపోయే నిజాలు

**విశ్వంభర, విశాఖపట్నం:** ఒక ముఖ్యమంత్రి విలాసం కోసం పర్యావరణాన్ని విధ్వంసం చేసి ప్యాలెస్ కట్టుకోవడం ఎక్కడా చూడలేదని సీఎం చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. గత వైసీపీ-ప్రభుత్వం హయాంలో రుషికొండపై నిర్మించిన భవనాలను మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి సీఎం చంద్రబాబు పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ''ఎవరూ కలలో కూడా ఊహించనిది జరిగింది. ఒక వ్యక్తి విలాసవంతమైన జీవితం కోసం ఏవిధంగా కార్యక్రమాలు చేస్తాడనేది ఇక్కడి భవనాలు చూశాకే తెలిసింది. గుండె చెదిరిపోయే నిజాలు బయటకు వస్తున్నాయి. గతంలో.. మీడియా, ఇతరులు ఎంత ప్రయత్నించినా రుషికొండపై ఏం చేస్తున్నారో తెలియకుండా చేశారు. ఎన్జీటీ, హైకోర్టు, కేంద్ర ప్రభుత్వాన్ని మభ్యపెట్టారు. ఒక రాష్ట్ర ప్రభుత్వాన్ని అడ్డం పెట్టుకొని ఏ విధంగా చేయగలరో అనే దానికి ఇక్కడి పరిస్థితి ఒక ఉదాహరణ. నేను, నా మిత్రుడు పవన్ కల్యాణ్ కూడా ఇక్కడకు రావాలని ప్రయత్నించాం. ఎవరినీ రానీయకుండా చేశారు. ఇవాళ ఇక్కడ ఏం జరిగిందో ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉంది.. ఆ అధికారం ప్రజలే మాకు ఇచ్చారు. రుషికొండ బీచ్.. విశాఖలోనే అత్యంత అందమైన ప్రాంతం. భవనాల్లో ఎక్కడ కూర్చున్నా సముద్రం వ్యూ కనిపించేలా కట్టారు. పూర్వం రాజులు, చక్రవర్తులు కూడా ఇలాంటి భవనాలు నిర్మించుకోలేదు'' ''ఒక వ్యక్తి తన స్వార్థం కోసం ఇలాంటి పనులు చేశారు. ఇలాంటి విలాసవంతమైన భవనాలు నిర్మిస్తున్నారని ఊహించలేం. ప్రజాధనంతో ఇలాంటి భవనాలు కట్టుకోవడం దారుణం. ఈ భవనాలు చూసి ఆశ్చర్యం, ఉద్వేగం కలిగింది. బాత్ టబ్ కోసం రూ.36లక్షలు ఖర్చు చేశారు. ఫ్యాన్సీ ఫ్యాన్లు పెట్టారు. ఇలాంటి షాండ్లియర్లు కూడా నేనెక్కడా చూడలేదు. భవనాలకు మార్బుల్స్ విదేశాల నుంచి తీసుకొచ్చారు. చాలా దేశాలు తిరిగా.. ఎంతో మంది నేతలను చూశాను కానీ, ఎవరూ ఇలాంటి ప్యాలెస్‌లు కట్టుకోలేదు. ఢిల్లీ పెద్దలు కూడా విశాఖలోని నేవీ గెస్ట్‌హౌస్‌లోనే ఉన్నారు. పర్యాటకశాఖ కోసమే నిర్మించామని అనేకసార్లు చెప్పారు. పేదలను ఆదుకుంటామనేవారు ఇలాంటివి కట్టుకుంటారా'' ''గత ప్రభుత్వం ఉత్తరాంధ్ర ప్రాజెక్టులకు రూ.400 కోట్లు కూడా ఖర్చు చేయలేదు. ఈ నిధులు ఖర్చు పెడితే రోడ్లపై గుంతలు పూడ్చటం పూర్తయ్యేది. ఇలాంటి వ్యక్తులు రాజకీయాల్లో పనికివస్తారా? ప్రజలు ఆలోచించాలి. ఈ భవనాలు అందరికీ చూపిస్తాం. వీటిని దేనికి వాడుకోవాలో నాకు అర్థం కావడం లేదు. ఇక్కడ క్యాంప్ ఆఫీస్



కట్టడం ఏమిటో అర్థం కాలేదు. ప్రజలంటే ఎంతో కొంత భయం ఉంటే సమాధానం చెప్పాలి. ప్రజాధనం దోచుకుని గతంలో ఊరికొక ప్యాలెస్ కట్టుకున్నారు. అధికారంలో శాశ్వతంగా ఉంటాననే భ్రమలతో ఇలాంటివి కట్టారు. విశాఖ ప్రజలను మోసం చేసేందుకు ఇలాంటి తప్పుడు పనులు చేశారు'' అని చంద్రబాబు విమర్శించారు.

# ప్రతి వాగ్దానంపై నిబద్ధతతో ఉన్నాం

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటివరకు 43 లక్షల మందికి సిలిండర్ పథకం ద్వారా లబ్ధి చేకూరింది. అధిక సంఖ్యలో ఉద్యోగ నియామకాలు చేపడుతున్నాం. గ్రూప్స్ పరీక్షలను రెగ్యులర్‌గా నిర్వహిస్తున్నాం. 11 నెలల్లోనే 50 వేలకు పైగా ఉద్యోగ నియామకాలు చేపట్టాం. నియామకాల్లో ఏ బీజేపీ పాలిత రాష్ట్రంతో పోల్చినా మాదే రికార్డు. హాస్టల్ విద్యార్థుల డైట్, కాస్మోటిక్ ఛార్జీలను 40 శాతానికి పైగా పెంచాం. మూసీ పునరుజ్జీవానికి నడుం బిగించాం. కబ్జాకు గురైన నీటి వనరులను సంరక్షిస్తున్నాం. ఫ్యూచర్ సిటీ కోసం మాస్టర్ ప్లాన్ ఖరారు చేస్తున్నాం. స్కిల్ వర్సిటీ, స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటు చేస్తున్నాం. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నాం. ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానంపై పవిత్రమైన నిబద్ధతతో ఉన్నాం'' అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

**అసలేం జరిగిందంటే..**

ఆర్థికంగా ఆచరణ సాధ్యమైన హామీలు మాత్రమే ఇవ్వాలని తమ పార్టీ నాయకులకు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సూచించిన నేపథ్యంలో ప్రధాని మోదీ తనదైన శైలిలో స్పందించారు. బూటకపు హామీలతో కాంగ్రెస్ చాలాచోట్ల ప్రజల ముందు దోషిగా నిలబడిందని, అందుకే వాస్తవాలను ఆ పార్టీ ఇపుడిపుడే గ్రహిస్తోందని శుక్రవారం ప్రధాని వరుస ట్వీట్లతో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణల్లో అభివృద్ధి కుంటుపడి, ఆర్థిక పరిస్థితి దిగజారిందని ప్రధాని విమర్శించారు. అంతర్గత రాజకీయాలు, దోపిడీలో బిజీగా ఉన్న కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే అమలులో ఉన్న పథకాలను సైతం ఉపసంహరించుకొంటున్నట్లు ఆరోపించారు. హిమాచల్ ప్రదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించడం లేదని, తెలంగాణలో కాంగ్రెస్ హామీ ఇచ్చిన రుణమాఫీ అమలు కోసం రైతులు ఎదురుచూస్తున్నారని మోదీ పేర్కొన్నారు. కాంగ్రెస్ ఉత్తుత్తి హామీల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రధాని కోరారు. ఈ విమర్శల నేపథ్యంలో శనివారం తాజాగా రేవంత్‌రెడ్డి సమాధానమిచ్చారు.

# పట్టాలు తప్పిన రేవంత్ పాలన

**విశ్వంభర, హైదరాబాద్:** మొన్న టీజీఎస్పీ పోలీసుల భార్యలు రోడ్డెక్కితే, నేడు హోంగార్డుల భార్యలు రోడ్డెక్కారని హరీశ్‌రావు అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని, హక్కులను కాపాడాలని ప్రభుత్వాన్ని నిలదీస్తున్నరని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా పోలీసుల ఆందోళనలతో పాటు శాంతి భద్రతలు అడుగంటిన దృశ్యాలే కనిపిస్తున్నాయని అన్నారు. హోం మంత్రిగా కూడా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన పట్టాలు తప్పిందనడానికి ఇంతకంటే నిదర్శనం ఏముంటుందని ప్రశ్నించారు.

**ఏంజరిగింది?**

బెటాలియన్ పోలీస్ కానిస్టేబుళ్లు, వారి కుటుంబసభ్యుల నిరసన సెగలు చల్లారకముందే ఇప్పుడు హోంగార్డుల భార్యలు ఆందోళనలకు దిగారు. తమ సమస్యలను పరిష్కారం కోరుతూ హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్‌లోని ధర్నా చౌక్ వద్ద వద్ద నిరసన దీక్ష చేపట్టారు. హోంగార్డుల ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని.. జీతాలను సరైన సమయానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో అప్రమత్తమైన పోలీసులు హోంగార్డుల భార్యలను అరెస్టు చేసి తరలించారు. ఈ క్రమంలో ప్రభుత్వ తీరుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.


# 'విశ్వమిత్ర'గా ఎదుగుతున్న భారత్

**దిల్లీ:** భారత్‌పై విదేశాంగ మంత్రి ఎస్. జై శంకర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం మన దేశం 'విశ్వమిత్ర'గా ఎదుగుతోందని వ్యాఖ్యానించారు. ప్రపంచ దేశాలతో భారత్ స్నేహం గురించి ప్రస్తావించారు. వీలైనంత ఎక్కువ మందితో స్నేహం చేయాలనుకుంటోందని అన్నారు. దిల్లీలోని ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ''భారత్ నేడు 'విశ్వమిత్ర'గా ఎదుగుతోంది. వీలైనంత ఎక్కువ మందితో సత్సంబంధాలు ఏర్పరుచుకోవాలని అభిప్రాయపడుతోంది. కానీ, అంతర్జాతీయ వేదికపై కొంతమంది స్నేహితులు క్లిష్టంగా ఉండొచ్చు. పరస్పర గౌరవం, దౌత్యపరమైన మర్యాద వంటివి పాటించకపోవచ్చు. అనేక సందర్భాల్లో భారత అంతర్గత వ్యవహారాలపై వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. భాగస్వాములను విశ్లేషించే విషయంలో సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రత వంటి అంశాలు కీలక పాత్ర పోషిస్తాయి'' అని వ్యాఖ్యానించారు.

**వారితో స్నేహం సవాలే..**

కెనడాతో దౌత్య వివాదాలు కొనసాగుతున్న వేళ జైశంకర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ''దేశం ఒక అత్యుత్తమ శక్తిగా మారుతున్న క్రమంలో ప్రపంచ దృష్టి ఆకర్షిస్తుంది. అలాంటి సమయంలో కొన్ని ప్రధాన శక్తులతో స్నేహం చేయడం కూడా ఒక సవాలే'' అని విదేశాంగ మంత్రి అన్నారు. కాగా.. ఖలిస్థానీ మద్దతుదారులను లక్ష్యంగా చేసుకొని భారత ప్రభుత్వ ఏజెంట్లు పనిచేస్తున్నారని, వారికి లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగుతో సంబంధాలున్నాయని కెనడా ఆరోపిస్తోంది. దీంతో ఇరుదేశాల మధ్య దౌత్యవివాదం మొదలైంది.

# రానున్న ఆర్నెళ్లు కీలకం



(మొదటి పేజీ తరువాయి)

వచ్చే ఆరు నెలలు చాలా కీలకమని, సత్తుపల్లి ట్రంక్ కెనాల్, యాతలకుంట వరకు పనులు పూర్తి చేస్తే.. వచ్చే పంటకాలానికి సాగు నీరందించే అవకాశం ఉంటుందన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి డిజైన్లు, టెండర్ల ప్రక్రియ వెంటనే చేపట్టాల్సిందిగా నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధులు కానీ, పరిపాలనా అనుమతులు ఇచ్చే బాధ్యత తాను తీసుకొంటానని, అధికారులు త్వరితగతిన పనులు ఆరంభించాలని ఉత్తమ్ ఆదేశించారు. ప్రతీ 15 రోజులకు పనులపై సమీక్షించి, ఎప్పటికప్పుడు తనకు నివేదిక అందజేయాలని ఆదేశించారు.

# ఉగ్రవాదులను చంపకూడదు

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తమవుతోంది. ఉగ్రవాదులను సజీవంగా పట్టుకునేందుకు ప్రయత్నిస్తే.. సైనికులను వాళ్లు వదిలిపెడతారా? అని ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. కేవలం ప్రభుత్వానికి రాజకీయంగా నష్టం వాటిల్లకుండా ఉండేందుకే ఆయన ఈ వ్యాఖ్యలు చేశారని మండిపడుతున్నాయి. శనివారం ఫరూక్ అబ్దుల్లా మీడియాతో మాట్లాడుతూ.. ఇటీవల బుద్గాంలో జరిగిన ఉగ్రదాడిపై కేంద్రం దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. ఈ ఎన్‌కౌంటర్‌పై ప్రజలకు ఎన్నో అనుమానాలున్నాయని, ప్రభుత్వాన్ని అస్థిర పరచాలనే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ''ఇటీవల జరిగిన ఉగ్రదాడులు ప్రభుత్వాన్ని కూలదోయాలనే లక్ష్యంతో జరిగినట్లు ఎందుకో అనుమానంగా ఉంది. ఈసారి ఉగ్రవాదులను హతమార్చకుండా ప్రాణాలతో పట్టుకుంటే.. వారి వెనక ఎవరున్నారో కూపీ లాగవచ్చు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏదైనా ఏజెన్సీ పని చేస్తుందేమో తెలుసుకోవచ్చు'' అని ఫరూక్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. ఇటీవల జమ్మకశ్మీర్‌లో జరిగిన దాడుల మూలాలు పాకిస్థాన్‌లోనే ఉన్నప్పటికీ.. మరింత కచ్చితమైన వివరాలు తెలుసుకునేందుకు విచారణ అవసరమని ఫరూక్ అబ్దుల్లా స్పష్టం చేశారు.

**ఫరూక్ వ్యాఖ్యలను తేలిగ్గా తీసుకోవద్దు: శరద్ పవార్**

ఉగ్రవాదులను సజీవంగా పట్టుకోవాలన్న ఫరూక్ అబ్దుల్లా వ్యాఖ్యలను ఎన్‌సీపీ-ఎస్‌సీపీ చీఫ్ శరద్ పవార్ సమర్థించారు. ఫరూక్ వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. '' ఫరూక్ అబ్దుల్లా జమ్మకశ్మీర్‌లో చాలా సీనియర్ నేత. అక్కడి పరిస్థితులపై ఆయనకు పూర్తి అవగాహన ఉంది. మొన్నటి వరకు జమ్మకశ్మీర్‌లో ఉగ్రదాడులకు పాకిస్థానే కారణమని చెప్పిన ఆయన.. ఇవాళ ఉగ్రవాదులను ప్రాణాలతో పట్టుకొని, విచారించాలని డిమాండ్ చేస్తున్నారంటే... ఆయన వ్యాఖ్యలను కేంద్రం తేలిగ్గా తీసుకోకూడదు. ముఖ్యంగా హోం శాఖ దీనిపై లోతుగా ఆలోచించి, కసరత్తు చేయాల్సిన అవసరముంది'' అని బారామతి ఎన్నికల ప్రచారంలో సూచించడం గమనార్హం.

**ఉగ్రవాదులకు సరిగ్గా బదులిస్తాం: రాజ్‌నాథ్ సింగ్**

**లక్నో:** జమ్మూకశ్మీర్ లో వరుస ఉగ్ర ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందించారు. జమ్మూకశ్మీర్‌లో ఇలాంటి దాడులు దురదృష్టకరమని అన్నారు. ఉగ్రవాదులకు దీటైన బదులు ఇస్తామని హెచ్చరించారు. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో జరిగిన మీడియా సమావేశంలో రాజ్‌నాథ్ సింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ''జమ్మూకశ్మీర్‌లో ఉగ్రదాడులు నిజంగా దురదృష్టకరం. గతంతో పోలిస్తే ఇటీవల కాలంలో ఈ దాడులు తగ్గుముఖం పట్టాయి. స్థానికంగా భద్రతాపరంగా ఎటువంటి లోపాలు లేవు. మన భద్రతా దళాలు అప్రమత్తంగా ఉన్నాయి. జమ్మూకశ్మీర్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. అతి త్వరలోనే అక్కడ ఉగ్రవాద కార్యకలాపాలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోతాయి. ఉగ్రవాదులకు మన సైన్యం తగిన బుద్ధి చెబుతోంది. ఇప్పటివరకు ఎందరో ఉగ్రవాదులను మట్టుపెట్టాం'' అని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.

# దెబ్బతిన్న వ్యవస్థలను పునరుద్ధరించాలి

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలోని యూనివర్సిటీలను నూటికి నూరు శాతం ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని, ఉన్నత విద్యకు సంబంధించి గడిచిన పదేండ్లలో దెబ్బతిన్న వ్యవస్థలను తిరిగి పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నత విద్యా మండలికి, వైస్ ఛాన్సలర్లకు సూచించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఉన్నత విద్యా మండలి ఛైర్మన్తో పాటు అన్ని యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్లు ముఖ్యమంత్రితో జూబ్లీహిల్స్ నివాసంలో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా విద్యామండలి, వీసీలకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఎవరి ప్రభావితంతోనో వైఎస్ ఛాన్సలర్ పోస్టులకు ఎంపిక జరగలేదు. మెరిట్, సామాజిక సమీకరణల ఆధారంగానే ఎంపిక జరిగింది. బాగా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు. కొంతకాలంగా యూనివర్సిటీల పట్ల విశ్వాసం సన్నగిల్లిందని . తిరిగి వర్సిటీల గౌరవం పెంచే దిశగా పని చేయాలని సీఎం పేర్కొన్నారు.

**ఆయన మాటల్లో ముఖ్యాంశాలు..**

- యూనివర్సిటీలను 100 శాతం ప్రక్షాళన చేయాలి. గతంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్లను విద్యార్థులు యేళ్ల తరబడి గుర్తు పెట్టుకునేవాళ్లు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.
- యూనివర్సిటీ ప్రస్తుత పరిస్థితులపై సమగ్ర అధ్యయనం చేసి ప్రమాణాలను పెంచే చర్యలు మొదలు పెట్టాలి. అవసరమైతే కన్సల్టెన్సీలను ఏర్పాటు చేసుకొని నివేదిక తయారు చేసుకోవాలి. వ్యవస్థల పునరుద్ధరణకు ఏం చేయాలో అధ్యయనం చేయాలి.
- మంచి పని చేయడానికి వైస్ ఛాన్సలర్లకు స్వేచ్ఛ ఉంటుంది. ప్రభుత్వ సహకారం ఉంటుంది. తప్పు జరిగితే ఆశ్చర్యకరమైన నిర్ణయాలు తీసుకోవాల్సివస్తుంది.
- యూనివర్సిటీల్లో డ్రగ్స్, గంజాయి విక్రయాలపైన దృష్టి సారించాలి. అలాంటి విద్యార్థులను గమనించి కౌన్సెలింగ్ ఇవ్వాలి.

సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి , తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొ. బాలకృష్ణా రెడ్డి, కార్యదర్శి ప్రొ. శ్రీరాం వెంకటేశ్, విద్యా శాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశంతో పాటు ఆయా వర్సిటీలకు కొత్తగా నియమితులైన వైస్ ఛాన్సలర్లు ప్రొ. ఎం. కుమార్ (ఉస్మానియా), ప్రొ. ప్రతాప రెడ్డి (కాకతీయ), ప్రొ. జీఎన్ శ్రీనివాస్ (పాలమూరు), ప్రొ. నిత్యానంద రావు (తెలుగు), ప్రొ. అల్తాఫ్ హుస్సేన్ (మహాత్మాగాంధీ), ప్రొ. యాదగిరి రావు (తెలంగాణ), ప్రొ. అల్దాస్ జానయ్య (జయశంకర్ వ్యవసాయ), ప్రొ. రాజిరెడ్డి (కొండాలక్ష్మణ్ బాపూజీ ఉద్యాన వర్సిటీ), ప్రొ. ఉమేష్ కుమార్ (శాతవాహన), ప్రొ. సూర్య ధనుంజయ (మహిళా వర్సిటీ), ప్రొ. గోవర్ధన్ (బాసర ఐఐఐటీ) ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

# రానున్న నాలుగేళ్లూ రేవంత్ రెడ్డినే సీఎం

- ఆలస్యమైనా బాంబులు పేలుతాయి
- మంత్రి పొంగులేటి



**విశ్వంభర, హైదరాబాద్:** రానున్న నాలుగేళ్ల పాటు రేవంత్ రెడ్డినే తెలంగాణ సీఎంగా కొనసాగుతారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యలను చిట్ చాట్‌లో జర్నలిస్టులు ప్రస్తావించగా.. ప్రతిపక్ష నేతలు మీడియా దృష్టిని ఆకర్షించేందుకు ఏదేదో మాట్లాడారని.. అవన్నీ టీ కప్పులో తుపాను లాంటివని పొంగులేటి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో సీఎం మార్పు ఉండదన్నారు. కాంగ్రెస్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం ఎవరనేది ఏఐసీసీ నిర్ణయిస్తుందన్నారు. అప్పుడు ఏం జరుగుతుందో ఇప్పుడే ఎలా చెప్పగలమన్నారు. డిసెంబరు చివరి నాటికి పంచాయతీ ఎన్నికలు జరగవచ్చునని మంత్రి పొంగులేటి తెలిపారు. సియోల్ నుంచి వచ్చే లోపే పొలిటికల్ బాంబులు పేలుతాయని చెప్పినప్పటికీ... ఒకటి, రెండు రోజులు ఆలస్యం కావచ్చన్నారు.

# ఓటీఎస్ గడువు పొడిగించిన జలమండలి

**నవంబరు 30 వరకు అవకాశం**

**విశ్వంభర, హైదరాబాద్:** మొండి బకాయిల వసూలుకు జలమండలి తీసుకువచ్చిన వన్‌టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్) గడువును మరో నెల రోజులు పొడిగించారు. గురువారంతో గడువు ముగిసిన నేపథ్యంలో మరో నెలరోజులు పొడిగించాలని జలమండలి ఎండీ కె.అశోక్‌రెడ్డి పురపాలకశాఖకు లేఖ రాశారు. దీంతో ఓటీఎస్ గడువును నవంబరు 30 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం నుంచి ఆమోదం లభించింది. బకాయిల చెల్లింపునకు వడ్డీ, అపరాధ రుసుం మాఫీ చేస్తూ అసలు మాత్రం చెల్లించేలా ఓటీఎస్‌ను అక్టోబర్ 1నుంచి అమలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 70,335 మంది వినియోగించుకున్నారని జలమండలి అధికారులు తెలిపారు. వాస్తవంగా అక్టోబర్ 1నుంచి ఓటీఎస్ అమల్లోకి వచ్చినట్లున్నా ఉత్తర్వులు వెలువడటానికి ఐదు రోజులు పట్టింది. దీంతో పాటు దసరా, బతుకమ్మ పండగ సెలవుల నేపథ్యంలో ఓటీఎస్‌ను పూర్తిస్థాయిలో ఉపయోగించుకోలేక పోయారని జలమండలి భావిస్తోంది. స్పందన 30 శాతంలోపే ఉండటంతో వినియోగదారుల డిమాండ్ మేరకు మరో నెలరోజులు పొడిగిస్తున్నట్టు జలమండలి ఎండీ తెలిపారు.



# స్పెయిన్‌లో విలయం సృష్టించిన వరదలు

**మాడ్రిడ్:** దేశ చరిత్రలోనే కనీవినీ ఎరుగని వరదలు స్పెయిన్‌లో విలయాన్ని సృష్టించాయి. తూర్పు స్పెయిన్‌లో మూడు రోజుల క్రితం సంభవించిన ఆకస్మిక వరదల కారణంగా 205మంది మృత్యువాత పడ్డారు. వారిలో వాలెన్సియాలోనే ఏకంగా 202 మంది చనిపోయారు. మరో ఇద్దరు కాస్టిల్లా మంచా రీజియన్‌లో, ఇంకొకరు యాండలూసిలో ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటికీ పదుల సంఖ్యలో నగరాలు నీట మునిగే ఉన్నాయి. అనేక మంది గల్లంతయ్యారు. సహాయక బృందాలు, సైనికులు అనేక మందిని రక్షించారు. కార్లు, శిథిల భవనాల్లోని మృతదేహాలను వెలికితీసే ప్రయత్నం చేస్తున్నారు. భవనాలు, కార్లపై చిక్కుకున్న పౌరులను హెలికాప్టర్లలో సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. జలదిగ్బంధంలో చిక్కుకున్న ఇళ్లు కూలిపోయాయి. వందలాది కార్లు కొట్టుకుపోయాయి. వాలెన్సియా ప్రాంతంలోని పలు నగరాల వీధులు వరద విలయానికి సాక్ష్యంగా నిలుస్తున్నాయి. భారీ వృక్షాలు, విద్యుత్ లైన్లు, ఇళ్లలోని సామగ్రి కొట్టుకుపోగా... దుకాణాలు బురదలో కూరుకుపోయాయి. రోడ్లు, వీధుల్లో పేరుకుపోయిన బురదను తొలగించడానికి ప్రజలు, వాలంటీర్లు శ్రమిస్తున్నారు. బాధితులను ఆదుకోవడానికి ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు నీళ్లు, ఆహార పదార్థాలు, పాలు, మందులను తీసుకుని వాలెన్సియాకు వస్తున్నారు. ఆపన్నహస్తాలు అందిద్దామంటూ దేశ ప్రజలను ఉద్దేశించి సోషల్‌మీడియాలో ప్రచారం చేస్తున్నారు. మరోవైపు దేశ వాతావరణ సంస్థ అతిభారీ తుపాన్ల హెచ్చరికలను జారీ చేస్తోంది.

# తెలంగాణలో మళ్లీ ఎమర్జెన్సీ రోజులు

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాస్వామిక తెలంగాణ పునరుద్ధరణ కోసం పోరాడతామన్నారు.

**తెలంగాణలో పంట దిగుబడిలోనే కాదు.. పశు సంపదలోనూ వృద్ధి**

తెలంగాణలో పశుసంపద కారణంగా రూ.2వేల కోట్ల వృద్ధి జరిగిందని కేంద్రం ప్రకటించడంపై బీఆరెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హర్షం వ్యక్తంచేశారు. గత పదేళ్లలో పంట దిగుబడిలోనే కాదు.. పశు సంపదలోనూ రాష్ట్రం అభివృద్ధి సాధించిందని 'ఎక్స్'లో తెలిపారు. కులవృత్తులకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అండగా ఉన్నందున.. పశుసంపదలోనూ గణనీయ వృద్ధి సాధించిందన్నారు. గ్రామీణ తెలంగాణలో ఉపాధి పెంచాలనే ఆలోచన, సంపద సృష్టిలో గ్రామాలను భాగం చేయాలనే తపనతో గత ప్రభుత్వం పనిచేసిందన్నారు. డిమాండ్‌కు తగ్గట్టుగా మాంసం, పౌల్ట్రీ ఉత్పత్తులను పెంచే ప్రయత్నం చేశామన్న కేటీఆర్.. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే దిగుబడికి కళ్లెం వేసినట్లైందన్నారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన ప్రతీ పథకం దీర్ఘదృష్టితో తీసుకొచ్చిందేనని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో చేప పిల్లలు, గొర్రెల పంపిణీ లేదని దుయ్యబట్టారు. కులవృత్తులను రూపుమాపేందుకు కుట్ర చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలని హితవు పలికారు.

# మెట్రో రైలు రెండో దశకు పరిపాలన అనుమతులు

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టేందుకు అనుమతి లభించింది. ఈ మేరకు ప్రభుత్వం జీవో 196ను జారీ చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రెండో దశ ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టనున్నారు. మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.24,269 కోట్లు కాగా.. రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.7,313 కోట్లను వెచ్చించనుంది.

**రెండో దశ పార్ట్-ఏలో ఐదు కారిడార్ల నిర్మాణం**

- కారిడార్ 4 - నాగోలు నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు (36.8కి.మీ)
- కారిడార్ 5 - రాయదుర్గం నుంచి కోకాపేట నియోపోలిస్ (11.6 కి.మీ)
- కారిడార్ 6 - ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట (7.5 కి.మీ)
- కారిడార్ 7 - మియాపూర్ నుంచి పటాన్‌చెరు (13.4 కి.మీ)
- కారిడార్ 8 - ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ (7.1 కి.మీ)
- మెట్రో రైలు రెండో దశ పార్ట్-బి
- కారిడార్ 9 - శంషాబాద్ నుంచి ఫ్యూచర్ సిటీ

# ఝార్ఖండ్‌లో కాంగ్రెస్ విజయంతోనే రాజ్యాంగ పరిరక్షణ

(మొదటి పేజీ తరువాయి)

భట్టి విక్రమార్క అన్నారు. ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ఏఐసీసీ సీనియర్ పరిశీలకుడు, స్టార్ క్యాంపెయినర్‌అయిన ఆయన శనివారం ఆ రాష్ట్రంలోని రాంగఢ్ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. నియోజకవర్గంలోని దుల్మి, చిత్తార్పూర్, గోలాస్ బ్లాక్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశాల్లో పాల్గొన్నారు. ఇంటింటి ప్రచారం, బూత్ లెవల్ మీటింగ్స్ ఏర్పాటు, సోషల్ మీడియా ప్రచారం వంటి అంశాలపై స్థానిక కాంగ్రెస్ నేతలకు సూచనలు ఇచ్చారు. అక్కడ పోటీచేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి మమతాదేవిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. పౌరులందరికీ సాంఘిక, ఆర్థిక, రాజకీయ, న్యాయ, భావ ప్రకటన, అవకాశాల్లోనూ సమానత్వం ఉండాలని రాజ్యాంగం ద్వారా శాసనం రూపొందించుకున్నామని వివరించారు. లక్ష్యం చేరుకోవాలంటే ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమి అభ్యర్థుల గెలుపు కీలకమని పార్టీ నేతలకు సూచించారు.

# టీటీడీకి..వక్ఫ్ బోర్డుకు పోలికా?

- ఆ రెండింటికి తేడా తెలియని అజ్ఞాని ఓవైసీ
- ఓల్డ్ సిటీ ఇన్నాళ్లుగా ఎందుకు న్యూసిటీ ఎందుకు కాలేదో అర్థమైందా?
- బీఆరెస్‌తో ఎంఐఎం తెగదెంపులకు సిద్ధమైనట్లుంది
- కేంద్ర మంత్రి బండి సంజయ్



**విశ్వంభర, హైదరాబాద్:** టీటీడీలో హిందువులు మాత్రమే పనిచేయాలని చెబుతున్న నరేంద్ర మోదీ సర్కార్ వక్ఫ్ బోర్డ్‌లో ముస్లిమేతరులకు చోటు కల్పించాలని బిల్లు రూపొందించడమేందని మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మతాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయ వ్యాపారం చేస్తున్న అసదుద్దీన్ ఒవైసీ అసలు రంగు ఈరోజు పూర్తిగా బయటపడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరమ పవిత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానానికి, వక్ఫ్ బోర్డు భూములకు లింకు పెట్టడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.

"కలియుగ ప్రత్యక్ష దైవం, ఆ వైకుంఠాధీశుడు కొలువైన పరమ పవిత్రమైన స్థలం తిరుమల తిరుపతి దేవస్థానం. వక్ఫ్ బోర్డు అనేది కేవలం భూములకు సంబంధించిన వ్యవహారం మాత్రమే. మీరు ప్రార్థించే మక్కా మసీదు కూడా కాదు. అయినా సిగ్గులేకుండా టీటీడీకి, వక్ఫ్ బోర్డు పేరుతో సాగిస్తున్న భూముల దందాకు లింకు పెడతవా? ఒవైసీ" అంటూ మండిపడ్డారు. టీటీడీలో ముస్లిమేతరులకు స్థానం కల్పించనప్పుడు వక్ఫ్ బోర్డులో హిందువులకు ఎందుకు స్థానం కల్పించాలంటూ ఒవైసీ చేసిన వ్యాఖ్యలనూ బండి సంజయ్ తీవ్రంగా తప్పుపట్టారు. వక్ఫ్ బోర్డు భూములు పేద ముస్లింలకు మాత్రమే దక్కాలన్నదే కేంద్ర ప్రభుత్వం ఉద్దేశమని, అందులో భాగంగానే వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు తీసుకొచ్చిందని తెలిపారు. టీటీడీ తనకు వచ్చిన విరాళాలతో పేదలకు, హిందూ ధార్మిక సంస్థలకు సాయం చేస్తోందే తప్ప...ఏనాడూ ప్రజల ఆస్తులను కబ్జా చేసుకోలేదని చెప్పారు. "ఒవైసీ దృష్టిలో భగవంతుడంటే వ్యాపారమే. అల్లా పేరు చెప్పుకుని భూములను దోచుకున్నడు. వేల ఎకరాలను కబ్జా చేసిండు. కాలేజీలు, ఆసుపత్రులు కట్టి వేల కోట్ల రూపాయలు దోచుకుంటుండు. చివరికి చెరువులను, శిఖం భూములను కూడా కబ్జా చేసి భవంతులు కట్టుకున్నడు. అట్లాంటి మతోన్మాది దేవుడిని వ్యాపార వస్తువుగా, అవకాశవాద అంశంగా మార్చుకోకుండా మాట్లాడగలడా?" అని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా పాతబస్తీ వాసులను ఉద్దేశించి బండి సంజయ్ మాట్లాడుతూ "ఒవైసీ మాటలు నమ్మి దశాబ్దాలుగా మోసపోతున్న పాత బస్తీ ముస్లిం సోదరులకు నేను చెప్పేదొక్కంటే "ఇకనైనా వాస్తవాలు ఆలోచించాలి. దశాబ్దాల తరబడి ఓట్లేసి మీరు ఎంఐఎంను గెలిపిస్తున్నరు. అయినా ఓల్డ్ సిటీ ఇంకా ఎందుకు ఓల్డ్ సిటీగానే మిగిలిపోయింది? సైబరాబాద్ లాగా న్యూసిటీ ఎందుకు కాలేకపోయింది? కనీసం పాత బస్తీకి మెట్రో ఎందుకు రాలేకపోయింది? మీరింకా పాన్ షాపులు నడుపుకుంటూ, పంక్చర్లు వేసుకుంటూ, తినడానికి తిండిలేక సరైన ఇల్లు లేక ఎందుకు అల్లాడుతున్నరు?. మీ పిల్లలకు మంచి చదువులు ఎందుకు చదివించలేకపోతున్నరు? మంచి వైద్యం ఎందుకు అందించలేకపోతున్నరు? అదే సమయంలో మీ ఓట్లతో గెలిచిన ఒవైసీ కుటుంబం వక్ఫ్ భూములను ఆక్రమించి, చెరువు శిఖం భూములను కబ్జా చేసి కాలేజీలు, ఆసుపత్రులు కట్టి సేవ పేరుతో లక్షల కోట్ల రూపాయలు ఎట్లా దోచుకుంటున్నరు? అద్దాల భవంతుల్లో ఎట్లా తుల తూగుతున్నరు?ఒక్కసారి ఆలోచించండి" అని కోరారు.

"బీఆర్ఎస్ జాతకాలు మా దగ్గర ఉన్నాయి. అవి చెబితే వాళ్లు తట్టుకోలేరు. ఆ విషయాలన్నీ నేను ఇప్పుడు బయట పెట్టాలా ?" అంటూ అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలపైనా బండి సంజయ్ తనదైన శైలిలో స్పందించారు. "తెలంగాణ సెంటిమెంట్ ను అడ్డుపెట్టుకుని రెచ్చగొట్టి ఓట్లేయించుకుని అధికారంలోకి వచ్చిన కుటుంబ పార్టీ(బీఆర్ఎస్)తో పదేళ్లు అంటకాగిన నిఖార్సయిన దేశద్రోహ(ఎంఐఎం) పార్టీ ఇప్పుడు తన నిజస్వరూపాన్ని బయటపెట్టింది. తన అవసరార్ధ మిత్రుడి (బీఆర్ఎస్)ని మించి హామీలిచ్చి అధికారంలోకి వచ్చి రాజ్యమేలుతున్న నకిలీ గాంధీ వారసుల పార్టీ(కాంగ్రెస్)ని మచ్చిక చేసుకునేందుకు తంటాలు పడుతోంది. పాపం, ఒవైసీ సోదరుల శీల పరీక్ష గడువు ముగిసినట్లుంది. నీళ్లు, నిధులు, నియామకాలు, ప్రజాస్వామిక తెలంగాణ నినాదంతో ప్రజల్ని నమ్మించి ఓట్లేయించుకుని అధికారంలోకి వచ్చాక తెలంగాణ ప్రజలను బిచ్చగాళ్లను చేసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన కల్వకుంట్ల కుటుంబాన్ని వాడుకుని వదిలేసింది. నకిలీ గాంధీ కుటుంబ వారసత్వ రాజకీయాలతో దేశాన్ని దోచుకునేందుకు సిద్ధమైన కాంగ్రెస్ పార్టీతో అంటకాగేందుకు సిద్ధమైంది. కల్వకుంట్ల కుటుంబమా? ఇకనైనా సిగ్గుతో తలదించుకోండి. రాజకీయ మతోన్మాదంతో రగిలిపోతూ జన్మనిచ్చిన తల్లికే వెన్నుపోటు పొడుస్తూ దేశద్రోహానికి పాల్పడుతున్న (ఎంఐఎం) పార్టీతో అంటకాగినందుకు ముక్కు నేలకురాసి యావత్ తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పండి."అని సూచించారు."కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం కార్యకర్తలారా దేశం కోసం, ధర్మం కోసం త్యాగం చేస్తే మీ పేరు చరిత్రలో నిలిచిపోతోంది. కానీ కేసీఆర్, ఒవైసీ, నకిలీ గాంధీ కుటుంబాల అవకాశవాద రాజకీయాల కోసం మీ జీవితాలను ఎందుకు నాశనం చేసుకుంటారు? ఒక్కసారి ఆలోచించండి"అని హితవు పలికారు.

## 5న రాహుల్‌గాంధీ రాక

- కుల గణనపై వివరాలు తీసుకుంటారు
- మంత్రులు, ఎమ్మెల్యేలు స్వేచ్ఛగా పనిచేస్తున్నారు
- మహేశ్‌కుమార్‌గౌడ్



**విశ్వంభర, హైదరాబాద్:** నవంబరు 5న జరిగే పీసీసీ సమావేశంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పాల్గొంటారని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే కులగణనపై రాహుల్‌గాంధీ వివరాలు తీసుకుంటారని వెల్లడించారు. శనివారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడారు.

"ప్రధాని మోదీ ఎప్పుడూ వాస్తవాలు తెలుసుకునే ప్రయత్నం చేయరు. కానీ, విమర్శలను కూడా రాహుల్‌గాంధీ పాజిటివ్‌గా తీసుకుంటారు. కులగణన కోసం కనెక్టింగ్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేశాం. ఎమ్మెల్యేలు ఇన్‌ఛార్జిలుగా వెళ్తారు. కులగణన విషయంలో రాహుల్‌గాంధీ చిత్తశుద్ధితో ఉన్నారు. వంచించిన కేసీఆర్‌ను దించి ప్రజలు మాకు అధికారం కట్టబెట్టారు. సీఎం, మంత్రులు, పార్టీ నేతలు ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజలు కోరుకున్న విధంగా ప్రజా పాలన అందిస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు స్వేచ్ఛగా పనిచేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సజావుగా నడుస్తోంది. మహేశ్వర్‌రెడ్డికి బీజేఎల్పీ నాయకుడిగా బీజేపీలో దక్కుతున్న గౌరవమేంటో ఆలోచించుకోవాలి. బీజేపీ కార్యాలయంలో ఆయనకు కుర్చీలేదు, ఒక స్థానం లేదు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న ప్రజాస్వామిక స్వేచ్ఛ.. ఏ ఇతర పార్టీలోనూ లేదు. బీజేపీలో అంతకన్నా లేదు" అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.

## నేను నోరు విప్పితే బీఆరెస్ వాళ్లు ఇబ్బంది పడతారు

- వాళ్లు ఆత్మపరిశీలన చేసుకోవాలి
- ఎంపీ అసదుద్దీన్



**విశ్వంభర, హైదరాబాద్:** బీఆరెస్ నేతలు ఆత్మపరిశీలన చేసుకోవాలని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. "మూసీ ప్రక్షాళన కోసం బీఆరెస్ ప్రణాళికలు చేయలేదా? ఆ ప్రణాళిక వద్దని నేను చెప్పలేదా? అప్పటి విషయాలన్నీ ఇప్పుడు బయటపెట్టాలా? నేను నోరు విప్పితే బీఆరెస్ వాళ్లు ఇబ్బంది పడతారు. ఇళ్లు కదల్చకుండా మూసీ ప్రక్షాళన చేస్తే స్వాగతిస్తాం. బీఆరెస్ విధానాలు స్థిరంగా ఉండాలి. ఆ పార్టీకి జీహెచ్ఎంసీలో ఎక్కువ సీట్లు మా చలవే. ఎంఐఎం మద్దతుతోనే ఎక్కువ సీట్లు వచ్చాయి. 24 మందిని మార్చి ఉంటే బీఆరెస్ మళ్లీ గెలిచేది. అప్పట్లో ఆ పార్టీ నేతలకు అహంకారం ఉండేది. ఎక్కువ మంది సంతానం ఉండాలని చంద్రబాబు, స్టాలిన్ అంటున్నారు. అదే విషయాన్ని నేను చెప్పి ఉంటే రాద్ధాంతం చేసేవారు. దక్షిణ భారత్‌లో జననాల రేటు తక్కువగా ఉందని చంద్రబాబు గుర్తించారు. జనాభా ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాదికి నష్టం. అసెంబ్లీ, లోక్‌సభ స్థానాల సంఖ్య తగ్గుతుంది. బాగా పనిచేసిన రాష్ట్రాలను ప్రోత్సహించకుండా శిక్షిస్తే ఏం లాభం?" అని అసదుద్దీన్ ప్రశ్నించారు.

## కార్తీక మాసంలో శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

- టీజీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ వెల్లడి

**విశ్వంభర, హైదరాబాద్:** పవిత్ర కార్తీక మాసంలో ప్రసిద్ధ శైవ క్షేత్రాలకు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. శ్రీశైలం, వేములవాడ, ధర్మపురి, కీసరగుట్ట, తదితర దేవాలయాలకు హైదరాబాద్ నుంచి స్పెషల్ బస్సులను నడుపుతున్నామని ఆయన పేర్కొన్నారు. ఆర్టీసీ పనితీరు, కార్తీక మాసం ఛాలెంజ్, శబరిమల ఆపరేషన్స్, మహాలక్ష్మిమహిళలకు ఉచిత బస్సు సౌకర్య పథకం, తదితర అంశాలపై హైదరాబాద్ బస్ భవన్ నుంచి టీజీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ వర్చువల్‌గా ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆర్టీసీకి కార్తీక మాసం, శబరిమల ఆపరేషన్స్ ఎంతో కీలకమని, భక్తులకు అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా అధికారులకు సజ్జనార్ దిశానిర్దేశం చేశారు. ఆది, సోమవారాలు శైవక్షేత్రాలకు భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, అందుకు అనుగుణంగా ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈ నెల 15న కార్తీక పౌర్ణమి నేపథ్యంలో తమిళనాడులోని అరుణాచలానికి ప్రత్యేక ప్యాకేజీని అందిస్తున్నామని సజ్జనార్ తెలిపారు. అలాగే, ఏపీలోని పంచారామాలకు ప్రతి సోమవారం ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు వివరించారు. ఈ ప్రత్యేక బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్‌ను http://tgsrtcbus.in వెబ్‌సైట్‌లో చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040 69440000, 04023450033 సంప్రదించాలని సూచించారు.

**బస్ ఆన్ కాంట్రాక్ట్(బీవోసీ) ఛార్జీల తగ్గింపు**

అద్దె ప్రాతిపదికన ఆర్టీసీ బస్సు ఛార్జీలను తగ్గించినట్లు సజ్జనార్ తెలిపారు. పల్లె వెలుగు కిలోమీటర్‌కు రూ.11, ఎక్స్ ప్రెస్ రూ.7, డిలక్స్ రూ.8, సూపర్ లగ్జరీ రూ.6, రాజధాని రూ.7 మేర తగ్గించినట్లు పేర్కొన్నారు. శబరిమలకు, శుభ ముహూర్తాలకు అద్దెకు ఆర్టీసీ బస్సులను బుకింగ్ చేసుకుని.. క్షేమంగా గమ్య స్థానాలకు చేరుకోవాలని సూచించారు.

## ఈసారి మాత్రమే కాదు.. మరో పదేళ్లపాటు సీఎంగా రేవంత్‌రెడ్డి

- మల్లు రవి



**విశ్వంభర, హైదరాబాద్:** నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి బీజేపీ శాసనసభాపక్ష నేత మహేశ్వర్ రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈసారి మాత్రమే కాదు.. మరో పదేళ్లపాటు సీఎంగా కొనసాగుతారని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డిపై మహేశ్వర్ రెడ్డి మాట్లాడిన తీరు ఆయన రాజకీయ అజ్ఞానానికి పరాకాష్ఠ అని పేర్కొన్నారు. మహేశ్వర్ రెడ్డికి బీజేపీలో పని ఏమీ లేక పగటి కలలు కంటూ ప్రభుత్వంపై వ్యాఖ్యలు చేస్తున్నారంటూ ఆయన ఓ ప్రకటనలో అభిప్రాయపడ్డారు. బీజేపీలో రోజురోజుకూ ముదిరిపోతున్న విభేదాలు, వర్గపోరు నుంచి అందరి దృష్టిని మరల్చేందుకు ఇలాంటి జాతకాలు చెబుతున్నారని దుయ్యబట్టారు.

## మెదక్ జిల్లాలో ఘోర ప్రమాదం

- ట్రాక్టర్, ద్విచక్ర వాహనం ఢీకొని నలుగురి మృతి
- మృతుల్లో ఇద్దరు పిల్లలు

**విశ్వంభర, మనోహరాబాద్:** మెదక్ జిల్లాలో శనివారం సాయంత్రం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మనోహరాబాద్ మండలం పోతారం వద్ద రోడ్డుపై స్థానిక రైతులు ధాన్యం ఆరబోశారు. ధాన్యం కుప్పలు ఉండడంతో రోడ్డుకు ఒకవైపు నుంచే వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఎదురుగా వచ్చిన ట్రాక్టర్.. ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న ఆంజనేయులు, ఆయన మరదలు లత, ఆమె ఇద్దరు పిల్లలు ప్రమాద స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు.

## నాగార్జున సాగర్ నుంచి శ్రీశైలం వరకు లాంచీ ప్రయాణం



**విశ్వంభర, నాగార్జునసాగర్:** పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ఎదురుచూస్తున్న నాగార్జున సాగర్ నుంచి శ్రీశైలం వరకు బోటు ప్రయాణాన్ని కార్తిక మాసం తొలి రోజున తెలంగాణ పర్యాటక శాఖ ప్రారంభించింది. గత ఐదేళ్లుగా ప్రణాళికలు వేసినప్పటికీ.. సాగర్‌లో సరైన స్థాయిలో నీరు లేకపోవడం, కరోనా మహమ్మారి తదితర కారణాలవల్ల వాయిదా పడుతూ వచ్చింది. ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో కృష్ణానదిలో.. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్ వరకు గరిష్ఠ స్థాయిలో నీటి లభ్యత ఉంది. దీంతో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ లాంచీ ప్రయాణాన్ని ప్రారంభించింది. దాదాపు 120 కిలోమీటర్ల దూరం ఉండే ఈ ప్రయాణానికి మొదటి రోజు రాష్ట్రంతోపాటు పరిసర ప్రాంతాల నుంచి కూడా పెద్ద ఎత్తున పర్యాటకులు తరలివచ్చారు.

నాగార్జున సాగర్ నుంచి నందికొండ మీదుగా ఏలేశ్వరం, సలేశ్వరం, తూర్పు కనుమలు, నల్లమల అటవీ ప్రాంత అందాలను వీక్షించేలా లాంచీ ప్రయాణానికి పర్యాటక శాఖ శ్రీకారం చుట్టింది. మరొక మార్గంలో నాగర్ కర్నూల్ జిల్లా సోమశిల నుంచి శ్రీశైలం వరకు లాంచీ సేవలను కూడా పర్యాటకాభివృద్ధి సంస్థ అందుబాటులోకి తీసుకొచ్చింది. కొల్లాపూర్ మండలం సోమశిల తీరంలో 120 మంది ప్రయాణించేలా ఏసీ లాంచీని అధికారులు శనివారం ప్రారంభించారు. అక్కణ్నుంచి శ్రీశైలం వరకు 120 కిలోమీటర్ల మేర 7 గంటలపాటు ఈ ప్రయాణం ఉంటుంది. లాంచీ ప్రయాణానికి పెద్దలకు రూ.2 వేలు, పిల్లలకు రూ.1,600గా టికెట్ ధరలు నిర్ణయించారు. నాగార్జునసాగర్ డ్యాంలో నీటి మట్టం 575 అడుగులు ఉన్నంత వరకు, ప్రయాణికుల రద్దీని బట్టి శ్రీశైలానికి లాంచీలు నడపనున్నట్లు పర్యాటకాభివృద్ధి సంస్థ తెలిపింది.

## జీపీ లేఅవుట్లలో రిజిస్ట్రేషన్లు నిలిపివేయడం మూర్ఖపు చర్య

- తుగ్లక్‌ను తలపించేలా సీఎం నిర్ణయాలు
- పేద, మధ్య తరగతిని ఇబ్బంది పెట్టేలా పాలన
- బీఆరెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**విశ్వంభర, హైదరాబాద్:** హెచ్ఎండీఏ పరిధిలోని గ్రామ పంచాయతీ లేఅవుట్లలో వెలిసిన వెంచర్లలో రిజిస్ట్రేషన్లు నిలిపివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మూర్ఖపు చర్య అని బీఆరెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పేదలు, మధ్య తరగతి ప్రజల గురించి ఏమాత్రం ఆలోచించకుండా ఇలాంటి పిచ్చి నిర్ణయాలు తీసుకోవటం ఆశ్చర్యం కలిగిస్తోందని మండిపడ్డారు. పరిపాలనా అనుభవం లేకుండా తుగ్లక్‌ను తలపించేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆక్షేపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పేద, మధ్య తరగతి ప్రజలను టార్గెట్ చేసిందని ధ్వజమెత్తారు. మొన్నటి వరకు హైడ్రా, మూసీ పేరుతో పేదల గూడు కూల్చివేసిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు తాజాగా హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న పేదలు, మధ్య తరగతిని టార్గెట్ చేశారని అన్నారు. పేదలు, మధ్యతరగతి ప్రజల ప్లాట్లపైనా ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేసే కుట్ర జరుగుతోందని విమర్శించారు. హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న జీపీ లేఅవుట్లలో వేసిన వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేయడం ప్రజల తప్పా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఎల్ఆర్ఎస్ ఉచితంగా చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని గుర్తు చేశారు. ఎన్నో ఏళ్లుగా ఆ ప్లాట్లు ఎంతో మంది చేతులు మారాయని.. ఇప్పుడు ప్రభుత్వం వచ్చి రిజిస్ట్రేషన్లు చెల్లుబాటు కావంటే వారి పరిస్థితి ఏమవుతుందని ప్రశ్నించారు. ప్రభుత్వం ఏళ్ల తరబడి నెలకొన్న సమస్యలను పరిష్కరించాల్సింది పోయి.. లేని సమస్యలను సృష్టిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి చేస్తున్న పనులకు పేద, మధ్య తరగతి ప్రజలే సమిధలవుతున్నారని ఘాటుగా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే వేలాదిగా గ్రామ పంచాయతీ లేఅవుట్లు వెలిశాయని, ఎంతో మంది చేతులు మారాయని వివరించారు. ఇప్పుడు వాటికి ఎవరిని బాధ్యుల్ని చేస్తారని ప్రశ్నించారు. భవిష్యత్‌లో పిల్లల చదువులు, పెళ్లిళ్ల కోసం పైసా పైసా కూడబెట్టుకొని పేదలు, మధ్య తరగతి ప్రజలు కొనుగోలు చేసిన ప్లాట్ల రిజిస్ట్రేషన్లు ఇప్పుడు చెల్లుబాటు కావంటే వారి పరిస్థితి ఏం కావాలో చెప్పాలని కేటీఆర్ ప్రశ్నించారు.

## నాణెం లభిస్తే భాగ్యమే

- చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో రద్దీ
- నేడు కూడా వెండి కాయిన్స్ పంపిణీ

**విశ్వంభర, హైదరాబాద్ :** చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయానికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. అమ్మవారి ప్రతిమ ఉన్న కాయిన్స్‌తో పాటు కుబేర పూజ చేసిన నాణేలను ప్రసాదంగా పంపిణీ చేస్తుండటంతో భారీగా భక్తులు తరలివస్తున్నారు. అమ్మవారి నాణెం లభిస్తే తమకు సకల శుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. గురువారం నాణేల పంపిణీ ప్రారంభం కాగా.. ఆదివారం వరకు కొనసాగనుంది. భారీగా తరలివస్తున్న భక్తులతో చార్మినార్ పరిసరాల్లో కిలోమేటర్ల క్యూలో భక్తులు నిల్చుని ఉన్నారు. దీపావళి పండుగ రోజు నుంచి మూడు నుంచి నాలుగు రోజుల పాటు అమ్మవారి కాయిన్స్ ప్రసాదంగా భక్తులకు ఇవ్వడం ఓ సంప్రదాయంగా వస్తోంది. ఈ కాయిన్‌ను తీసుకెళ్లి చాలామంది భక్తులు పూజగదిలో పెట్టుకుంటారు. ఈ కాయిన్ తమకు దక్కితే.. అమ్మవారి కృప తమపై ఉంటుందనేది భక్తుల విశ్వాసం. ఆదివారం సెలవు కావడంతో భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో అవసరమైన వెండి నాణేలను ఆలయ కమిటీ అందుబాటులో ఉంచింది.

## రాష్ట్రంలో ప్రోటోకాల్ కనిపించింది

- రేవంత్ సర్కార్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రశంసలు

విశ్వంభర, జగిత్యాల: నిత్యం రేవంత్ రెడ్డి సర్కారు మీద విమర్శలు గుప్పించే కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, ఎంపీ బండి సంజయ్ కుమార్.. తాజాగా ప్రశంసలు కురిపించారు. తెలంగాణలో చాలా రోజులకు ప్రోటోకాల్ కనిపించిందని అన్నారు. పార్టీలకు అతీతంగా నాయకులు, అధికారులు సంతోషంగా ఉన్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా ఇదే పరంపర కొనసాగించాలని కాంగ్రెస్ సర్కారుకు సూచించారు. పగలు, పట్టింపుల వల్ల సాధించేదేమీ లేదని అభిప్రాయపడ్డారు. జగిత్యాల జిల్లా మల్యాల ఎక్స్ రోడ్ నుంచి మేడిపల్లి మండలం కాచారం వరకు రూ.25 కోట్లతో డబుల్ రోడ్డు శంకుస్థాపన కార్యక్రమంలో చొప్పదండి కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి.. బండి సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన బండి సంజయ్..గత ప్రభుత్వ హయాంలో ఎక్కడ ప్రోటోకాల్ లేదు, ప్రారంభోత్సవాలు లేవని పేర్కొన్నారు. కాంట్రాక్టర్లను బెదిరించడం, కమిషన్లు దండుకోవడం జరిగేవని ఆరోపించారు. గత ప్రభుత్వం అధికారుల మీద ఒత్తిడి తెచ్చిందని విమర్శించారు. ఎన్నికల వరకే రాజకీయాలని... ఆ తర్వాత అందరూ కలిసిమెలసి ముందుకు సాగాల్సిన అవసరం ఉందని బండి సంజయ్ సూచించారు. నూకపల్లి నుంచి కాచారం వరకు డబుల్ రోడ్డుకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్టు బండి సంజయ్ తెలిపారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా సహకరించిందని అన్నారు. నిధులు మంజూరు చేసిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలో ఎక్కువ నిధులు కరీంనగర్ పార్లమెంట్‌కే కేటాయించారని పేర్కొన్నారు. భవిష్యత్తులో చొప్పదండి నియోజకవర్గానికి మరిన్ని నిధులు తీసుకొస్తామని హామీ ఇచ్చారు.

## రష్యా పైకి క్షిపణులు ప్రయోగిస్తాం

**అందుకు అనుమతివ్వండి**

**ఉ.కొరియా సేనలను ఎదుర్కోవాలంటే క్షిపణులు ప్రయోగించాలి**

**మిత్ర దేశాలను కోరిన ఉక్రెయిన్ అధ్యక్షుడు**



**కీవ్:** రష్యా పైకి క్షిపణులు ప్రయోగించడానికి తమ మిత్ర దేశాలు అనుమతివ్వాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ కోరారు. రష్యాకు మద్దతుగా మోహరించిన ఉత్తర కొరియా సేనలను దీటుగా ఎదుర్కోవాలంటే క్షిపణులు ప్రయోగించాలన్నారు. రష్యాఉక్రెయిన్‌ల మధ్య కొనసాగుతున్న సుదీర్ఘ యుద్ధంలో రష్యా కీవ్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడుతోంది. రాజధాని కీవ్‌ను నేలమట్టం చేయడమే లక్ష్యంగా గత నెలలో 20 సార్లు రష్యా డ్రోన్ దాడులకు పాల్పడినట్లు ఉక్రెయిన్ ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఉక్రెయిన్‌పై యుద్ధానికి రష్యాకు మద్దతుగా ఉత్తర కొరియా వేల సంఖ్యలో సైనికులను ఆ దేశానికి పంపింది. ఈవిషయంపై ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ మాట్లాడుతూ రష్యా పైకి క్షిపణులు ప్రయోగించడానికి తమ మిత్ర దేశాలు అనుమతివ్వాలని కోరారు. రష్యాకు మద్దతుగా మోహరించిన ఉత్తర కొరియా సేనలను దీటుగా ఎదుర్కోవాలంటే క్షిపణులు ప్రయోగించాలన్నారు. రష్యా తన భూభాగంలో సిద్ధంగా ఉంచిన ఉత్తర కొరియా సైనికుల స్థావరాలను తాము చూసి, వాటిపై నిఘా పెడతామని జెలెన్‌స్కీ అన్నారు. తమవద్ద సుదూర లక్ష్యాలను ఛేదించే క్షిపణుల సౌలభ్యం ఉంటే వారిని అడ్డుకోవడానికి వినియోగిస్తామని వెల్లడించారు. రష్యా కర్మాగారాల్లో ఉత్తర కొరియా ఆయుధాలు, సైనికులు మాత్రమే కాకుండా.. తమ ఆక్రమిత ప్రాంతాలైన కుర్‌స్క్‌లోను వారి సైనికులే ఉన్నారని వారు ఉక్రెయిన్‌పై దండెత్తడానికి సిద్ధమవుతున్నారని జెలెన్‌స్కీ ఆందోళన వ్యక్తంచేశారు. అయితే మిత్రదేశాలు తమకు ఆయుధ సహాయం చేయకుండా ఉత్తర కొరియా సైన్యం మాపై దాడి చేసేవరకు వేచి చూద్దాం అనే ధోరణిలో ఉన్నారని జెలెన్‌స్కీ మండిపడ్డారు. అక్టోబర్ నెలలో ఉక్రెయిన్‌పై 2 వేల డ్రోన్లతో దాడి చేసినట్లు రష్యా వెల్లడించింది. నెల రోజుల వ్యవధిలో రష్యా 2,023 డ్రోన్లను ప్రయోగించినట్లు ఉక్రెయిన్ జనరల్ స్టాఫ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో 1,185 డ్రోన్లను సమర్థంగా అడ్డుకున్నట్లు చెప్పారు. మరో 738 డ్రోన్ల వల్ల నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. "ఈ ఏడాది ప్రారంభం నుంచి ప్రత్యర్థి రష్యా మా దేశంపై 6,987 డ్రోన్లను ప్రయోగించింది. జనావాసాలు, మౌలిక సదుపాయాలను దెబ్బతీయడమే లక్ష్యంగా దాడులు చేస్తోంది" అని తెలిపారు. అయితే, ఉక్రెయిన్ ఆరోపణలను రష్యా ఖండించింది. జనావాసాలే లక్ష్యంగా దాడులు చేస్తున్నామనడం సరికాదని స్పష్టంచేసింది. తమ దేశానికి ముప్పు పొంచిఉందనే కారణంతో ఉక్రెయిన్ మిలిటరీ మౌలిక సదుపాయాలను, ఇంధన వ్యవస్థను దెబ్బతీసేందుకే దాడులు చేస్తున్నామని పేర్కొంది.

## సీతారామ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రశాంత్ జీవన్ పాటిల్,ఇ యన్ సి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జులై 2025 లక్ష్యంగా ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలి అన్నదే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం అన్నారు.అందుకు గాను అవసరమైన భూసేకరణకు గాను ప్రత్యేకంగా సర్వే బృందాలను ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు.ఇప్పటి వరకు ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి గాను 6,234.91 ఎకరాల భూమికి సేకరించి నట్లు ఆయన వివరించారు. ఇంకా సేకరించాల్సింది 993 ఎకరాలు ఉందన్నారు.అందు కోసం సత్వరమే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రాజెక్ట్ పూర్తి అయితే 3.28 లక్షల కొత్త ఆయాకట్టు సేద్యంలోకి వస్తుందన్నారు.550 చెరువులకు సమృద్ధిగా నీరు చేరుతుందన్నారు.తద్వారా అదనంగా మరో 1.16 లక్షల ఎకరాలు సేద్యంలోకి వస్తాయన్నారు. ఇప్పటి వరకు ఈ ప్రాజెక్ట్ పై 6,401.95 కోట్లు ఖర్చు పెట్టినట్లు ఆయన తెలిపారు.యుద్ధప్రాతి పదికన ఈ ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

## ఉప్పల్ నియోజకవర్గం మల్లాపూర్‌లో క్రియాశీల బీజేపీ సభ్యత్వ నమోదు


**హాజరైన మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్**



**విశ్వంభర, మల్లాపూర్ :** ఉప్పల్ నియోజకవర్గం మల్లాపూర్‌లో క్రియాశీల బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దేశంలోనే అతి ఎక్కువ ఓటర్లు కలిగిన నియోజకవర్గం మల్కాజ్గిరి పార్లమెంటు నియోజకవర్గమని, 38 లక్షల ఓట్లు ఉన్న ఈ నియోజకవర్గంలో 52 శాతం ఓట్లు సాధించి భారతీయ జనతా పార్టీకి ఆజేయమైనా శక్తినిచ్చిందన్నారు. సభ్యత్వ నమోదు జరుగుతున్న సందర్భంలో.. బిజెపి వచ్చిన 10 లక్షల ఓట్లలో ఐదు లక్షల సభ్యత్వ నమోదు చేయమని ఆదేశం ఇస్తే ఇప్పటికే మూడు లక్షల పైచిలుకు సభ్యత్వం నమోదు చేసి మొత్తం రాష్ట్రంలో నెంబర్ వన్ స్థానంలో నిలిచిందన్నారు. పార్లమెంట్ పరిధిలో ఉన్న గేటెడ్ కమ్యూనిటీ ప్రజలకు, అపార్ట్మెంట్లో ఉండే ప్రజలకు, కాలనీలో ఉండేవాళ్లకు, పాలకమండలిలో ఉండేవాళ్లకు పిలిస్తే పలికే బిడ్డగా ఉన్న అన్నారు. ఏ నమ్మకంతో తనకు ఓటేసి గెలిపించారో అదే విశ్వాసంతో, నమ్మకంతో సభ్యత్వ నమోదు కూడా చేయాలని కోరారు. రాబోయే కాలంలో ప్రజలకు ఉన్న సమస్యలు డ్రైనేజీలు, రోడ్లు ఇంకా ఏ సమస్య అయినా పరిష్కరించడంలో ముందు భాగంలో ఉంటామని హామీ ఇచ్చారు.

## కీసర కార్తీక పూజలకు రావాలని మంత్రి సురేఖకు ఆహ్వానం

**విశ్వంభర, హైదరాబాద్:** కార్తీకమాస దీపోత్సవ వేడుకల్లో భాగంగా మొదటి కార్తీక సోమవారం కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహించనున్న ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొనాల్సిందిగా దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ఆహ్వానం అందింది. ఈ మేరకు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణ ప్రసాద్, ఆలయ ఈవో సుధాకర్ రెడ్డి, అర్చకులు మంత్రి సురేఖను హైదరాబాద్ లోని వారి నివాసంలో కలిసి, కార్తీకమాస దీపోత్సవం లో పాల్గొనాల్సిందిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అర్చకులు మంత్రిగారికి వేదాశీర్వచనం చేసి, స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందించారు. ఈవో సుధాకర్ రెడ్డి కార్తీక సోమవారం సందర్భంగా ఆలయంలో చేపట్టనున్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను మంత్రి కి వివరించారు.




# కనుమరుగైన జర్నలిస్టుల రక్షణ



ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన మీడియా రంగానికి కష్టకాలం దాపురించింది. మీడియాకు స్వేచ్ఛ, జర్నలిస్టులకు రక్షణ ఎండమావులే అవుతున్నాయి. గత కొన్నేళ్లలో ప్రపంచంలోని పలు దేశాలలో దాదాపు వెయ్యి మంది జర్నలిస్టులు విధి నిర్వహణలో హత్యకు గురయ్యారు. మన దేశంలోనూ హత్యలకు, చిత్ర హింసలకు, దాడులకు గురవుతున్న సంఘటనలు లేకపోలేదు. మే 3వ తేదీ "ప్రపంచ పత్రికా స్వేచ్ఛాదినం", నవంబరు 2న "జర్నలిస్టులపై నేరాలు చేసిన వారిని శిక్షించకుండా వదల వద్దని కోరే అంతర్జాతీయ దినం", నవంబరు 16న "భారత పత్రికా దినం". ఇలా ఎన్ని దినోత్సవాలు జరిపినా పరిస్థితులలో మార్పు రాక పోవడం విచారకరం. జర్నలిస్టులకు రక్షణ చర్యలు తీసుకోకపోవడం బాధాకరం. నవంబరు 2వ తేదీ విషయానికి వస్తే అంతర్జాతీయ భావ ప్రకటనా స్వేచ్ఛ పరస్పర మార్పిడి ' (ఇంటర్నేషనల్ ఫ్రీడమ్ ఆఫ్ ఎక్స్‌ప్రెషన్ ఎక్స్ఛేంజ్ - ఐఎఫ్ఇఎక్స్) అనే ఒక ప్రపంచ పౌర సంస్థల యంత్రాంగం ప్రతి ఏడాది నవంబరు 2న 'జర్నలిస్టులపై నేరాలు చేసిన వారిని శిక్షించకుండా వదల వద్దని కోరే అంతర్జాతీయ దినం' 2011లో నిర్ణయించింది. ఆ తేదీని ఎందుకు ఎంచుకున్నారంటే 2009 నవంబరు 23న ఫిలిప్పయిన్స్ లోని మాగుయిండానా ప్రాంత గవర్నర్ ఎన్నికలో ఒక అభ్యర్థి నామినేషన్ పత్రాలు దాఖలు చేసే కార్యక్రమంలో పాల్గొనేందుకు కొందరితో పాటు, వార్తా సేకరణ కోసం పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు కూడా వెళ్లారు. వారి వాహన శ్రేణిపై విరుచుకుపడిన సాయుధ ముఠా, వారందరినీ అభ్యర్థి మద్దతుదారులుగా భావించి కిడ్నాప్ చేసి కాల్చి చంపింది. ఈ దారుణ కాండలో 58 మంది మరణించగా వారిలో 34 మంది జర్నలిస్టులే వున్నారు. 2013లో ఐఎఫ్ఇఎక్స్ సభ్యులు, భావ ప్రకటనా స్వేచ్ఛను కోరుకొనే పౌరసమాజ కార్యకర్తల వినతి, పరిస్థితి తీవ్రత మేరకు 2013 డిసెంబరులో ఐక్యరాజ్య సమితి 70వ వార్షికోత్సవం సందర్భంగా జనరల్ అసెంబ్లీ ఒక తీర్మానాన్ని ఆమోదించి నవంబరు రెండవ తేదీని 'జర్నలిస్టులపై నేరాలు చేసిన వారిని శిక్షించకుండా వదల వద్దని కోరే అంతర్జాతీయ దినం' పాటించాలని నిర్ణయించింది. అదే సంవత్సరం నవంబరు రెండున మాలీ దేశంలో వార్తల సేకరణకు వెళ్లిన ఇద్దరు ఫ్రెంచి జర్నలిస్టులు ఘిస్‌లైన్ డ్యూపాంట్, క్లాడె వెర్లోన్‌లను హత్య చేశారు. అప్పటి నుంచి జర్నలిస్టుల మీద నేరాలు చేసిన వారెవరినీ వదలవద్దంటూ ఐఎఫ్ఇఎక్స్ సంస్థ ప్రతి ఏటా కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. ఏటా ఆ రోజు ఐరాస సభ్య దేశాలు తమ దేశాలలోని జర్నలిస్టుల కేసులను సమీక్షించాలని, దోషులకు శిక్షలు పడేవిధంగా చర్యలు తీసుకో వాలని నివేదికలు ప్రకటించాలని యునెస్కో సభ్యదేశాలకు లేఖలు రాయటమే గాకుండా ప్రతి సంవత్సరం ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నది. స్వాతంత్ర్యానికి ముందు కూడా మీడియాలో రెండు తరగతులు వుండేవి. ఒకటి స్వాతంత్ర్య లక్ష్యం కోసం ప్రధానంగా పని చేసినవి, రెండవ తరగతి బ్రిటీష్ సామ్రాజ్య వాదులతో ఘర్షణ పడకుండా స్వామికార్యం, స్వకార్యం నెరవేర్చుకొనేవి. తరువాత దేశ మీడియాలో ఆ గీత చెరిగిపోయింది. ప్రజల కోసం, ప్రజల సమస్యల మీద కేంద్రీకరణ లేదు. ఎవరు అధికారంలో వుంటే వారి భజనచేస్తూ లాభార్జనే ప్రధాన వ్యాపకంగా మారింది. అందుకోసం వార్తను, దృశ్యాన్ని వ్యాపార సరకులుగా మార్చి వేశారు. స్వాతంత్ర్యానికి ముందు బ్రిటీష్ వారిని వ్యతిరేకిస్తూ పత్రికలు పెట్టిన ఎందరో తమ ఆస్తులను ఫణంగా పెట్టారు. ప్రస్తుతం అధిక సంఖ్యాక పత్రికలు,చానళ్లు లాభాల కోసం నడుస్తున్నవే. మా పత్రిక ధర మీరు కొనే సమోసా కంటే తక్కువే అని గతంలో ఒక మీడియా సంస్థ ప్రచారం చేసుకుంది. ఇప్పటికీ పత్రికలు సమోసా కంటే తక్కువ ధరలకే లభిస్తున్నాయి. ఒక్క పత్రికలు తప్ప ప్రపంచంలో ఏ వస్తువూ తయారీ ధరకంటే తక్కువకు లభ్యం కావటం లేదు. దీని అర్థం వాటి నిర్వాహకులు తనకు తగిన ఆదాయం, లాభాలు లేకుండా నడుపుతున్నారనా? టీవీ ఛానల్స్ కూడా అంతే. కొన్ని పార్టీలు, వాటి నేతలు, వ్యాపార సంస్థల వార్తలను ఇస్తే ఏదో మార్గంలో కాసులు కురుస్తాయి. కొన్నింటికి మాత్రమే ఎలాంటి ప్రతిఫలమూ వుండదు. అందుకే నేడు నూటికి తొంభై తొమ్మిది సంస్థలు మాకేమిటి అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి. అలాంటి వాటికి భావ ప్రకటనా స్వేచ్ఛ వుంటేనేం, లేకపోతేనేం. నేడు మీడియా సంస్థలను డబ్బులు సంపాదించే పెట్టుబడిదారులు నడుపుతున్నారు తప్ప సంపాదకులకు ఎలాంటి స్వేచ్ఛ లేకుండాపోతోంది. సంపాదన, అధికారం ధ్యేయాలైన మీడియా నిర్వాహకులు వార్తలను అమ్ము కోవటానికి ఏమాత్రం వెనకాడటం లేదు. ఈ కారణంగానే గతంలో, ప్రస్తుతం ఎవరు అధికారంలో వున్నా మీడియాను పూర్తిగా తమ చెప్పుచేతల్లోకి తీసుకొనేందుకు ప్రయత్నించడం కొనసాగుతున్నది. లొంగని వాటి ఆర్థిక మూలాలను దెబ్బ తీసేందుకు, తద్వారా వాటి మూతకు ప్రయతాలు జరగడం నిత్య కృత్యమే. మీడియా స్వేచ్ఛకు కలుగుతున్న హాని గురించి ఒక్క మాట కూడా రాయలేని నిస్సహాయ సంపాదకులను నేడు మనం చూస్తున్నాం. ఫోర్త్ ఎస్టేట్‌గా మన్ననలను పొందిన మీడియా రియలెస్టేట్‌గా మారిపోయిందనే ఆరోపణలు నిత్యం వినాల్సి వస్తోంది. మీడియా యజమానులు, రాజకీయ నేతలకు మధ్య వున్న గీత దాదాపుగా చెరిగిపోయింది. ఒకరి ప్రయోజనాలను ఇంకొకరు కాపాడు కుంటున్నారు. కొందరు రాజకీయ నేతలు స్వయంగా మీడియా సంస్థలను ఏర్పాటు చేసుకున్నారు. అధికారంలో వున్నపుడు దానిని అడ్డుపెట్టుకొని లాభాలు సంపాదించటం, ప్రతిపక్షంలో వున్నపుడు వాటినే పెట్టుబడిగా పెట్టి నిలుపుకోవటం గతంలో జరుగుతున్నదే. ఇప్పుడు రాజకీయ నేతలు, వారి కనుసన్నలలో మెలిగే మీడియా సంస్థలు ఎక్కడ అధికారం వుంటే ఆవైపే చేరటం రివాజుగా మారింది. దేశంలోని గుత్త పెట్టుబడిదారీ సంస్థలు మీడియా రంగంలో ప్రవేశించటంతో పత్రికా స్వేచ్ఛ హరించుకు పోతున్నది. పాలక పక్షాలు స్వార్థమే పరమార్థంగా వ్యవహరిస్తున్నాయన్నది స్పష్టం. గతంలో కాంగ్రెస్ అత్యవసర పరిస్థితిని ప్రకటించి మీడియా వార్తలపై ప్రత్యక్ష సెన్సార్‌షిప్ విధించింది. ఇప్పుడు అదే కాంగ్రెస్ లేదా బిజెపి వాటితో జట్టుకట్టే పాలకవర్గ ప్రాంతీయ పార్టీలు మీడియా మీద పరోక్ష సెన్సార్‌ను అమలు జరుపుతున్నాయి. వారికి ఇష్టం లేని వార్త అసలు రాకపోవటం లేదా కనిపించీ కనిపించకుండా ఒక మూలన పడవేయటమో జరుగుతోంది. తమ విధానాలను ప్రశ్నించిన మీడియా సంస్థలకు ప్రకటనలు నిలిపివేయటం, టీవీ ఛానల్స్ అయితే కేబుల్ నిర్వాహకులను బెదిరించి ఛానల్స్ ప్రసారాలను అడ్డు కోవటాన్ని చూస్తున్నాం. మన దేశంలో గత కొన్నేళ్లుగా కుహనా వార్తలు సామాజిక మాధ్యమాన్ని ముంచెత్తు తున్నాయి. నిజం మూడు అడుగులు వేసే లోగా అబద్ధం ముప్పై అడుగుల ముందు వుంటోంది. అవన్నీ ఒక పథకం ప్రకారమే వెలువడుతున్నాయి. ఏది నిజమో ఏది కాదో తెలుసుకో లేని గందరగోళంలో జనాన్ని పడవేసేందుకు, నిజాన్ని కూడా ఒక పట్టాన నమ్మకుండా చేసే కుట్ర దీనిలో వుంది. రెండవ ప్రపంచ యుద్ధంలో హిట్లర్ ప్రభుత్వంలో మంత్రిగా వున్న గోబెల్స్ ఒక అబద్ధాన్ని వందసార్లు చెబితే నిజమై కూర్చుంటుంది అన్న సూత్రంతో పని చేశాడు. ఇప్పుడు మనిషి మనిషికీ ఇంటర్నెట్ అందుబాటులోకి రావటంతో గోబెల్స్‌లు వికటాట్టహాసం చేస్తున్నారు. వెనుకా ముందూ చూడకుండా వాట్సప్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో వచ్చిన సమాచారాన్ని ప్రతి ఒక్కరూ ఇతరుల మీద ఎత్తిపోస్తున్నారు. అవాస్తవాలు, వక్రీకరణలు ప్రచారం చేస్తూ, నకిలీలను నిజమైనవిగా చిత్రించటం మనకు నిత్యం అనుభవైక వేద్యమే. ప్రధాన స్రవంతి మీడియా సంస్థలు కూడా ఇందుకు తమవంతు తోడ్పాటును అందిస్తున్నాయి. అందువలన నిజమైన వార్తలు, నిజమైన పత్రికా, మీడియా స్వేచ్ఛ అంటే జనం కూడా గందర గోళానికి గురవుతున్నారు. మన దేశంలో 1956లో ఏర్పాటు చేసిన తొలి ప్రెస్ కమిషన్ సిఫార్సుల మేరకు 1966 నవంబరు 16న ప్రెస్ కౌన్సిల్ ఏర్పడింది. ఆ రోజును జాతీయ పత్రికా దినంగా పాటిస్తూ 1997 నుంచి ప్రెస్ కౌన్సిల్ ప్రతి ఏటా కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. స్వేచ్ఛాయుతమైన, జవాబుదారీతనంతో కూడినదిగా మీడియా వుండాలనే లక్ష్యాన్ని ప్రకటించారు. ఆచరణలో స్వేచ్ఛను హరించే వారిని, అడ్డగోలుగా వ్యవహరించే మీడియా సంస్థలనూ సరైన దారిలో పెట్టటంలో ప్రెస్ కౌన్సిల్ చేష్టలు ఉడిగి ఉంది. ఘటనలపై విచారణలు జరపటం, సిఫార్సులు చేయటం, సుభాషితాలు చెప్పటం తప్ప దానికి ఎలాంటి అధికారాలు లేవు. దేశంలో ప్రెస్ కౌన్సిల్ నేడు ఏమీ చేయలేని స్థితిలో ఉంది. అటు తప్పు చేసిన యాజమాన్యాలను, ఇటు మీడియా స్వేచ్ఛను హరిస్తున్న ప్రభుత్వాలను నిలదీయలేని సంకట స్థితిలో వుంది. ప్రెస్ కౌన్సిల్‌కు, ప్రజాస్వామ్య పద్దతుల్లో ప్రతినిధుల ఎంపిక జరగాలని, తగిన అధికారాలు ఇవ్వాలన్న న్యాయమైన డిమాండ్లను ఎవరూ పట్టించుకోవటం లేదు.

## తెలుగువారికి బృహత్సంహితలు..
# పానుగంటి సాక్షి వ్యాసాలు

పానుగంటి ప్రతిభ అనన్యం. ప్రజ్ఞ బహుముఖీనం, నాటకకర్తగా, వ్యాస రచయితగా ఆయన పేరు సుస్థిరం. ప్రక్రియ ఏదైనా ఆయన రచనలకు హాస్యం ఆలంబనం. పదాలు గుప్పించడంలోను, ఒక మాటకు పది మాటలు వాడి వ్యంగ్యాన్ని, వర్ణనను, హాస్యాన్ని రంగరించడంలోను ఆయనకు ఆయనే సాటి. సాక్షి వ్యాసాల శైలి వరద గోదావరిలాగా ఝరీవేగంతో పరుగులెట్టేది. కొందరు ఆయనను "ఆంధ్రా ఎడిసన్" అంటారు. మరికొందరు ఆయనను "ఆంధ్రా షేక్స్పియర్" అంటారు. గ్రాంథిక భాషలో సామాజిక రుగ్మతలను ఎండగడుతూ ఆయన రాసిన సాక్షి వ్యాసాలు తెలుగు సాహితీ వినీలాకాశంలో ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించు కున్నాయి. ఆయన రాసిన నాటకాలు కూడా ఆనాటి సాహితీ అభిమానుల ఆదరణను పొందాయి. " పానుగంటి సాక్షి వ్యాసాలు చదవడం మాననంటి.. ఎంచేతనంటే వాటిలో పేను లాంటి భావానికాయన ఏనుగంటి రూపాన్నియ్యడం నేనుగంటి" అని శ్రీశ్రీ సైతం కొనియాడిన మేటి సాహితీ శిఖరం పానుగంటి. పానుగంటి లక్ష్మీ నరసింహారావు తెలుగు సాహితీవేత్త. తెలుగు సాహిత్యానికి అనేక అమూల్యాభరణాలు అందించిన నరసింహారావును పాఠక లోకం 'కవిశేఖరుడ'నీ, 'అభినవ కాళిదాసు' అనీ బిరుదులతో అభినందించింది. నవంబరు 2, 1865వ తేదీన రాజమహేంద్రవరం తాలూకా సీతానగరంలో రత్నమాంబ, వెంకట రమణయ్య దంపతులకు జన్మించారు.1884లో మెట్రిక్యులేషన్, 1886లో ఇంటర్, 1888లో బి.ఎ. పరీక్షలలో ఉత్తీర్ణులైనారు. పెద్దాపురం హైస్కూలులో ఉపాధ్యాయుడిగా చేరిన పానుగంటి, ఆ రోజుల నుండే తన రచనా వ్యాసంగాన్ని ప్రారంభించారు. అయితే ఉపాధ్యాయుడిగా తన సంపాదన చాలక పోవడంతో తొలుత లక్ష్మీనరసాపురం సంస్థానంలో దివానుగా చేరారు. ఆ తర్వాత ఉర్లాం, అనెగొంది, పిఠాపురం మొదలైన సంస్థానాల్లో కూడా పనిచేశారు. ఆయన లక్ష్మీపురం జమిందారిణి రావు చెల్లయమ్మ దివానుగా చేరారు. ఆరు సంవత్సరాల తర్వాత అభిప్రాయ భేదాల మూలంగా ఉద్యోగం మానివేశారు. తరువాత ఉర్లాము సంస్థానంలోను, బళ్ళారి జిల్లాలోని ఆనెగొంది సంస్థానంలోను దివానుగా కొంతకాలం పనిచేశారు. పిఠాపురం మహారాజా శ్రీ సూర్యారావు బహదూరు పానుగంటి రచనల గురించి వినగా, రాజాకు మైనారిటీ తీరగా రాజ్యాధికారం చేపట్టిన తర్వాత పంతులు గారిని 1915-16 మధ్య 'నాటక కవి'గా తమ ఆస్థానంలో నియమించారు. ఆయన కోరికపై అనేక నాటకాలు రాశారు. వాటినన్నింటిని మహారాజుగారే అచ్చు వేయించారు. పానుగంటి వారి రచనలల్లో ప్రముఖ మైనవి సాక్షి వ్యాసాలు. సువర్ణముఖి, ఆంధ్రపత్రిక లలో 1913 నుండి 1933 మధ్యకాలంలో ప్రచురించ బడ్డాయి. వ్యాసాలన్నీ అచ్చమైన గ్రాంథిక భాషలో ఉన్నా, వ్యవహారానికి దగ్గరగా ఉండే శైలితో రాయడం రచయిత ప్రత్యేకత. వినోద ప్రధానశైలిలో రాస్తూ.. ఆనాటి సామాజిక రుగ్మతలను ఎండగట్టడం ఈ వ్యాసాల ప్రధాన ఉద్దేశం. 1711 - 12 లో స్పెక్టేటర్ అనే ఆంగ్ల పత్రికలో జోసెఫ్ ఎడిసన్, రిచర్డ్ స్టీల్ వ్రాసిన స్పెక్టేటర్ పేపర్స్ వ్యాసాలతో ప్రేరణ పొందిన పానుగంటి ఈ వ్యాసాలను రాశారంటారు. ఈ వ్యాసాలలో కాలాచార్యుడు,



జంఘాల శాస్త్రి, వాణీదాసు, బొర్రయ్య శెట్టి అనే పాత్రల ద్వారా సామాజిక విషయాలపై చర్చలను పెడతారు రచయిత. వారి సంభాషణల ద్వారా పాఠకుడికి అందాల్సిన సందేశాన్ని అందిస్తారు. "సాక్షి వ్యాసాలు" పుస్తకంగా వచ్చాక, అనతికాలం లోనే పానుగంటి వారి పేరు ఆంధ్రదేశంలో మారుమోగిపోయింది. ఆ వ్యాసాలు విశేష పాఠకాదరణ పొందాయి. సాక్షి వ్యాసాల రాసిన తర్వాత పిఠాపురం జమీందరు ప్రేరణతో ఇంకా అనేక రచనలు చేశారు పానుగంటి. సారంగధర చరిత్ర, వృద్ధ వివాహము, రాధాకృష్ణ, నర్మదా పురుకుత్సీయము, సరస్వతి, దుష్టప్రధాని, ఆనందనాథ, కల్యాణ రాఘవము, కంఠాభరణము, విజయ రాఘవము, కోకిల, విప్రనారాయణ చరిత్ర, బుద్ధ బోధసుధ, వీరమతి, పూర్ణిమ అందులో ప్రముఖమైనవి. ఆయన రాసిన నాటకాలే పానుగంటి వారి అభినవ కాళిదాసు బిరుదును పొందేలా చేశాయి. తన రచనల వలన తొలినాళ్లలో ఆయన విశేషంగా ధనమార్జించినా, అవసాన దశలో పేదరికానికి, రుణబాధకు గురవడం గమనార్హం. సంస్థానం అందించే గౌరవ వేతనంపైనే ఆయన ఆధారపడాల్సి వచ్చింది. "నాకెవరును దానధర్మము చేయనక్కర లేదు. తగ్గింపు ధరలకు నూటయాభై సెట్ల పుస్తకాలు యాభై మంది కొని, నా మానుషమును కాపాడినను, నాకు సివిలు ఖైదు తప్పును" అని తన చివరిదశలో ఆ మహా రచయిత వాపోయాడంటేనే అతని పరిస్థితి అప్పుడు ఎలా ఉండేదో అర్థం చేసుకోవచ్చు. ఆ తర్వాత అనారోగ్యం కూడా అతన్ని బాగా కుంగదీసింది. తెలుగు పాఠకులపై చెరగని ముద్ర వేసిన సాక్షి వ్యాసాలను ఆ రోజుల్లో కుర్రకారుతో సహా ఎందరో ఎంతో ఆసక్తిగా చదివేవారు. ఆ రోజుల్లో అవి కలిగించిన సంచలనం అంతా యింతా కాదు. "జంఘాలశాస్త్రి" అనే పాత్ర ముఖతః పానుగంటి వారు సమకాలిక సాంఘిక దురాచారాల మీద, మూఢ విశ్వాసాల మీద పదునైన విమర్శలు చేసేవారు అని నండూరి రామమోహనరావు అభిప్రాయం వ్యక్తం చేశారు. మృదుమధుర నవార్థభాసుర వచనరచనా విశారదులైన" మహాకవి ఆధునిక కాలమున ఎవరు అని ప్రశ్నించినచో నా ప్రత్యుత్తరము "పానుగంటి లక్ష్మీనరసింహారావు"గారని. .. నిబ్బరమైన పానుగంటి వచనమున కబ్బరపడని గద్యప్రేమికులుండరని, నాటకములలో కన్యాశుల్కము ఎట్టిదో గద్య రచనములలో సాక్షి అటువంటిదని మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి పేర్కొన్నారు. ఆయన తెలుగు సాహితీ లోకాన్ని విడిచి తిరిగి రాని లోకాలకు పానుగంటి వారు వెళ్లినా, సాక్షి వ్యాసాలు మాత్రం చరిత్రలో చిరస్థాయిగా ఉండి పోయాయి. ఇప్పటికీ తెలుగు విద్యార్థుల పాఠ్యాంశాలలో ఈ వ్యాసాలను ప్రచురించడం ఆయనకు దక్కిన గొప్ప గౌరవమే. సుమారు ఇరవై సంవత్సరాలు ఆయన జీవితం సుఖంగా జరిగింది. ఆ రోజుల్లో దివాణం తరువాత వ్యయానికి వీరి గృహమే అనేవారు. ఆధునిక శ్రీనాథునిగా జీవించారు. ఉద్యోగాల వలన, రచనల వలన విశేషంగా డబ్బు గడించినా దానిని నిలువ చేయడంలో శ్రద్ధ కనపరచలేదు. ఆధునిక శ్రీనాథుని వలెనే అనుభవించినన్నాళ్ళూ బాగా అనుభవించి, తుది రోజులలో పేదరికానికి రుణ బాధకు లోనయ్యారు. మహారాజా వారు బాగా పోషించినా, పంతులుగారికి తుది దశలో వైషమ్యాలేర్పడి, తమదగ్గర ఏనాడో చేసిన రుణం కొరకు వారికి ఇచ్చే నూట పదహారు రూపాయల గౌరవ వేతనంలో కొంతభాగం తగ్గించ దానికి ఉత్తర్వులు జారీ చేశారు. వృద్ధాప్యంలో ఆయన అటు ఇటు తిరిగి సంపాదించలేకపోయారు. చేతికి అందివచ్చిన కుమారులు ఉన్నా వారిని ఉద్యోగాలకు పంపలేకపోయారు. పానుగంటి కవి శేఖరుని దుస్థితి గురించి ఆయన రాసిన లేఖను ఆంధ్రపత్రికలో యర్రవల్లి లక్ష్మీనారాయణ ప్రచురించాడు ... "నాకెవరును దానధర్మము చేయనక్కర లేదు. తగ్గింపు ధరలకు నూటయాభై సెట్ల పుస్తకాలు యాభై మంది కొని, నా మానుషమును కాపాడినను, నాకు సివిలు ఖైదు తప్పును". 1933 నుండి శారీరకంగా, మానసికంగా ఆయన ఆరోగ్యం చెడిపోయింది. 1935 లో పిఠాపురంలో ఉత్సవాలు నిర్వహించి పురజనులు ఘనంగా సన్మానించారు. ఈ ఉత్సవానికి చిలకమర్తి లక్ష్మీనరసింహం అధ్యక్షత వహించారు. పరిస్థితులు మారి, తీవ్ర మనస్తాపంతో ఈయన అక్టోబరు 7న, 1940లో మరణించాడు.



-రామ కిష్టయ్య
సంగన భట్ల...
9440595494

# మెట్టినింటికి వెళ్లిన సోదరి కోసం ఓ పండుగ..

ప్రతి పండగ వెనక ఒక పరమార్థం ఉంటుంది. దసరా దుష్ట సంహారానికి, దీపావళి జీవితాల్లో కాంతులు నింపడానికి.. ఇలా ఒక్కో పండగకు ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. 'భగినీ హస్త భోజనం' కూడా అలాంటిదే..

అనుబంధాలకు, ఆప్యాయతలకు, అనురాగాలకు నిదర్శనం భగినీహస్తభోజనం. వివాహబంధాలతో దూరమైన సోదరిని కనీసం ఏడాదికోక్కసారైన కలుసుకుని వారితోగడిపే అవకాశం. ఎన్నిపనులున్నా ఈ సంప్రదాయాన్ని వదలకూడదనేది పెద్దల మాట.

భగిని' అంటే సోదరి(అక్క లేదా చెల్లెలు). 'హస్తభోజనం' అంటే... చేతి భోజనమని అర్థం. అంటే సోదరి చేతి వంట సోదరుడు తినడం అన్నమాట. కార్తీక శుక్ల విదియ తిథి రోజున 'భగినీ హస్త భోజనం' అనే పండుగను జరుపుకుంటారు. దీన్నే భాయ్ దూజ్ అనీ, భాత్రు ద్వితీయ అనీ, భాయ్ టీక అని అంటారు. అంటే సోదరి తన ఇంట్లోనే భోజనం చేయడం అన్నమాట. ఆదివారం ఈ పండుగ వస్తోంది.

### నేడు అపమృత్యు భయాలు పోగొట్టే 'భగినీ హస్త భోజనం'
### ఈరోజు సోదరీమణుల చేతివంట కచ్చితంగా తినాలి



ఒక సోదరి తన వివాహం అయ్యాక తనను చూడటానికి రాని అన్న, ఎంతగా పిలిచినా తన ఇంటికి రాని అన్న- అనుకోకుండా వస్తే ఆ సోదరి ఎంత ఆనందపడుతుందో ఈ 'భగినీ హస్త భోజనం' వేడుకలో ప్రతిబింబిస్తుంది. కార్తీక శుద్ధ విదియ అంటే దీపావళి వెళ్లిన రెండో రోజు ఈ వేడుకను జరుపుకుంటారు. భగినీ అంటే సోదరి. ఆమె పెట్టే భోజనం భగినీ హస్త భోజనం అంటారు. ఐదు రోజుల పండుగ దీపావళిలో ఈ భగినీ హస్త భోజనం కూడా ఒకటి. ఈ రోజు అన్నా లేదా తమ్ముడు తన సోదరి చేతి భోజనం తింటే అపమృత్యు భయాలు తొలగిపోతాయి అని నమ్మకం. ఈ వేడుక వెనుక ఓ ఆసక్తికర పురాణ కథ ఉంది.

భగినీ హస్త భోజనం వెనుక ఉన్న పురాణ గాథ..

యమధర్మరాజు చెల్లెలు యమున. ఆమె తనకు వివాహం అయి అత్తవారింటికి వెళ్లాక తన అన్నను తన ఇంటికి భోజనానికి ఆహ్వానిస్తుంది. కానీ ప్రాణుల పాపపుణ్యాలు విచారించి వారిని శిక్షించడంలో తీరికలేని యమధర్మరాజుకు తన చెల్లెలి ఇంటికి వెళ్లటానికి తీరిక దొరకదు. ఎన్నిసార్లు చెప్పినా యమధర్మరాజు రాకపోవడం వల్ల యమున నిరాశ చెందుతుంది.

**మార్కండేయుని కథ..**

పరమశివుని భక్తుడైన మార్కండేయుడు అల్పాయుష్కుడు. ఆ సంగతి తెలిసి అతను పరమశివుని శరణు వేడుతాడు. మార్కండేయుని అంత్యకాలం సమీపించడం వల్ల యమధర్మరాజు అతని ప్రాణాలు తీయడానికి యమపాశాన్ని విసరబోగా, పరమశివుడు మార్కండేయుడు తనను శరణు వేడాడు కాబట్టి అతనిని విడిచి పెట్టమని చెబుతాడు. కానీ జీవుల మరణాల పట్ల ఖచ్చితంగా, పక్షపాతం లేకుండా వ్యవహరించే యముడు అందుకు ఒప్పుకోడు. మార్కండేయుడు ప్రాణాలు తీయటానికి యమపాశాన్ని విసురుతాడు. భయంతో శివలింగాన్ని ఆలింగనం చేసుకుంటాడు మార్కండేయుడు. ఆ పాశం వెళ్లి శివలింగాన్ని తాకుతుంది. తన భక్తుని విడిచి పెట్టమని చెప్పిన వినకుండా, నేరుగా తన శివలింగం మీదకే పాశాన్ని విసిరిన యమధర్మరాజుపై శివుడు ఆగ్రహించి తన త్రిశూలాన్ని విసురుతాడు.

**యముణ్ణి తరిమిన శివుని త్రిశూలం..**

త్రిశూలం శక్తి ఎంతటిదో తెలిసిన యముడు దాని ధాటి నుంచి తప్పించుకోవటానికి పరుగెత్తుతాడు. త్రిశూలంతో శివుడు తరుముతుండగా ఏమి చేయాలో అర్థం కాని యమధర్మరాజు పరుగెత్తి, పరుగెత్తి చివరకు అనుకోకుండా తన చెల్లెలు యమున ఇంటికి వెళ్లి తలదాచుకుంటాడు.

**అన్న రాకకు యమున ఆనందం..**

ఎన్నిసార్లు పిలిచినా రాని అన్న ఇలా అకస్మాత్తుగా తన ఇంటికి రావడం వల్ల ఆనందంతో యమున ఉబ్బితబ్బిబైపోతుంది. అతనికి సకల మర్యాదలు చేస్తుంది. దీంతో యముడు చెల్లెల్ని చూసి ఆనందపడి శివుడు త్రిశూలంతో వెంటాడడం గురించి మర్చిపోతాడు. చెల్లెలు చూపించే ఆదరణకు పరవశించిపోతాడు. చెల్లెలు ప్రేమగా రుచికరమైన పిండివంటలతో విందు వడ్డిస్తుంటే పరవశించిపోతాడు. అలా అన్నకు ఇష్టమైన భోజనం వడ్డిస్తుంది యమున. దీంతో ఆ అన్నా చెల్లెళ్ల బంధాన్ని, అనుబంధాన్ని చూసిన శివుడు భోజనం చేసేవారిని సంహరించరాదని తిరిగి వెళ్లిపోతాడు.

**ఒకేసారి ఇద్దరినీ అనుగ్రహించిన శివుడు..**

ఈ ఘటనతో రెండు ఉపకారాలు జరిగాయి. ఇటు మార్కండేయుని ప్రాణాలు నిలిచాయి. మార్కండేయుడు చిరంజీవిగా చిరకాలం జీవించాడు. రెండోది ఎంత పిలిచినా చెల్లెలి ఇంటికి వెళ్లని యముడు తొలిసారిగా చెల్లెలి ఇంటికి వెళ్లి ఆమె ఆతిథ్యాన్ని స్వీకరిస్తాడు. అన్నకు తృప్తికరంగా భోజనం పెట్టాలన్న యమున చిరకాల వాంఛ నెరవేరుతుంది.

**యమునకు అన్న ఇచ్చిన వరం..**


శివుడి ఆగ్రహానికి గురి కాకుండా తనకు రక్షణ కల్పించి, తన కోసం చెల్లెలు చేసిన అతిథి మర్యాదలకు యముడు ముగ్ధుడవుతాడు. చెల్లెల్ని తనకు ఇష్టమైన వరం కోరుకోమంటాడు. అప్పుడు యమున కార్తీక శుద్ధ విదియ రోజు చెల్లెలి ఇంటికి వెళ్లి, ఆమె చేతి వంట తినే సోదరుడికి నరకలోక వాసం తప్పించి, అపమృత్యు దోషం కలగకుండా ఉండేలాగా వరం ఇవ్వమని కోరుకుంటుంది. అలాగే ఈ రోజున అతిథి మర్యాదలతో అన్నను ఆదరించిన సోదరికి సౌభాగ్యాలు కలిగేలా దీవించమని కోరుతుంది. చెల్లెలి కోరిక విన్న యముడు పరమానంద భరితుడై తథాస్తు అంటాడు. అలా ప్రతీ ఏటా కార్తీక శుద్ధ విదియనాడు చెల్లెలి ఇంటికి వచ్చి, ఆమె చేతి వంట తింటానని వరం ప్రసాదిస్తాడు. ఇదీ భగినీ హస్త భోజనము వెనుక ఉన్న కథ!

**పండుగ ఒక్కటే! పేర్లు అనేకం..**

ఈ పండుగనే రకరకాల పేర్లతో జరుపుకుంటారు. అద్వితీయ పర్వదినంగా పేరు పొందింది కాబట్టి యమద్వితీయ అని, పుష్ప ద్వితీయ, కాంతి ద్వితీయ అని జరుపుకుంటారు. అలాగే ఉత్తర భారతంలో 'భాయ్ దూజ్' పేరిట జరుపుకుంటారు.

**కుటుంబ వ్యవస్థను బలోపేతం చేసే పండుగలు..**

నేటి యాంత్రిక యుగంలో అన్ని సంబంధాలు సన్నగిల్లుతున్న నేపథ్యంలో కుటుంబ సభ్యుల మధ్య పరస్పర అవగాహన, సంబంధ బాంధవ్యాలు పునరుద్ధరించి తద్వారా భారతీయ కుటుంబ వ్యవస్థ దృఢపడటానికి ఇలాంటి పండుగలు దోహదం చేస్తాయి.నేడు భగినీ హస్తభోజనం ఈరోజు అన్నదమ్ములు తమ తమ సోదరి ఇంటికి చీరసారెలతో వెళ్లి ఆమె చేతి భోజనం తిని పది కాలాలు ఆయురారోగ్యాలతో చిరంజీవిగా వర్ధిల్లాలని కోరుకుందాం.



- మేడేపల్లి నాగేందర్
చీఫ్ సబ్ ఎడిటర్
విశ్వంభర దినపత్రిక
99851 19146

## గ్రామ సంఘ బంధాలకు పెరటి కోళ్ల పంపిణీ



**విశ్వంభర, త్రిపురారం:** తెలంగాణరాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టినటువంటి "ఇందిరా మహిళల శక్తి" కార్యక్రమంలో భాగంగా నల్గొండ జిల్లా త్రిపురారం మండల ఎమ్మార్వో ప్రమీల, ఎంపీడీవో విజయ కుమారి ఆధ్వర్యంలో పెరటి కోళ్ల పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగింది. త్రిపురారం మండలంలో 16 గ్రామ సంఘ బంధాలకు 16 యూనిట్లు గ్రౌండింగ్ చేయడం జరిగింది. ఒక్క యూనిట్ ధర 5,500 రూపాయలు. ఒక్క యూనిట్ కు 50 పిల్లలు, మొత్తం ఎనిమిది వందల పిల్లలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డీపీఎం బెనర్జీ, ఎంఆర్ఓ, ఎంపీడీవో, ఏపీఎం అశోక్ కుమార్, సీసీలు దేవి సింగ్, హేమ కంప్యూటర్ ఆపరేటర్ రాందాస్, ఎంఎంఎస్ అధ్యక్షురాలు మంగమ్మ, ఇతరులు పాల్గొనడం జరిగింది.

## సీఎంఆర్ఎఫ్, కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



**విశ్వంభర, ఇబ్రహీంపట్నం:** మల్లాపూర్ మండల కేంద్రం లోని ఎంపీడీవో కార్యాలయంలో మల్లాపూర్ మండలానికి సంబంధించిన 11,92,500 రూపాయల విలువ గల 41 సీఎంఆర్ఎఫ్ చెక్కులను కోరుట్ల నియోజకవర్గం ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అలాగే ఇబ్రహీంపట్నం మండల, కేంద్రంలోని రైతు వేదికలో మండలానికి సంబంధించిన 16,01,856 రూపాయల విలువగల కళ్యాణ లక్ష్మి 16 చెక్కులతోపాటు 13,42,300 రూపాయల విలువగల 46 సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్. ఈ కార్యక్రమంలో అధికారులు, బీఆర్ఎస్, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



**విశ్వంభర, కొత్తూరు:** ఆధ్యాత్మికత తోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్సీ నాగరికుంట నవీన్ కుమార్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం మల్లాపూర్ తాండ గ్రామపంచాయతీ పరిధిలోని రాగ్య తండాలో నూతనంగా నిర్మిస్తున్న లలితాంబిక దేవి ఆలయా నిర్మాణానికి ఎమ్మెల్సీ నాగరికుంట నవీన్ కుమార్ రెడ్డి 51,000 వేల రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతోనే అనుకున్న లక్ష్యాలు, కోరికలు నెరవేరుతాయని, మనిషి జీవితంలో తప్పకుండా భగవంతుని నామస్మరణ చేయడంతో మంచి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాధ లక్ష్మణ్ నాయక్, ఆలయ ఛైర్మన్ మోహన్ నాయక్, వైస్ ఛైర్మన్ లోబ్య నాయాక్, శంకర్, బీక్యా, మాన్య, నారాయణ, పీర్యా రఘు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## సదర్ పండుగకు ఆహ్వానం





**విశ్వంభర, షాద్ నగర్:** రంగారెడ్డి రెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణం లో జరిగే సదర్ ఉత్సవాలను విజయవంతం చేయాలనీ యాదవ్ సదర్ ఉత్సవాల కమిటీ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా సదర్ ఉత్సవాలకు స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ లను సదర్ ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఇందులో డంగు శ్రీనివాస్ యాదవ్, నడికుడా యాదగిరి యాదవ్, ఆలుగడ్డ ప్రవీణ్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాదవుల సంస్కృతి, సాంప్రదాయాలను, భక్తిశ్రద్ధలతో జరుపుకొనే పండుగ సదర్ పండుగ అని అన్నారు. ప్రతి సంవత్సరం దీపావళి పండుగ తరువాత జరిగే ఈ సదర్ ఉత్సవాలను షాద్ నగర్ నియోజకవర్గం నుండి పెద్దఎత్తున యాదవులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలనీ కోరారు.

## గోశాలకు పశు దాణా(కుట్టి) వితరణ



**విశ్వంభర, షాద్ నగర్:** మున్సిపాలిటీ పరిధిలోని చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ ఆవరణలోని శ్రీకృష్ణ గోశాలకు శనివారం దాతలు పశు దాణా(కుట్టి) వితరణ చేశారు. మోతీ ఘనపూర్ లోని నవదుర్గ కంపెనీ మేనేజర్ బొలా రాం 15 వేల విలువగల దానాను గోవులకు అందజేశారు. ఈ సందర్భంగా గోశాల నిర్వాహకులు శ్రీశైలం గౌడ్ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శ్రీ ఆంజనేయస్వామి ఆశీస్సులు వారికి ఉండాలని ఆకాంక్షించారు.

# సమగ్ర కులగణనతో సామాజిక న్యాయం

- రాజకీయంగా బీసీలకు పెరగనున్న అవకాశాలు
- ఆర్థిక సర్వే తో ఉపాధి కల్పన కు ప్రణాళిక
- కాంగ్రెస్ కార్యకర్తలు కుల సర్వే ను ప్రతి ఇంటికి చేరవేయాలి
- నీలం మధు ముదిరాజ్



**విశ్వంభర, సంగారెడ్డి:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే, బీసీ కులగణనతో బీసీలకు అన్ని అంశాలలో అవకాశాలు పెరుగుతాయని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణం అంబేద్కర్ భవన్ లో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు, టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ రెడ్డి తో కలిసి నీలం మధు పాల్గొన్నారు. నీలం మధు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన సర్వేతో బీసీలకు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. సమగ్ర ఇంటింటి సర్వేతో సేకరించిన వివరాలతో ప్రజల ఆర్థిక పరిస్థితిని అంచనా వేసి వారికి ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా ప్రణాళికలు రూపొందించవచ్చన్నారు. బీసీ కుల గణన తర్వాత జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు పెరిగి రాజకీయంగా అవకాశాలు పెరుగుతాయని స్పష్టం చేశారు. సమగ్ర కుటుంబ సర్వే ద్వారా తెలంగాణ లోని అన్ని వర్గాలకు మేలు చేకూర్చేలా నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, పీసీసీ అధ్యక్షులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కులగణన తర్వాత సంక్షేమ పథకాలు మరింత వేగవంతమై అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమం అభివృద్ధి అందుతుందని హామీ ఇచ్చారు. ఈ కులగణన కార్యక్రమాన్ని కాంగ్రెస్ కార్యకర్తలు ప్రతి గడపకు చేరవేయాలని అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, గాలి అనిల్ కుమార్, ఆంజనేయులు, తోపాజీ అనంత కిషన్, పులిమామిడి రాజు, శ్రీనివాస్ రెడ్డి, పుష్ప నగేష్ యాదవ్, వివిధ మండల, బ్లాక్ అధ్యక్షులు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కులగణనకు అందరు సహకరించాలి: మంత్రి శ్రీధర్ బాబు

- కుల గణన తోనే సామాజిక అసమానతలు తొలగింపు
- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**విశ్వంభర, రంగారెడ్డి :** బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఇతర వెనకబడిన వర్గాల అభివృద్ధి కోసం సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ అవకాశాలు కల్పించేందుకు అవసరమైన ప్రణాళికలు చేసేందుకు సర్వే చేయనున్నట్లు రంగారెడ్డి డీసిసి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఈ సర్వే ఆధారంగానే స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది తెలిపారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన అమలు చేస్తోందన్నారు. షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ఎన్నో ప్రభుత్వాలు మారినా వెనుకబడిన తరగతుల ప్రజల స్థితిగతులు మాత్రం మారలేదని పేర్కొన్నారు. జోడో యాత్రలో భాగంగా కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేసి దేశంలో ఉన్న ప్రజల యొక్క అవసరాలను, వారి కష్టాలను తెలుసుకొని రాహుల్ గాంధీ సమూల మార్పుకు కృషి చేస్తున్నారని తెలిపారు. అందులో భాగంగా తెలంగాణ లో కులగణన చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం శాసన సభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, జిల్లా డీసీసీ అధ్యక్షులు, ఎఫ్‌యూడీఐడీసీ ఛైర్మన్ చల్లా నరసింహా రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ తీగల అనితా రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా, మండల స్థాయి నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాదిగ ఉపకులాల ఆత్మీయ సమ్మేళనం



**విశ్వంభర, హసనపర్తి:** హనుమకొండ జిల్లా హసనపర్తి మండలంలోని 55వ డివిజన్ భీమారంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్సీ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు సంగాల విక్టరీబాబు అధ్యక్షతన శనివారం మాదిగ ఉపకులాల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం జరిగింది. దీనికి ముఖ్య అతిథులుగా మహాజన సోషలిస్టు పార్టీ, ఎమ్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు పుట్ట రవి మాదిగ పాల్గొని మాట్లాడారు. మందకృష్ణ మాదిగ సారధ్యంలో ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ లక్ష్యమే ధ్యేయంగా 30 ఏళ్ల పాటు సుదీర్ఘ పోరాటం చేసి భారతదేశంలోని అత్యున్నతమైన న్యాయస్థానం సుప్రీంకోర్టు ద్వారా ఏడుగురు జడ్జిల ధర్మాసనం తో కూడిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్ర చూడు చేత ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ న్యాయబద్ధమైనదని జడ్జిమెంట్ వెలువడవడం జరిగిందని తెలిపారు. ఆగస్టు ఒకటో తారీకున వచ్చినటువంటి జడ్జిమెంట్ ను ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి నిండు అసెంబ్లీ సమావేశంలో నేనే ఈ రాష్ట్రంలో ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ అమలు చేస్తానని మాట ఇవ్వడం జరిగింది. కానీ కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారని అన్నారు. వర్గీకరణ అమలు చేయకుండానే మొన్నటికి మొన్న డీఎస్సీ నియామకాల ఉత్తరువులను ఇవ్వడం జరిగిందని, అంటే రేవంత్ రెడ్డి మాల సామాజిక వర్గానికి తలవంచి మనం కష్టపడి తెచ్చుకున్న సుప్రీంకోర్టు ధర్మసానాన్ని పక్కనపెట్టి అమలు చేయకుండా జాప్యం చేయడం జరిగిందన్నారు. మాదిగ ఉప కులాలు రాజకీయ పార్టీలకు అతీతంగా ఈనెల 4 న జరగబోవు మాదిగల ఆత్మీయ సమ్మేళనానికి ఉమ్మడి జిల్లాలోని అన్ని పార్టీల మాదిగ రాజకీయ నాయకులు, మేధావులు, డాక్టర్స్, లాయర్స్, నిరుద్యోగులు, కవులు, కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని తెలంగాణ రాష్ట్రం మెడలు వంచి రాష్ట్ర ప్రభుత్వం మీద యుద్ధం చేసి వర్గీకరణ అమలు చేయించడంలో మాదిగలమంతా మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సంగాల విక్టరీబాబు మాట్లాడుతూ హసన్ పర్తి మండలం లో అన్ని గ్రామాల నుండి ఇంటికి ఇద్దరి చొప్పున కదలిరావాలని కోరారు. ఊరూరు నుండి డప్పు వాయిద్యాలతో ప్రతి ఒక్కరు కదిలి రావాలని విక్టరీబాబు మాదిగ కోరారు. ఈ సమావేశంలో మేకల రమేష్, బోడ యుగేందర్, రాజరాపు భిక్షపతి, పుల్ల నరేష్, తాళ్ల రమేష్, సంగాల కోటేశ్వర్, సంగాల కిషన్, ఇల్లందుల శోభనబాబు, సంగాల పరమేష్, సంగాల అశోక్, సంగాల రమేష్ హోంగార్డ్, రేణుకుంట్ల సురేష్, పెండ్యాల వీనసు, సదిరం ప్రశాంత్, పుట్ట భిక్షపతి, సంగాల రమేష్, సంగాల సుధాకర్, సంగాల పాలు, సంగాల సనత్, సంగాల అఖిల్, అరికిళ్ల నాగరాజు, సంగాల రాకేష్, సంగాల అనిల్, సంగాల రాజు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు రాధాకృష్ణుల ఫోటో బహూకరణ

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు యాస లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీటీసీ ధీగోజు నరసింహ చారీలు ఇటీవల తీర్థ యాత్రలకు వెళ్లి మధుర నుండి తీసుకు వచ్చిన రాధా కృష్ణుల విగ్రహాన్ని, ప్రసాదాలను ఆలేరు శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు వారి నివాసంలో అందించారు. ఈ కార్యక్రమములో జిల్లా అధ్యక్షులు అండెం సంజీవ రెడ్డి, కానుగు బాలరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దశాని సిద్ధులు గౌడ్, తాజా మాజీ సర్పంచ్ జన్నాయికోడే నగేష్, ఓబీసీ సెల్ మండల అధ్యక్షులు బత్తిని ఉప్పలయ్య గౌడ్, బీసీ సెల్ మండల అధ్యక్షులు కట్టెకోల హన్మంతు గౌడ్, కోరే మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

## కుల వర్గీకరణ విస్తృతస్థాయి సమావేశం


### పాల్గొన్న ఎమ్మెల్యే మురళీ నాయక్



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల వర్గీకరణ విస్తృతస్థాయి సమావేశంలో మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళీ నాయక్ పాల్గొన్నారు. నియోజకవర్గ ప్రజలకు కుల వర్గీకరణ గురించి ఎమ్మెల్యే మురళీ నాయక్, డీసీసీ అధ్యక్షులు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, డోర్నకల్ శాసనసభ్యులు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జాటోత్ రామచంద్రు నాయక్ వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రాష్ట్రవ్యాప్తంగా కుల గణన మీటింగులు నిర్వహించి బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరగాలని కులగణన చేపట్టింది.అందుకోసం ప్రత్యేక రూపకల్పనను ప్రతిపాదించారు. తెలంగాణలో నవంబర్ 6 నుంచి కులగణన ప్రక్రియను ప్రారంభించనున్నారు. అలాగే గాంధీ భవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. నవంబర్ 6 నుంచి 30 వరకు రాష్ట్ర వ్యాప్తంగా కులగణన జరగనుంది. ఇందుకోసం 75 ప్రశ్నలను సిద్ధం చేశామన్నారు. కుటుంబసభ్యుల పేర్లు, మతం, కులం, వయసు, మాతృభాష, మొబైల్, రేషన్ కార్డు నంబర్, విద్య, ఉద్యోగం, వృత్తి, ఆదాయం, భూములు, ఇల్లు, రిజర్వేషన్ ప్రయోజనాలు, అనేక విషయాలను పొందుపరిచమన్నారు. కుల గణనలో అన్ని కులాల వారు పాల్గొంటే బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందిన్నారు. దేశంలోనే కుల గణన చేపట్టిన మొదటి రాష్ట్రం గా తెలంగాణ రాష్ట్రం ఖ్యాతి గడించనుందని పేర్కొన్నారు. పేద బలహీన వర్గాల వారు అత్యున్న స్థాయికి వెళ్లడానికి కుల గణన కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని తెలిపారు. 70% ఉన్న బలహీన వర్గాల వారు సామాజికంగా ఆర్థికంగా నిలతుక్కు పోవడానికి కుల గణన ఉపయోగపడు తుందన్నారు. ఈ కార్యక్రమానికి మహబూబాబాద్ నియోజకవర్గానికి చెందిన జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, డీసీసీ ఉపాధ్యక్షులు, జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, పట్టణ పలు వార్డుల కౌన్సిలర్లు, ఫ్లోర్ లీడర్లు, నియోజకవర్గ మండలాల అధ్యక్షులు, మండల యూత్ అధ్యక్షులు, మండల వర్కింగ్ అధ్యక్షులు, గ్రామాల అధ్యక్షులు, నాయకులు, మాజీ జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, ఉప సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేట్ ఎంఎల్సీ సభ్యత్వ నమోదు గడువు పొడిగించాలి

### - కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవి ప్రసాద్ రావు



**విశ్వంభర, హైదరాబాద్:** మార్చ్ 25 న జరిగే గ్రాడ్యుయేట్ ఎంఎల్సీ సభ్యత్వ నమోదు గడువు నవంబర్ 6 తో ముగుస్తున్నందున గడువు డిసెంబర్ చివరి వరకు పొడిగించాలని బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవి ప్రసాద్ రావు ఎన్నికల కమిషన్ ను కోరడం జరిగింది అని అన్నారు. ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదు మందకొడిగా సాగుతున్నందున సరైన ప్రచారం చేయడం లో ఎన్నికల కమిషన్ విఫలమైందన్నారు. మెదక్, కరీంనగర్, అదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలలో దాదాపు 15 లక్షల మంది అర్హులైన గ్రాడ్యుయేట్స్ ఉన్నప్పటికీ కేవలం పది శాతం మాత్రమే నమోదు చేసుకున్నారని తెలిపారు. ప్రసార సాధనాలలో ప్రచారం చేసి నమోదు కేంద్రాలు పెంచాలి అని కోరారు. ఆన్ లైన్ లో నమోదు చేసుకున్న గ్రాడ్యుయేట్స్ ను సర్టిఫైడ్ కాపీలు సంబంధిత ఎంఆర్వో కార్యాలయాలలో ఇవ్వాలని అడుగుతున్నారని ఇది సరికాదని పేర్కొన్నారు. ఏమైనా వివరణ కావాలంటే ఫీల్డ్ వెరిఫికేషన్ చేసే విధంగా ఆదేశాలు ఇవ్వాలని ఎన్నికల కమిషన్ ను కోరుతున్నాం అని అన్నారు. ఎన్నికల కమిషన్ వెంటేనే విస్తృత ప్రచారం కలిగించి నమోదు శాతం పెంచడానికి చర్యలు తీసుకోవాలి కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవి ప్రసాద్ రావు తెలిపారు.

## సంత్ సేవాలాల్ గుడి నిర్మాణానికి భారీ విరాళం



**విశ్వంభర, షాద్‌నగర్:** రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండల కడియాల కుంట గ్రామపంచాయతీ పరిధిలో గిరిజనుల ఆరాధ్య దైవమైన శ్రీ సంతు సేవాలాల్ మహారాజ్ నూతన గుడి నిర్మాణానికి ఉప్పరిగడ్డ మాజీ సర్పంచ్ సునీత చందునాయక్ లు 2,22,222 రూపాయల విరాళం ఇచ్చారు. విరాళం ఇచ్చిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కుటుంబం ఆయురారోగ్యాలతో, అత్యున్నత పదవులలో కొనసాగుతూ నిరంతరం ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తూ, ప్రజల క్షేమాభివృద్ధికి పోరాడే ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కుటుంబానికి శ్రీ సంతు సేవాలాల్ మహారాజ్ తన ఆశీర్వచనాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మౌనిక హరికృష్ణ, ఉప్పరిగడ్డ మాజీ సర్పంచ్ సునీత చందు నాయక్, ఉప సర్పంచ్ రెడ్యానాయక్, కడియాల కుంట గ్రామపంచాయతీకి చెందిన సేవ్యానాయక్, మాజీ వార్డు సభ్యులు చందూలాల్, రమేష్, తావు సింగ్, రామచందర్, నరేందర్ పీర్యా, శంకర్, చట్ పట రవీందర్, మల్లేష్ నాయక్ తండావాసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 3న మెగా మెడికల్ హెల్త్ క్యాంపు




**విశ్వంభర, షాద్ నగర్:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ యూత్ వారి అబాబీల్ ఫౌండేషన్ ఈ నెల 3 ఆదివారం షాద్ నగర్ పట్టణం లోని శివ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో ఉచితంగా మెగా మెడికల్ హెల్త్ క్యాంపును నిర్వహిస్తున్నారు. ఈ వైద్య శిబిరం లో స్పెషలిస్ట్ డాక్టర్స్ సమక్షంలో రోగులకు వైద్య పరీక్షల తో పాటు ఉచితంగా మందులు పంపిణి చేస్తున్నారు. ఇందులో జనరల్ చెకప్, షుగర్, బీపీ, దంత పరీక్షలు, ఉచిత కంటి పరీక్షలు, మహిళలకు చెకప్ లు, ఉచితంగా ఇంజక్షన్లు, మందులు ఇవ్వబడుతాయి. ముఖ్యంగా ప్రసిద్ధ స్వరూప్ కంటి వైద్యాశాల సౌజన్యం లో కంటి సర్జరీ కూడా ఉచితంగా చేయబడుతాయి. షాద్ నగర్ నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అబాబిల్ ఫౌండేషన్ తరుపున షాద్ నగర్, ఫరూక్ నగర్ యూత్ తెలిపారు. సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ లు 9397120120, 9059448370, 8143639661, 9700793404, 9573965012.

## చట్టసభల్లో బీసీల రిజర్వేషన్ కోసం బీసీ సేన పోరాటం



**విశ్వంభర, షాద్ నగర్:** షాద్ నగర్ లో బీసీ సేన ఆద్వర్యంలో సమావేశం జరిగింది. ఈ నెల 5 న షాద్ నగర్ నియోజకవర్గం అధ్యక్షున్ని ఎంపిక చేయడం జరుగుతుందని ఈ సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీలకతీతంగా బీసీ నాయకులు హాజరుకావాలని బీసీ సేన విన్నవించింది. బీసీ సేన జాతీయ అధ్యక్షుడు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు తగ్గించి బీసీలకు అన్యాయం చేసిందని, అందుకని గత ప్రభుత్వన్ని బీసీలు తమ ఓట్లతో గద్దె దింపారని అన్నారు. ఇప్పుడు బీసీల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం అని, 60 శాతం ఉన్న బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేపట్టి స్థానిక సంస్థల్లో 42 శాతానికి రిజర్వేషన్ పెంచాలని బీసీ సేన డిమాండ్ చేసింది. జనాభాలో 60 శాతం ఉన్న బీసీలం మా వాటా మాకు కావాలని న్యాయబద్ధంగా పోరాటం చేస్తున్నామన్నారు. 7% ఉన్న అగ్రవర్ణాలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించిన కేంద్ర ప్రభుత్వం, బీసీలు 60 శాతం ఉంటే చట్టసభల్లో 50 శాతం బీసీలకు రిజర్వేషన్ కలిపించాలని కోరారు. లేనియెడల బీసీ సేన ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వంపై, అలాగే రాష్ట్ర ప్రభుత్వంపై పెద్ద ఎత్తున తిరుగుబాటు చేస్తామని హెచ్చరించారు.

## పాదయాత్ర స్వాములకు మధ్యాహ్న భిక్ష ఏర్పాటు

### - యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందెమోహన్, సౌమ్య



**విశ్వంభర, నందిగామ:** నందిగామ మండలం అంతిరెడ్డి గూడెం గ్రామానికి చెందిన అంజి యాదవ్ మిత్ర బృందానికి నందిగామ అయ్యప్ప స్వామి దేవాలయం నుండి శబరిమలై పాదయాత్ర వెళుతున్న సందర్భంగా షాద్ నగర్ పట్టణంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందే మోహన్ ముదిరాజ్ సౌమ్య దంపతులు తన క్యాంపు కార్యాలయంలో అయ్యప్పస్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. భిక్ష స్వీకరించిన అయ్యప్ప స్వాములు అందే మోహన్ సౌమ్య దంపతులకు ఆ అయ్యప్ప దీవెనలు కలగాలని ఆకాంక్షించారు.

## డైట్, కాస్మెటిక్ చార్జీల పెంపును హర్షించిన బీహెచ్ఎస్ఎస్



**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రం లోని అన్ని ప్రభుత్వ వసతి గృహాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల హాస్టళ్ల పరిధిలోని విద్యార్థులందరికీ ప్రభుత్వం డైట్, కాస్మెటిక్ చార్జీలను పెంచుతూ జీ ఓ ఎం ఎస్ నెం. 9, 30 అక్టోబర్ 2024 విడుదల చేయడం పట్ల బాలల హక్కుల సంక్షేమ సంఘం (బీహెచ్ఎస్ఎస్) హర్షం వ్యక్తం చేసింది. ప్రస్తుతం అమలులో ఉన్న రేట్లకు 40 శాతం మేరకు డైట్, కాస్మొటిక్ ఛార్జీలను పెంచాలన్న అధికారుల నేతృత్వంలోని కమిటీ ప్రతిపాదనలను ముఖ్యమంత్రి యథాతథంగా ఆమోదించారు. ఈ పెంపుదల వల్ల రాష్ట్రంలో 7,65,705 మంది విద్యార్థినీ విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుందనీ అందుకు సీఎం రేవంత్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని బాలల హక్కుల సంక్షేమ సంఘం (బీహెచ్ఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షులు డా. గుండు కిష్టయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంజమూరి రఘునందన్ లు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. పెంచిన డైట్, కాస్మెటిక్ చార్జీలు సక్రమంగా విద్యార్థులకు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. తరచుగా అన్ని ప్రభుత్వ వసతి గృహాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల హాస్టళ్లను అధికారులు, ప్రజా ప్రతినిధులు, మంత్రులు తనిఖీలు చేయాలనీ వారికి నాణ్యమైన భోజనము అందేలా చూడాలని కోరారు.

## గట్టిప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలి





**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండలం గట్టిపలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని గ్రామ జేఏసీ ఆధ్వర్యంలో మూడోసారి రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నారు. గత రెండుసార్లు నిరాహార దీక్షలు చేసినా ఫలితం రాలేదని మళ్లీ త్రయోదశ రిలే నిరాహార దీక్షల కు పూనుకున్నారు గట్టుప్పలపల్లి వాసులు. 2వ రోజు రిలే నిరాహార దీక్షలో భాగంగా గ్రామంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. మండలాన్ని సాధించే వరకు పోరాటాన్ని ఆపేది లేదని జేఏసీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ఛైర్మన్ మోకురాల అశోక్ గౌడ్, జేఏసీ వైస్ ఛైర్మన్ ఎదుల శరత్చంద్ర, మోకరాల ఆంజనేయులు గౌడ్, ఎదుల అనిల్, దుబ్బ మల్లేష్, బోయిన్పల్లి కృష్ణ, డప్పు కళాకారుల కొమ్ము రామకృష్ణయ్య, కావాలి జంగయ్య, బాలయ్య, తండ్రి కంటి బాలయ్య, ఇద్దమయ్య, బొగ్ర రామయ్య, బొగ్ర ఆదమ్, కుమారి మల్లయ్య, గోవింద్ రాత్తయ్య, ఎదుల రాములు తదితరులు పాల్గొన్నారు.

## ఆంజనేయ స్వామి ఆలయంలో ఘనంగా పల్లకీ సేవ

దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం



**విశ్వంభర, రంగారెడ్డి జిల్లా:** షాద్ నగర్ మున్సిపాలిటి పరిధిలోని సోలిపూర్ చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భజన భక్త బృందం సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. శ్రీ ఆంజనేయస్వామి విగ్రహాన్ని పల్లకిలో మోస్తూ ఆట పాటలతో, భజనలతో భక్తులు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. భక్తి పాటలు భజనలతో ఆలయంలో శ్రీరామ నామస్మరణ మార్మోగింది. ఆలయ ప్రధాన అర్చకులు రఘుపతిరావు, రాఘవేంద్ర చార్య, అర్చకులు కృష్ణ, ప్రమోద్, సునీల్ పంతులు భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. దేవాలయ అభివృద్ధికి, అన్నదాన కార్యక్రమానికి దాతలు సహకరించాలని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు శ్రీశైలం గౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో పులిమామిడి శ్రీశైలం గౌడ్, వసంతరావు, అన్నారం రఘు గౌడ్, గడ్డమీద రమేష్ ముదిరాజ్, చెట్ల వెంకటేష్, రఘునందన్ రెడ్డి, క్యాసెట్ శ్రీనివాస్, కిషన్ నాయక్, రాఘవేందర్, నారాయణ, వీర్లపల్లి కృష్ణయ్య, లక్ష్మీకాంత్ రెడ్డి, కృష్ణ చారి, శంకరయ్య యాదవ్, వీఆర్వో బచ్చన్న, యాదగిరి, పి. ప్రవీణ్ గౌడ్, పద్మా వెంకటేష్, గోరియా నాయక్, కొత్త సత్తయ్య గౌడ్, శ్రీనివాస్, రమేష్, సుధాకర్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, రవీందర్, మాజీ వార్డు సభ్యులు సింగపాగ లక్ష్మయ్య, భజన భక్త బృందం, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఈతకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం శుక్రవారం సీఐ సోలోమన్ రాజు సూచనల మేరకు పోలీసు సిబ్బంది చెరువులు, కుంటలు, చెరువుల వద్దకు వెళ్ళి ఈత కొట్టేవారు అక్కడి నీటితో ఉన్న ప్రాంతం గురించి అవగాహనతో ఉండి ఈతకు వెళ్ళాలని ప్రజలకు తెలిపారు. ప్రమాదకరమైన ప్రాంతాల్లోకి వెళ్లి ఇతకొట్టకూడదనీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆ ప్రాంతాల్లో ప్లేక్సీలను ఏర్పాటు చేశారు. ఏర్పాటు చేయటంలో పాల్గొన్న హెడ్కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా నిరాహార దీక్ష




**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం రామన్నపేట, కొమ్మయిగూడెం గ్రామాల పరిధిలో అంబుజా సిమెంట్ పరిశ్రమ పెట్టే నిర్ణయాన్ని యాజమాన్యం వెంటనే వెనక్కి తీసుకోవాలని, వెల్లంకి గ్రామ అఖిలపక్షం నాయకులు , గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తూ నిరాహార దీక్ష చేపట్టారు. తెలుగుదేశం పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు నకిరేకంటి గణేష్, పోచబోయిన మల్లేష్, బీఎస్పీ నియోజవర్గ అధ్యక్షులు నాయకులు గునీ రాజు, జనసేన మండల పార్టీ నాయకులు తూడి సంజయ్, సీపీఎం పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి అవనగంటి నాగేష్, డీఎస్పీ నాయకులు నకిరేకంటి నరేందర్, టీఎన్ఎస్ఎఫ్ మండల నాయకులు కుర్మా మహేందర్, తీన్మార్ మల్లన్న టీం కాకి శ్రీకాంత్, కట్ట మహేందర్, గుర్రం మహేష్, బండ్ల హరీశ్, తాటిపాముల శ్రీకాంత్ శనివారం నిరాహార దీక్షలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ రామన్నపేట, కొమ్మాయిగూడెం గ్రామాల పరిధిలో ఏర్పాటు చేయబోతున్న అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీనీ వ్యతిరేకిస్తూ వెల్లంకి అఖిలపక్షం ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ ఎదుట నిరాహార దీక్షలో పాల్గొన్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ టీ.ఎన్.ఎస్.ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి నకిరేకంటి గణేష్ సభాధ్యక్షులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ వేదిక కన్వీనర్ పెంటయ్య, కో-కన్వీనర్ రెహాన్, నకరికంటి గణేష్, ఫజిల్ బేగ్, గునీ రాజు, నకిరేకంటి నరేందర్, అవనగంటి నాగేష్ మాట్లాడుతూ అంబుజా సిమెంటు ఫ్యాక్టరీ వల్ల జరగబోయే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న నాయకులు మాజీ సర్పంచ్ తాళ్లపల్లి సత్తిరెడ్డి, మాజీ ఎంపీటీసీ తిమ్మాపురం మహేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ తాటిపాముల శేఖర్ గౌడ్, సీపీఎం పార్టీ అధ్యక్షులు అవనగంటి నాగేష్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయిటిపాముల పెద్దులు, గోశిక కొండల్ రెడ్డి, తాటిపాముల స్వామి, నకిరేకంటి రవీందర్, ఎడ్ల సురేందర్ రెడ్డి, తాటిపాముల శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

## చదువుల తల్లికి ఆర్థిక సహాయం అందించిన అంబేద్కర్ సొసైటీ




**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం శోభనాద్రిపురం గ్రామానికి చెందిన ఎండి సానియా నీట్ 2024 మొదటి ప్రయత్నంలోనే మంచి ర్యాంకు సాధించి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు పొందిన పేద విద్యార్థినీ చదువుకు ఆటంకం కలగకుండా తన తండ్రి జహంగీర్ దాతలను ఆర్థిక సహాయం కోరారు. అంబేద్కర్ సొసైటీ శోభనాద్రిపురం ఆధ్వర్యంలో సానియా చదువులకు ఇబ్బంది కలగకుండా 82 వేల ఆర్థిక సహాయం సొసైటీ నుంచి అందించినారు. సానియాను అంబేద్కర్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో చదువులకు ఎలాంటి ఇబ్బంది కలిగిన తాము అండగా ఉంటామని తెలిపినారు. గ్రామంలో ఎవరైనా పేద విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ఇబ్బంది పడితే, వారికి తప్పకుండా అంబేద్కర్ సొసైటీ ఆధ్వర్యంలో సహాయం చేస్తామని తెలిపినారు. ఆర్థిక సహకారం అందించిన వారు కంచి ముత్తయ్య, మాజీ అడిషనల్ డీసీపీ రూ.5వేలు, కంచి మల్లేశం, మాజీ ఆర్టీసీ డ్రైవర్ రూ.3వేలు, కంచి రమేష్, సివిల్ ఇంజనీర్ రూ.8వేలు, కంచి నరసింహ మాజీ సీజీఎం రూ.20వేలు, కంచి బాలస్వామి, స్కూల్ అసిస్టెంట్ (సోషల్) రూ. 5వేలు, కంచి దశరథ ఎల్పీఎల్.హెచ్చ్ఎం వెయ్యి రూపాయలు, కంచి రామలింగం (బిజినెస్) రూ.5వందలు, కంచి మధుసూదన్ (బిజినెస్) రూ.5వేలు, కంచి సత్తయ్య (ప్రైవేట్ టీచర్) రూ. 2వేలు, కంచి సుమన్ (సీఐ) 20వేలు, డాక్టర్ కంచి రాజేంద్రప్రసాద్ (అసిస్టెంట్ ప్రొఫెసర్, ఓయూ) రూ. 2,500, డాక్టర్ ఝాన్సీ (డిప్యూటీ సివిల్ సర్జన్) రూ. 10వేలు, మొత్తం 82 వేల రూపాయలను అందించినారు.

## ఏబీవీపీ నూతన అధ్యక్షుడిగా మధుసూదన్



**విశ్వంభర, షాద్ నగర్:** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) షాద్ నగర్ నూతన అధ్యక్ష కార్యదర్శులుగా మధుసూదన్ నవీన్ నాయక్ లో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు శంషాబాద్ విభాగ్ కన్వీనర్ సూర్య ప్రకాష్ తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో అతిపెద్ద స్టూడెంట్ ఆర్గనైజేషన్ ఏబీవీపీ అని అన్నారు. విద్యార్థులకు ఏ ఆపద వచ్చిన అందుబాటులో ఉంటూ నిరంతరం విద్యారంగ సమస్యలపై అలుపెరుగని పోరాటం చేయాలని నిరంతరం దేశ సేవలో ఉంటూ మంచి స్థాయికి ఎదగాలని చదువుతోపాటు దేశ అభివృద్ధిలో ముందుండాలని తెలిపారు. 1949 జులై 9న 5 మంది విద్యార్థులతో ఢిల్లీ యూనివర్సిటీలో ఏర్పడి ఈరోజు ప్రపంచంలోనే అతిపెద్ద స్టూడెంట్ ఆర్గనైజేషన్ గా ఏబీవీపీ ఉందని, దేశానికి ఆపద వస్తే మరో ఇండియాన్ ఆర్మీల బయటికి వచ్చి పనిచేయడానికి ఏబీవీపీ కార్యకర్తలు సిద్ధంగా ఉంటారని తెలిపారు. ఏబీవీపీ కార్యకర్తలకు ఎటువంటి స్వార్థం లేకుండా నిస్వార్థంగా పనిచేయాలని ప్రస్తుత సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై అలాగే విద్యారంగ సమస్యలపై అలుపెరుగని పోరాటం చేయడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం 2024 -2025 సంవత్సర నూతన షాద్ నగర్ నగర అధ్యక్షులుగా మధుసుధన్, కార్యదర్శి గా నవీన్ నాయక్, ఉపాధ్యక్షులు సాయి కుమార్, అక్షయ్, జగదీశ్, దీపక్, సంయుక్త కార్యదర్శిలుగా విజయ్, సాయి కిరణ్, లోకేష్, నవీన్, (ఎస్ఎఫ్ డి) రాజేందర్ కన్వీనర్ గా, హాస్టల్స్, విష్ణు, కన్వీనర్ గా (ఎస్ ఎఫ్ ఎస్) మహేందర్ కన్వీనర్ గా (ఆర్ కెఎం), పవన్ కన్వీనర్ గా ఖేల్ కన్వీనర్ గా, జశ్వంత్ మీడియా కన్వీనర్ గా, అనురాగ్. తదితరులు పాల్గొన్నారు.

## స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేసిన జిల్లా ప్రోగ్రాం అధికారి



**విశ్వంభర, మహబూబాబాద్:** మెటర్నల్ చైల్డ్ హెల్త్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సారంగం ఆధ్వర్యం లో శనివారం మహబూబాబాద్ పట్టణం లోని ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రైవేట్ ఆస్పత్రులు అన్నీ తెలంగాణ క్లీనికల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్ట్ ప్రకారంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వారు అందించే సేవలకు తీసుకునే రుసుమును, ప్రతి హాస్పిటల్ ఆవరణలో అందరికి కనిపించే విధంగా ధరల సూచికల బోర్డులను ప్రదర్శించాలని, ఆస్పత్రి ఆవరణ పరిశుభ్రంగా ఉండాలని, రోగ గ్రస్తులకు తగిన విధంగా సౌకర్యాలు కల్పించాలని, అవసర నిమిత్తమైన పరీక్షలు మాత్రమే రాయాలని, అనవసరమైన పరీక్షలు రాయకూడదని పేర్కొంటూ, హాస్పిటల్లో ఉన్న రికార్డులను ఐపీ, ఓపీ రిజిస్టర్ ల ను పరిశీలించారు. స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేస్తూ, గర్భస్థలింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని, లింగ నిర్ధారణ చేసినట్లయితే, చేపట్టిన వైద్యాధికారికి, ప్రోత్సహించిన కుటుంబ సభ్యులకు, పీసీ అండ్ పీఎన్డీటీ యాక్ట్ 1994-1996 నిబంధనలను అనుసరించి మొదటి తప్పుకు 10 పదివేల జరిమానా మూడు 3 సంవత్సరాల జైలు శిక్ష, రెండవ తప్పుకు ఐదు 5 సంవత్సరాల జైలు శిక్ష, 50 వేల జరిమానా విధించబడుతుంది, డాక్టర్ యొక్క పట్టా రద్దుకు సిఫారసు చేపడుతుందని హెచ్చరించారు. చట్ట విరుద్ధ మైన అబార్షన్స్ నిర్వహించినట్లయితే అట్టి యాజమాన్యాల పైన, మెడికల్ టర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ యాక్ట్ అనుసరించి చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. ఇట్టి తనిఖీలలో జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కే. ప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ కె.వి.రాజు, యెల్. డి కంప్యూటర్ అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

## న్యాయమూర్తిని సన్మానించిన బార్ అసోసియేషన్



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట బార్ అసోసియేషన్ సభ్యులు హైకోర్టు జస్టిస్ కునూరు లక్ష్మణ్ ను వారి స్వగ్రామంలోని తన ఇంటి వద్ద దీపావళి సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానించి, సబ్-కోర్టు ప్రారంభోత్సవ ఆల్బం ను వారికి అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.ఏ మజీద్, సీనియర్ న్యాయవాదులు పి.అశోక్ కుమార్, జినుకల ప్రభాకర్, ఉయ్యాల హనుమంత్ గౌడ్, బి. డేవిడ్, నకిరేకంటి మొగులయ్య, నోముల స్వామి, దినేష్ కుమార్, యాదాసు యాదయ్య, సుక్క శ్రవణ్ కుమార్, దంతురి సత్తయ్య, మామిడి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు దొంగల అరెస్ట్




**విశ్వంభర, వెల్దండ:** గత కొన్ని రోజులుగా వంగూర్, కల్వకుర్తి, ఉప్పునుంతల తదితర మండలాల్లో వరసగా దొంగతనాలకు పాల్పడుతున్న వికారాబాద్ జిల్లా కు చెందిన గుడాల మాణిక్యం, సంగారెడ్డి జిల్లా కు చెందిన చింత బాలరాజ్ అనే ఇద్దరు వ్యక్తులను నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ సీఐ విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టుకున్నారు. వారి వద్ద నుంచి దొంగతనం చేసిన 9 తులాల బంగారం, 1.2 కిలోల వెండి ఆభరణాలను, 50 వేల నగదు, రెండు సెల్ ఫోన్లు, దాదాపు 9 లక్షల 35 వేల రూపాయల విలువగల సొత్తును, ఎర్టిగా కారు స్వాదినపరుచుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టి కోర్టుకు తరలించినట్టు వెల్దండ సీఐ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు.

## కులగణన సర్వేపై విస్తృత స్థాయి సమావేశం

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు అండెం సంజీవరెడ్డి



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గ కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మాకంగా తీసుకున్న కుల గణన ఇంటింటి కుటుంబ సర్వేపై యాదాద్రి భువనగిరి జిల్లా డీసీసీ అధ్యక్షులు అండెం సంజీవరెడ్డి అధ్యక్షతన జిల్లా స్థాయి విస్తృత సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిలుగా ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఎమ్మెల్సీ తిన్మార్ మల్లన్న, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ ఛైర్మన్ పోతం శెట్టి వెంకటేశ్వర్లు, ఆలేరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఐనాల చైతన్య మహేందర్ రెడ్డి, వైస్ ఛైర్మన్ పచ్చిమట్ల మదార్ గౌడ్, పాలక వర్గం, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కుల గణనలో ఓబీసీ గణన చేర్చడం అభినందనీయం - వక్కలంక శ్రీనివాసరావు



**విశ్వంభర, ఎల్బీనగర్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో కుల గణన పూర్తి చేసేందుకు కంకణం కట్టుకున్న నేపథ్యంలో కేంద్రంలో ఓబీసీ గణన చేర్చాలని నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ప్రాంతీయ కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టనున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ కులగణన దేశానికి రోల్ మోడల్ గా కానుందని రేవంత్ రెడ్డి ప్రకటించడం అభినందనీయమని అన్నారు. నవంబర్ 30 కల్లా కులగణను పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఆ దిశగా కేంద్ర ప్రభుత్వంపై తెలంగాణ నుంచే యుద్ధం ప్రకటించడం అభినందనీయమని అన్నారు. తెలంగాణలో జరిగే కుల గణన అన్ని రాష్ట్రాలకు ఓ కనువిప్పు కావాలని అన్నారు. ఈనెల 5, 6వ తేదీలో జరిగే బహిరంగ సభకు కాంగ్రెస్ కమిటీ అగ్రనేత రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే ఎవరు హాజరైన ఆయా సభలను జయప్రదం చేయాలని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు వక్కలంక శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

## టీటీడీ మెంబర్ నర్సిరెడ్డికి సన్మానం



**విశ్వంభర, ఆమనగల్లు:** తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యుడుగా నియమితులైన టీడీపీ సీనియర్ నేత నన్నూరి నర్సిరెడ్డిని శనివారం ఆమనగల్లు మండల టీడీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్ లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ లో టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి, కల్వకుర్తి నియోజకవర్గ కో ఆర్డినేటర్ అందే యాదిలాల్ ఆధ్వర్యంలో నర్సిరెడ్డి ని కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. దశాబ్దాల కాలంగా పార్టీకి నర్సిరెడ్డి అందించిన సేవలకు గుర్తింపు లభించిన ఈ సందర్భంగా టీడీపీ నాయకులు పేర్కొన్నారు. టీటీడీ బోర్డు సభ్యుడిగా అవకాశం రావడం ఆనందంగా ఉందని ఈ సందర్భంగా నర్సిరెడ్డి పేర్కొన్నట్లు యాదిలాల్ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య సెల్ కార్యదర్శి కండే సత్యనారాయణ, టీడీపీ నాగర్ కర్నూల్ పార్లమెంటు కోశాధికారి అర్థం నరసింహ, టీడీపీ సీనియర్ నాయకులు ఎన్ టి. పంచాక్షరి, గాజుల పద్మనాభం తదితరులు ఉన్నారు.

## మటన్ షాపు నిర్వాహకునికి జరిమానా

నిబంధనలకు విరుద్ధంగా మాంసం విక్రయానికి ఫైన్



**విశ్వంభర, వరంగల్ జిల్లా:** నిబంధనలకు విరుద్ధంగా శనివారం మాంసం విక్రయించినందుకు నర్సంపేట్ రోడ్ లో గల ఏ-1 మటన్ షాపు నిర్వాహకునికి జరిమానా విధించినట్లు బల్దియా ముఖ్య ఆరోగ్యధికారి డా. రాజారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిషనర్ ఆదేశాల మేరకు శానిటరీ సూపర్వైజర్ పి భాస్కర్ ఆధ్వర్యంలో ఏ-1 మటన్ షాపు నిర్వాహకుడు నిబంధనలకు విరుద్ధంగా శనివారం మాంసం విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు షాపును తనిఖీ చేసి యజమానికి రూ మూడువేల రూపాయలు జరిమానా విధించడం జరిగిందని తెలిపారు. మాంసం దుకాణదారులు విధిగా నిబంధనలు పాటించాలని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ చట్టం ప్రకారం అట్టి దుకాణాలను మూసివేసే అధికారం బల్దియా కు ఉందని అన్నారు. దుకాణదారులు కార్పొరేషన్ కు సహకరించాలని సీ ఏం హెచ్ ఓ కోరారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్వైజర్ పి భాస్కర్, శానిటరీ ఇన్స్పెక్టర్ గోల్కొండ శ్రీను, జవాన్లు నాగరాజు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.


## సదర్ ఉత్సవంలో నరకాసుర వధ



**విశ్వంభర, బషీర్ బాగ్:** తెలంగాణ రాష్ట్రం లోనే మొదటి సారి సదర్ ఉత్సవంలో నరకాసుర వధ ను గొంటి కుమార్ చౌదరి యాదవ్ అధ్వర్యంలో అమీర్ పేట్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిధులు గా మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి, సినీ నటి కరాటే కళ్యాణి, నటుడు శ్రీ కరణ్, చికోటి ప్రవీణ్ తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమం కమిటీ సభ్యులైన గొంటి విక్రమ్ యాదవ్, ముచ్చర సత్య నారాయణ యాదవ్, అయిలయ్య యాదవ్, కుందేళ్ళ అర్జున్ యాదవ్, మారమోని శ్రశైలం యాదవ్, రాహుల్ యాదవ్ లు పాల్గొని ఈ సదర్ ఉత్సవాన్ని దిగ్విజయం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

- ధాన్యం కొనుగోళ్లపై వీడియో కాన్ఫరెన్స్
- రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**విశ్వంభర, మహబూబాబాద్:** జిల్లాలలో నిర్దేశించుకున్న ప్రణాళిక ప్రకారం దాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తి స్థాయిలో వెంటనే ప్రారంభించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హైదరాబాద్ లోని సచివాలయం నుంచి ధాన్యం కొనుగోలు పై రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ధాన్యం కొనుగోలు పై తీసుకోవాల్సిన చర్యల గురించి పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి డి.ఎస్. చౌహాన్ అధికారులకు సూచించారు. మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్టాత్మకమని, ఏ చిన్న ఇబ్బంది లేకుండా సమర్థవంతంగా ధాన్యం కొనుగోలు జరిగేలా జిల్లా కలెక్టర్లు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని అన్నారు. ప్రభుత్వం కొన్ని వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టిందని అన్నారు. సన్న రకం ధాన్యం సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్వింటాల్ 500 రూపాయల బోనస్ ప్రకటించిందని తెలిపారు. జిల్లాలో రూపొందించుకున్న ప్రణాళికల ప్రకారం దాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తి స్థాయిలో ప్రారంభించాలని, కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన ప్యాడీ క్లీనర్, ఇతర సామాగ్రి వెంటనే యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని అన్నారు. దొడ్డు రకం ధాన్యం సన్న రకం కోనుగోలు కేంద్రాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ తీసుకురావద్దని అన్నారు. జిల్లాలో రైస్ మిల్లర్ల వద్ద తాలు పేరుతో ఎటువంటి ధాన్యం కోతలు జర్గవద్దని, కొనుగోలు కేంద్రాల వద్ద నాణ్యత ప్రమాణాలు పరిశీలించిన తర్వాత కొనుగోలు చేయాలని, రైతుకు ఎటువంటి నష్టం రావడానికి వీలు లేదని మంత్రి స్పష్టం చేశారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలను విస్తృతంగా ప్రచారం చేయాలని, రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకుని రావాలని మంత్రి సూచించారు. జిల్లాలోని రైస్ మిల్లర్లకు ధాన్యం కేటాయింపు కోసం బ్యాంకు గ్యారంటీ తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం నిర్ణయించి ఉత్తర్వులు జారీ చేసిందని, వీటిని కట్టుదిట్టంగా అమలు చేయాలని అన్నారు. రైస్ మిల్లర్లతో సమావేశాలు నిర్వహించాలని, జీఓ 27 పై చర్చించాలని, రైస్ మిల్లర్లచే బ్యాంక్ గ్యారంటీ సమర్పిస్తామని అండర్ టేకింగ్ తీసుకుని ధాన్యం కేటాయింపు చేయవచ్చని అన్నారు. రైస్ మిల్లర్లు బ్యాంకు గ్యారంటీ సమర్పించని పక్షంలో జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యం భద్ర పరిచేందుకు అవసరమైన మేర ఇంటర్మీడియట్ గోడౌన్ సన్నద్ధం చేయాలని, ప్రతి జిల్లాలో ధాన్యం కొనుగోలు ఫోన్ నెంబర్ తో కూడిన గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 48 గంటల్లో చెల్లింపులు పూర్తయ్యేలా చూడాలని అన్నారు. పక్క రాష్ట్రాల ధాన్యం మన కొనుగోలు కేంద్రాలకు రాకుండా బార్డర్ల వద్ద చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ, ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు 27 పై రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించామని, ముందుగా రైస్ మిల్లర్లు అండర్ టేకింగ్ సమర్పించి తర్వాత బ్యాంకు గ్యారంటీలు సమర్పించాలని సమాచారం అందించామని అన్నారు. ఇబ్బంది లేకుండా సమర్థవంతంగా ధాన్యం కొనుగోలు జరిగేలా ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ సమావేశంలో డీఎం సివిల్ సప్లై కృష్ణవేణి, డీ సీ ఓ వెంకటేశ్వర్లు, డి.ఎ.ఓ వసంత, డి.హెచ్.ఎస్.ఓ మరియన్న, లీగల్ మెట్రాలజీ అధికారి విజయ్ కుమార్, ఆ.ర్.టి.ఓ భద్రు నాయక్ పాల్గొన్నారు.

## ఫైర్ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల చొప్ప లారీ దగ్ధం

### -మాజీ జెడ్పీటీసీ దశరథ్ నాయక్



**విశ్వంభర, ఆమనగల్లు:** ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే సామాన్యుడి సంపదకు గండి పడుతుందని కడ్తాల్ మాజీ జెడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. బీజేపీ సీనియర్ నాయకులు మేడిగడ్డ మాజీ సర్పంచి గోపి నాయక్ లారీ జొన్నచొప్ప నింపుకొని మేడిగడ్డ గ్రామంలో నుండి వస్తున్న సమీపంలో ప్రమాదవశత్తు విద్యుత్ తీగలకు తగిలి లారీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ లారీని వెంటనే ఊరు బయటకు దాటించి రోడ్డుపై ఆపేశాడు. అనంతరం ఫైర్ ఇంజన్ కి సమాచారం అందించాడు. మూడు గంటలు గడిచిన సకాలంలో ఫైర్ ఇంజన్ రాకపోవడం తో చొప్పలారీ అక్కడికక్కడే కాళీ బూడిదైపోయింది. సమాచారం అందుకున్న కడ్తాల్ మాజీ జెడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ వెంటనే మేడిగడ్డ చేరుకొని గోపి నాయక్ ను పరామర్శించారు. అనంతరం ప్రమాదాన్ని గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. సకాలంలో ఫైర్ ఇంజన్ వచ్చి ఉంటే ఇంత ప్రమాదం జరిగిఉండేది కాదని లారీ ఓనర్ గోపి నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. ఫైర్ ఇంజన్ కి సమాచారం అందించి మూడు గంటలు గడిచిపోయిన ఫైర్ ఇంజన్ రాకపోవడం బాధాకరమని దశరథ్ నాయక్ అన్నారు. ఫైర్ స్టేషన్ ఆమనగల్ లో ఉంటే క్షణాల్లో ఫైర్ ఇంజన్ వచ్చి మంటలు ఆర్పిఉండేదని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే గోపి నాయక్ లారీ కాలిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కడ్తాల్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ, ఏఎంసీ మాజీ డైరెక్టర్ లాయక్ అలీ, గణేష్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్ పాదయాత్రకు సంపూర్ణ మద్దతు

### అరవింద్ శర్మ



**విశ్వంభర, ఎల్బీనగర్:** కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఆరాచాక పాలన కు చరమ గీతం పాడాలనీ కేటీఆర్ ప్రజల తరుపున, ప్రజల గొంతుగా చేయబోయే పాదయాత్ర కు తన సంపూర్ణ మద్దతు ఉంటుంది అని మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ అన్నారు. మోసపూరిత 420 హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఏ ఒక్క హామీలు అమలు చేయలేదన్నారు. హైడ్రా పేరిట అమాయక ప్రజల పై బుల్డోజర్ లు పంపి వారి బతుకులను రోడ్డు పాలు చేసిందని అన్నారు. మూసి ప్రక్షాళన పేరిట లక్ష ల కోట్లు దోసి ఢిల్లీ కి కప్పం కట్టేందుకు రేవంత్ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందని అన్నారు. గత 10 యేండ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో నీ అన్ని వర్గాల ప్రజలు సంతోషం గా ఉన్నారని అన్నారు. ఈ కాంగ్రెస్ పాలనలో రైతులు, మహిళలు, విద్యార్థులు, వృద్ధులు, ఉద్యోగస్తులు ఎవరు కూడా సంతోషంగా లేరని, ఇలాంటి సందర్భాల్లో కేటీఆర్ పాదయాత్ర చేయడం ప్రజల తరుపున ప్రభుత్వం పై పోరడడం ప్రజలందరూ మంచి నిర్ణయం అని స్వాగతిస్తున్నారని అన్నారు. మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆశీస్సులతో తాను కూడా కేటీఆర్ పాదయాత్ర లో ఆసాంతం పాల్గొంటానని వెల్లడించారు.

## హామీలను నిలబెట్టుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుంది

### - కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి



**విశ్వంభర, కల్వకుర్తి:** కల్వకుర్తి పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే కు సంబంధించిన సమీక్ష సమావేశాన్ని కాంగ్రెస్ నాయకులు అధికారులతో కలిసి కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన ఆరు హామీల లో భాగంగా కుల గణనకూడ చేపట్టి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తుక్కుగూడలో రాహుల్ గాంధీ ప్రకటించిన అన్ని హామీలను నెరవేర్చుతామని దానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా కట్టుబడి ఉంటుందని తెలిపారు. ఈ సమగ్ర కుటుంబ సర్వేను చట్ట ప్రకారంగా చేయవలసిన ప్రక్రియని, ప్రణాళిక బద్ధంగా, సమర్థవంతంగా ఇంటింటి సర్వే కు అందరూ సహకరించాలని సూచించారు. బాధ్యతాయుతంగా సర్వే నిర్వహించి సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా సక్రమంగా ప్రజలకు అందించడానికి తెలంగాణలో ఈ సర్వే ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ మెంబర్ బాలాజీ సింగ్, మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, పీసీసీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నరసింహ, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, హనుమాన్ నాయక్, అనిత విజయ్, కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కలెక్టర్ కు శుభాకాంక్షలు తెలిపిన సమాచార హక్కు వికాస సమితి సభ్యులు



**విశ్వంభర, నల్గొండ:** నల్గొండ జిల్లా సమాచార హక్కు వికాస సమితి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా కలెక్టర్‌గా నూతన బాధ్యతలు చేపట్టిన ఇలా త్రిపాఠిని కలిసి మెమెంటో ఇచ్చి స్వాగత శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ యర్రమాధ కృష్ణారెడ్డి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వై.హేమలత, జిల్లా ప్రధాన కార్యదర్శి చిత్రం శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి అలుగుబెల్లి వెంకటరెడ్డి, నిడమానూరు మండల కమిటి అధ్యక్షుడు తుంగతుర్తి రామకృష్ణ, నల్గొండ టౌన్ కార్యదర్శి పేరుకే యాదగిరి వున్నారు.



మాన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని అయ్యప్పస్వామి దేవాలయంలో సత్యప్రియ గురు స్వామి ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమం జరిగింది. దాదాపు 45 రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, ఆనంతుల రాజిరెడ్డి, జక్కిడి మల్లారెడ్డి, విజయ్ భాస్కర్ రెడ్డి, ప్రసాద్, చైతన్యరాజు, చలపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. (విశ్వంభర, ఎల్బీనగర్)

## సైబర్ నేరాలపై అప్రమత్తత ఎంతో అవసరం



**విశ్వంభర, ఎల్బీనగర్:** సైబర్ నేరాల పై అప్రమత్తత ఎంతో అవసరం అని సరూర్ నగర్ పోలీసు స్టేషన్ కానిస్టేబుల్లు శ్రీనివాస్, శ్రీవాణి, భగవతి లు అన్నారు. శనివారం సరూర్ నగర్ ఇన్స్పెక్టర్ సైధి రెడ్డి, అడ్మిన్ ఎస్ ఐ మారయ్య ల సూచనల మేరకు దిల్ సుఖ్ నగర్ లో సైబర్ క్రైమ్స్, యాంటి డ్రగ్ పై అవగాహన సదస్సులు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని అన్నారు. మొబైల్ కు వచ్చే లింకులను ఓపెన్ చేయడం వల్ల సైబర్ నేరగాళ్ల బారిన పడే అవకాశం ఉంటుందని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు ఫోన్ చేసి పిన్ నెంబర్, వ్యక్తిగత సమాచారాలను అడిగితే ఎవరితో షేర్ చేసుకోవద్దని సూచించారు. యువత గంజాయి, డ్రగ్స్ బారిన పడి వారి జీవితాన్ని చేజేతుల నాశనం చేసుకుంటున్నారని అన్నారు. గంజాయి, డ్రగ్స్ సేవిస్తూ పోలీసులకు పట్టుపడితే జీవితాంతం ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉంటుందని తెలిపారు.

## యువతిపై అత్యాచారం

### ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన



**విశ్వంభర, ఘట్కేసర్:** మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటుచేసుకుంది. కృష్ణ మార్ట్ లో పని చేసే యువతిపై బషీర్ నెల రోజుల క్రితం బల వంతంగా అత్యా చారానికి పాల్ప డ్డాడు. ఈ విషయంపై బాధితురాలు ఘట్కేసర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. నిందితుడు బషీర్ ని పోలీసుల అదుపులోకి తీసుకున్నారు. విషయం బయట పెడితే చంపుతానని బషీర్ బెదిరించడంతో బాధితురాలు తల్లిదండ్రులకు చెప్పుకోలేక మానసికంగా బాధపడింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సదరు ఉత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే సబిత



**విశ్వంభర, మహేశ్వరం:** తుక్కుగూడ మున్సిపాలిటీ రావిరాల గ్రామంలో నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో యాదవుల సంస్కృతి సాంప్రదాయంలో భాగంగా జరుపుకునే సదరు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇట్టి సదర్ ఉత్సవాలలో ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రా రెడ్డి మాట్లాడుతూ యాదవ సోదరులకు సదర్ దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. దున్న రాజుల విన్యాసాలు, యువకుల నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలోతుక్కుగూడ మున్సిపాలిటీ అధ్యక్షుడు జల్లల లక్ష్మయ్య యాదవ్ స్థానిక కౌన్సిలర్ రెడ్డిగల సుమన్, బాట సురేష్, మీగడ రాజు, శేఖర్ రెడ్డి, అశోక్, సుధాకర్, తిరుమలేష్, పొట్టోల్ల నరసింహ, బాట బిక్షపతి స్థానిక యువజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్ సేవలు సమాజానికి ఎంతో అవసరం

### ఎస్ఆర్ఆర్ ట్రస్ట్ ఛైర్మన్ రామచంద్ర రావు



**విశ్వంభర, ఎల్బీనగర్:** సీనియర్ సిటిజన్ సేవలు సమాజానికి ఎంతో అవసరమని ఎస్ఆర్ఆర్ ట్రస్ట్ ఛైర్మన్ రామచంద్రరావు అన్నారు. ఆర్కే పురం డివిజన్ చిత్ర లేవట్లో సీనియర్ సిటిజన్ భవనంలో కార్యవర్గ సమావేశాన్ని సీనియర్ సిటిజన్ అంజిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించి తీర్మానించారు. అనంతరం అక్టోబర్ మాసం నందు జన్మించిన వయవృద్ధులైన అంజన్ రావు, రవికుమార్, శంకర్, ఉదయ్ శంకర్ రెడ్డి లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు, సీనియర్ సిటిజన్లు పాల్గొన్నారు.

## సమగ్ర కుటుంబ సర్వే నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

### - కలెక్టర్ ఇలా త్రిపాఠి



**విశ్వంభర, నల్గొండ:** ఈ నెల 6 నుండి నిర్వహించనున్న సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణకు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే విషయమై శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ తన ఛాంబర్ లో అధికారులతో సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా జారీ చేసిన ఆదేశాల ప్రకారం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను సర్వే ఎన్యుమరేటర్లుగా తీసుకోవడం జరుగుతుందని, ఇందుకుగాను జిల్లాలో ఉన్న ఎస్జీటీ ఉపాధ్యాయుల జాబితాను తక్షణం సమర్పించాలని డీఈఓ ను ఆదేశించారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు జిల్లాలో మొత్తం 4,000 మంది ఎన్యుమనేటర్లు అవసరం కాగా, సుమారు 2,800 మంది టీచర్లు అందుబాటు లో ఉన్నారని, ఇది వరకు గుర్తించిన ఎన్యుమరేటర్లలో ప్రతిభ కలిగిన వారిని ముందుగా సర్వేకు నియమించి తక్కిన వారిని ఎన్యుమరేటర్లు గా తీసుకోవాలని, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు, వివిధ శాఖలలో పనిచేసే జూనియర్ అసిస్టెంట్లు, మెప్మా రిసోర్స్ పర్సన్లు, సీఆర్పీలు, తదితరులందరిని ఎన్యుమరేటర్లు గా తీసుకోవాలని చెప్పారు. అలాగే సర్వే నిర్వహించిన అనంతరం తక్షణమే డేటా ఎంట్రీ చేసేందుకు డాటా ఎంట్రీ ఆపరేటర్లను, సిస్టమ్స్ ను గుర్తించి సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఎన్యుమరేటర్లకు ఇచ్చేందుకు తిరిగి గుర్తింపు కార్డులను తయారు చేయాలని, స్టిక్కర్లు అన్నిటిని మరోసారి ముద్రించి సిద్ధం చేసుకోవాల్సిందిగా ఆమె ఆదేశాలు జారీ చేశారు. సీపీఓ వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి, ఆర్డీఓ అశోక్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసబ్ అహ్మద్, ఈడీఎం దుర్గారావు, తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

## తెలంగాణ దేశానికి దిక్సూచిగా మారబోతోంది

### - ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**విశ్వంభర, నల్గొండ:** జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షులు కేతావత్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, నాగార్జున సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి, మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కుల గణన, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు సంబంధించి చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఈ కుల గణన, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ద్వారా మన తెలంగాణ రాష్ట్రం దేశానికి దిక్సూచిగా మారబోతోందని అన్నారు. ఇలాంటి గొప్ప నిర్ణయం తీసుకున్న ఘనత కేవలం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీకి మాత్రమే దక్కుతుంది అని అన్నారు. రాజ్యాంగం అమలై గడిసిన 75 సంవత్సరాల కాలంలో బడుగు బలహనవర్గాల జీవితాల్లో చాలా మార్పులు వచ్చినా, చట్టాల్లో మార్పులు రాలేదని అన్నారు. ఈ సర్వే ద్వారా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన బడుగు, బలహీన వర్గాల వారికి తగిన న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



**విశ్వంభర, వెల్దండ:** వెల్దండ మండలం చౌదర్పల్లి గ్రామంలో గత వారం రోజుల కింద పోలె అలివేలు అనారోగ్య కారణంగా మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ ఆమె భర్త లక్ష్మయ్య కు 5 వేల రూపాయల ఆర్థిక సహాయం మాజీ వైస్ ఎంపీపీ వైస్ వెంకటయ్య గౌడ్ ద్వారా అందజేశారు. ఆయన అన్ని విధాల కుటుంబానికి ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుపతయ్య గౌడ్, బెంచి అంజయ్య, తగుల బుచ్చయ్య జానీ లక్ష్మయ్య, రాములు, వసంత్, అశోక్ పాల్గొన్నారు

## శిల్పారామంలో సెట్విన్ స్టాల్ ప్రారంభం



**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ సెట్విన్ ఆధ్వర్యంలో నగరంలోని శిల్పారామంలో సంస్థకు సంబందించిన స్టాల్ ను శనివారం సాయంత్రం ఆ సంస్థ చైర్మన్ ఎన్.గిరిధర్ రెడ్డి జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డితో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె. వేణుగోపాల్ రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చైర్మన్ గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ గతంలో ఎన్నడూలేని విధంగా శిల్పారామంలో సెట్విన్ కు స్టాల్ కేటాయించడం శుభపరిణామం అని, రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి కేంద్రాలను ఏర్పాటు చేయడానికి ఎల్లపుడు అండగా నిలుస్తుందని అన్నారు. సెట్విన్ లో వివిధ కోర్సులలో శిక్షణ పొందిన వారు తయారు చేసిన వస్తువులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలనే గొప్ప ఆశయంతో శిల్పారామంలో స్టాల్ ప్రారంభించాలని నిర్ణయించామని అన్నారు. త్వరలోనే ఉప్పల్ లో ని శిల్పారామంలో కూడా సెట్విన్ స్టాల్ ను ప్రారంభించబోతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెట్విన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బెల్టు షాపులను మూసివేయాలని సంతకాల సేకరణ

- అబ్కారీ శాఖకు వినతి పత్రాన్ని అందజేసిన శ్రీవాణి నగర్ కాలనీవాసులు



**విశ్వంభర, పఠాన్ చెరు:** సంగారెడ్డి జిల్లా పఠాన్ చెరు నియోజకవర్గం అమీన్ పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీవాణి నగర్ లో దాదాపు పదికి పైగ బెల్టు షాపులనూ నడుపుతున్నారని పలు మార్లు కాలనీ వాసులు అబ్కారీ శాఖ కూ విన్నపించుకున్న మళ్ళీ పాత పద్ధతిలోనే బెల్టు షాపులలో ఉదయం మూడు, నాలుగు గంటల నుండే మద్యం విక్రయిస్తున్నారని కాలనీ వాసులు వాపోతున్నారు. బెల్ట్ షాపులు నడపడం వలన కాలనీ లోని మహిళలు, కాలనీ వాసులు ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బెల్ట్ షాపులను మూసి వెయ్యాలని మహేష్ గౌడ్ కాలనీ వాసుల నుండి 200 మందికి పైగా బెల్టు షాప్ లకు వ్యతిరేకంగా సంతకాలు సేకరించి పటాన్ చేరు ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో, పటాన్ చేరు డిఎస్పీ కార్యాలయంలో మహేష్ గౌడ్ తో పాటు కాలనీ వాసులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకారం



**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండలం రాంపూర్ గ్రామ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం నూతన దర్మకర్తల ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కల్వకుర్తి శాసనసభ్యులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని ఛైర్మన్ గా నియమితులైన పవన్ కుమార్ రెడ్డికి, డైరెక్టర్ లకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన కమిటీ దేవాలయ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి ఠాగూర్ బాలాజీ సింగ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నరసింహ, తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకూరి ప్రభాకర్ రెడ్డి, టీపీసీసీ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ రఘు రాములు, శతాబ్ది టౌన్షిప్ కాసు శ్రీనివాస్ రెడ్డి, గ్రామం మాజీ సర్పంచ్ శ్యాంసుందర్ రెడ్డి, వెంకటయ్య, శ్రీనివాస చారి, కృష్ణారెడ్డి, కృష్ణ, నర్సింలు గౌడ్, దేవాలయ ఏఈ స్నేహలత, ఎండోమెంట్ అధికారులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## తాపీ మేస్త్రి సంఘం నూతన కార్యవర్గానికి సన్మానం



**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల్ గ్రామపంచాయతీ పరిధిలో శనివారం బాలాజీ తాపీ మేస్త్రి నూతన కార్యవర్గాన్ని సంఘం సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు కాలే శ్రీరాములు, ఉపాధ్యక్షుడు సిద్దిగారి మహేష్, సంఘం సీనియర్ సభ్యులు బాల్ రాజ్, పోతగళ్ల కృష్ణలను స్థానిక మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా సంఘం సభ్యులు, తాపీ మేస్త్రి సంఘం యొక్క పలు సమస్యలను మాజీ సర్పంచ్ దృష్టికి తీసుకురాగా మాజీ సర్పంచ్ మాట్లాడుతూ తాపీ మేస్త్రి సంఘానికి తమ సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని హామీ ఇచ్చారు. నూతన కార్యవర్గం కలిసికట్టుగా పనిచేస్తూ సంఘం అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైసస కోఆర్డినేటర్ మంగళపల్లి నరసింహ, మాజీ వార్డు సభ్యులు గురిగళ్ళ జంగమ్మ రామచంద్రయ్య, తాపీ మేస్త్రి సభ్యులు మంకీ జంగయ్య, రాములు, పారెష్, వీరేష్, నరసింహ, శేఖర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి స్మగ్లర్లతో పోలీసుల దోస్తీ

### ఇద్దరు ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ సస్పెండ్

**విశ్వంభర, సంగారెడ్డి:** గంజాయి స్మగ్లర్ల తో సంబంధాలు కొనసాగుతున్న ఇద్దరు ఎస్ఐలు, ఒక హెడ్ కానిస్టేబుల్, ఒక కానిస్టేబుల్ ను మల్టీ జోన్ 2, ఐజీ వి సత్యనారాయణ సస్పెండ్ చేశారు. పఠాన్ చెరు పోలీస్ స్టేషన్ లో ఎస్ఐ గా విధులు నిర్వహిస్తున్న మూడ్ అంబారియా నాయక్ తో పాటు వీఆర్ లో ఉన్న ఎస్.ఐ వినయ్ కుమార్, సీసీఎస్ లో హెడ్ కానిస్టేబుల్ మారుతీ నాయక్, ఏఆర్ కానిస్టేబుల్ మధు మీద వేటు పడింది. ఈ యేడాది మే లో మనూర్ మండలం సనత్పూర్ లో ఓ వాహనాన్ని అడ్డుకొని 120 కిలోల గంజాయిని తమ వాహనంలోకి తీసుకొని అ వాహనంతో సహా నేరస్థులను వదిలేశారు. గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముఠాను నిజామాబాద్ వర్ని దగ్గర అడ్డుకొని అక్కడి నుంచి వారిని నారాయఖేడ్ తీసుకొని వచ్చి 400 ప్యాకెట్ల గంజాయి ని తీసుకొని వాహనంతోసహా నేరస్థుడిని వదిలేశారు. గంజాయి అక్రమ రవాణా చేస్తున్న మల్లుగొండ, మల్లేష్ నాయక్, లకాస్ లను పట్టుకొని బీడీఎల్ భానూర్ పోలీసులు విచారించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసు శాఖ నార్కోటిక్ బ్యూరోలు ప్రతిష్టాత్మకంగా గంజాయి పై ఉక్కు పాదం మోపడం వల్ల సత్ఫలితాలు వస్తున్న తరుణంలో ఒకరిద్దరూ చేసే ఇటువంటి అరాచకాల వల్ల పోలీస్ శాఖ ప్రతిష్టకు భంగం కలుగుతుందని ఐజీ సత్యనారాయణ తెలిపారు.

## కనబడుటలేదు



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం కక్కిరేణి గ్రామానికి చెందిన 21 సంవత్సరాల వయస్సు ఉన్న మహిళ 24 అక్టోబర్ 2024 నాడు మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి, ఎవరికీ చెప్పకుండా వెళ్ళిపోయిందని పోలీసులు తెలిపారు. ఆమె ఆచూకీ గురించి ఆమె స్నేహితుల వద్ద, బందువుల వద్ద వెతికినా గాని జాడ తెలియరాలేదని, ఫిర్యాదు అందగానే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు.

## ముత్యాలమ్మ విగ్రహం ధ్వంసం కేసులో నిందితుడికి రిమాండ్

**విశ్వంభర, హైదరాబాద్:** సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంలో విగ్రహాన్ని ధ్వంసం చేసిన కేసును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)కు బదిలీ చేశారు. ఆలయంలోకి ప్రవేశించి అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన మహారాష్ట్రలోని ఠాణె ప్రాంతానికి చెందిన వ్యక్తిని సిట్ అధికారులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి సిట్ మూడు కేసులు నమోదు చేసింది. నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరచగా.. 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో అతడిని చర్లపల్లి జైలుకు తరలించారు. నిందితుడు వ్యక్తిత్వ వికాస శిక్షణ నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చినట్లు విచారణలో తేలింది. సికింద్రాబాద్‌లోని మెట్రో పోలీస్ హోటల్‌లో బస చేసిన అతడు.. తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో అమ్మవారి ఆలయంలోకి ప్రవేశించి విగ్రహాన్ని ధ్వంసం చేసినట్లు తేలింది. స్థానికులు అతన్ని అడ్డుకొని దేహశుద్ధి చేయడంతో గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నట్లు సీసీఎస్ ఏసీపీ విజయ సారథి తెలిపారు. శుక్రవారం నిందితుడిని అరెస్టు చేశామని.. శనివారం కోర్టులో హాజరుపరిచామన్నారు. ప్రజలు ఎలాంటి వదంతులు నమ్మొద్దని ఈ సందర్భంగా పోలీసులు సూచించారు.

# గుర్రపు డెక్కను తొలగించడంలో నిర్లక్ష్యం తగదు

- ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి



**విశ్వంభర, మీర్ పేట్:** మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో మూడు చెరువులలో పేర్కొన్న గుర్రపు డెక్క ను తొలగించడంలో నిర్లక్ష్యం తగదు అని మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. శనివారం మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని చందన చెరువు, మంత్రాల చెరువు, పెద్ద చెరువులను మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో చెరువులను సందర్శించారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రా రెడ్డి మాట్లాడుతూ చెరువులో పెరిగిన గుర్రపు డెక్క ను తొలగించడంలో ఎందుకు నిర్లక్ష్యం చేశారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓపెన్ జిమ్ లో పరికరాల మరమ్మతులు వెంటనే చేయించాలని ఆదేశించారు. వందల మంది ప్రజలు వాకింగ్ చేయడానికి వస్తుంటారని వారికి కనీసం వసతులు కల్పించాల్సిన బాధ్యత మున్సిపాలిటీ అధికారులు వహించాలని సూచించారు. చెరువలలో హైసింతు పెరుగుతుందని, దుర్వాసన వెదజల్లుతుందని, చెరువు చుట్టుపక్కల కాలనీవాసులు దోమలు వివిధ రకాల క్రిమి కీటకాలతో నానా ఇబ్బందులు పడుతారన్నారని, మలేరియా డెంగ్యూ వంటి వివిధ వ్యాధులు దారి తీస్తున్నాయని తెలియజేస్తూ నీటి పరిశుభ్రత తొలగించే యంత్రాన్ని మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కు ప్రజల ఆరోగ్య దృక్పథం, ప్రజల సౌకర్యం కోసం అందించవలసిందిగా కోరుచు హెచ్ ఎండీఏ కు లేఖ రాశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్ రెడ్డి, పార్టీ అధ్యక్షులు అర్కల కామేష్ రెడ్డి, కమిషనర్ జ్ఞానేశ్వర్, డిఈ వెంకన్న, ఆర్వో చంద్రశేఖర్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు సునీత, నాయకులు బోయపల్లి శేఖర్ రెడ్డి, పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సిద్దాల భరత్, రమన్, జంగయ్య, సోషల్ మీడియా కన్వీనర్ వీరు రెడ్డి తదితరులు ఉన్నారు.

# సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై విస్తృత స్థాయి సమావేశం




**విశ్వంభర, హనుమకొండ:** వరంగల్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయం నందు ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు తెలంగాణ రాష్ట్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయకుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) పై విస్తృత స్థాయి సమావేశంలో హనుమకొండ జిల్లా పార్టీ అధ్యక్షుడు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి ఎర్రబెల్లి స్వర్ణ, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, ఎమెల్సీ శ్రీ బస్వరాజు సారయ్యతో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొని అవగాహన కల్పించారు. అనంతరం ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రాష్ట్రవ్యాప్తంగా కుల గణన సమావేశం చేపడుతున్నదన్నారు. బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరగాలని కులగణన చేపట్టిందని, కుల గణనలో అన్ని కులాల వారు పాల్గొని బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. దేశంలోనే కుల గణన చేపట్టిన మొదటి రాష్ట్రం గా తెలంగాణ రాష్ట్రం ఖ్యాతి గడించనుందని తెలిపారు. పేద బలహీన వర్గాల వారు అత్యున్న స్థాయికి వెళ్లడానికి కుల గణన కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. 70% ఉన్న బలహీన వర్గాల వారు సామాజికంగా ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి కుల గణన ఉపయోగపడుతుందని, అనంతరం బీసీ సంఘాల నాయకుల సలహాలు సూచనలు స్వీకరించి వారు అందజేసిన వినతులను ఏఐసీసీకి, టీపీసీసీ కి పంపిస్తామని, జిల్లా పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మహమ్మద్ రియాజ్, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ డివిజన్ స్థాయి నాయకులు, కార్యకర్తలు, ప్రొఫెసర్ వెంకట్ నారాయణ సుధాకర్, బీసీ కుల సంఘాల నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# గంగుల లక్ష్మీనర్సమ్మకు నివాళులు అర్పించిన ఎంపీ రవిచంద్ర



**విశ్వంభర, కరీంనగర్:** రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తన సోదరులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పలువురు ప్రముఖులతో కలిసి స్వర్గీయ గంగుల లక్ష్మీనర్సమ్మకు ఘనంగా నివాళులర్పించారు. ఎంపీ రవిచంద్ర సమీప బంధువు మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాతృమూర్తి లక్ష్మీనర్సమ్మ గత నెల 22 న స్వర్గస్తులు కాగా, ఆమె దశదిన కార్యక్రమం శనివారం కరీంనగర్ కేఎస్ఎల్ కన్వెన్షన్ హాలులో జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు, అన్నలు వదినలు కిషన్ శశిరేఖ, దేవేందర్ ఇందిర, తమ్ముడు వెంకటేశ్వర్లు ఉమా మహేశ్వరి, చెల్లెలు బావ శీలం సత్యనారాయణ లక్ష్మీ, సమీప బంధువులు సుంకర బాలకిషన్, ఇషంపల్లి వెంకటేశ్వర్లు లక్ష్మీనర్సమ్మ చిత్రపటానికి పూలుచల్లి శ్రద్ధాంజలి ఘటించారు. ఆమె కుమారులు సుధాకర్, వెంకన్న, కమలాకర్, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్యేలు భండారు లక్ష్మారెడ్డి, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, పాడి కౌశిక్ రెడ్డి, మాజీ మంత్రులు వీ.శ్రీనివాస్ గౌడ్, రాజేశం గౌడ్, ఆర్టీసీ మాజీ ఛైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, తెలంగాణ రాష్ట్ర కేంద్ర సహకార బ్యాంక్ మాజీ ఛైర్మన్ కొండూరి రవీందర్ రావు, కరీంనగర్ నగర మేయర్ యాదగిరి సునీల్ రావు, మాజీ ఎమ్మెల్యేలు పుట్టా మధుకర్, పెద్ది సుదర్శన్ రెడ్డి, సుంకె రవిశంకర్, వైద్యారోగ్య మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ మాజీ ఛైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, పర్యాటక సంస్థ మాజీ ఛైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్, బీసీ కమిషన్ మాజీ సభ్యులు కోతి కిశోర్ గౌడ్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, జెడ్పీ మాజీ ఛైర్ పర్సన్ తుల ఉమ తదితర ప్రముఖులు లక్ష్మీనర్సమ్మ చిత్రపటానికి పూలుచల్లి నివాళులర్పించారు. ఈ కార్యానికి వివిధ పార్టీలకు చెందిన నాయకులు, గంగుల బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, అభిమానులు పెద్దసంఖ్యలో హాజరై స్వర్గీయ లక్ష్మీనర్సమ్మ చిత్రపటానికి పూలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అదేవిధంగా ఎంపీ రవిచంద్ర సన్నిహితులు, అనుచరులు మరికల్ పోత సుధీర్ కుమార్, ఆకుల రజిత్, తేళ్ల మురళీధర్, భేతి శ్రీధర్, బీఆర్ఎస్ నాయకులు చల్లా హరిశంకర్, జెన్నాయికోడే జగన్మోహన్, అలగల నరేందర్, తుంగపాటి మధు, బొమ్మరాతి వేణు, జెన్నాయికోడే చంద్రశేఖర్, ప్రవీణ్ రెడ్డి, నోసా నవీన్ తదితరులు లక్ష్మీనర్సమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

## డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన



**విశ్వంభర, సూర్యాపేట:** ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాలతో ఆత్మకూర్ ఏఎస్ఐ శంకర్, దస్తగిరి, హెడ్ కానిస్టేబుల్ సోమయ్య, మండల కేంద్రంలో ఎస్‌బీఐ దగ్గర సైబర్ నేరాలు, గంజాయి, డ్రగ్స్ మత్తుమందులు, రోడ్డు ప్రమాదాలపై పోలీసు కళాభృందంతో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది. ఏఎస్ఐ దస్తగిరి మాట్లాడుతూ జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ అధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలపై, సైబర్ నేరాలపై, గంజాయి డ్రగ్స్ మత్తు మందులు, గుట్కాపై పటిష్టంగా పనిచేస్తున్నామని తెలిపారు. సైబర్ మోసగాళ్ళ వల్ల మోసాలకు గురి కావద్దు, బ్యాంక్ ఖాతా, ఏటీఎం కార్డ్ వివరాలు, ఓటీపీ వివరాలు ఇతరులకు తెలపవద్దు, ఇతరులు ఆశ చూపితే వాటికి ఆకర్షితులు కావొద్దు, మెసేజ్ లలో వచ్చే బ్లూ లింక్ అనుసరించి వ్యక్తిగత వివరాలు నమోదు చేయవద్దు అని కోరినారు. సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్ కు పిర్యాదు చేయాలని అన్నారు. అలాగే రోడ్డు నియమ నిబంధనలు తెలుసుకోవాలని అతివేగం ప్రయాణించవద్దు అని వేధింపులపై 100 కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు, ఏటీఎం పిన్ నెంబర్లు, సోషల్ మీడియాలో బహిర్గతం చేయొద్దన్నారు. వ్యక్తిగత ఫోటోలను డీపీ లుగా పెట్టుకోవద్దని చెప్పారు. మొబైల్ యాప్ లలో వచ్చేటువంటి అనవసరమైన బ్లూ లింకులను క్లిక్ చెయ్యొద్దు అని తెలిపారు. యువత చెడు వ్యసనాల బారిన పడొద్దు అన్నారు. గంజాయి మత్తుమందులకు సంబంధించిన సమాచారం ఎవరికైనా తెలిస్తే తప్పకుండా పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని తెలియజేశారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాన్ని నడపవద్దు ట్రాఫిక్ రూల్స్ ను అతిక్రమించొద్దు అని అన్నారు. అనంతరం పోలీసు కళబృందం వారు చక్కటి సాంస్కృతిక, పాటలతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో హెడ్ కానిస్టేబుల్ సోమయ్య, కళాబృందం ఇంచార్జ్ యల్లయ్య, గోపయ్య, క్రిష్ణ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## చిల్కానగర్ ఏఈ గా వినీత్



**విశ్వంభర, సికింద్రాబాద్ :** చిల్కానగర్ డివిజన్ ఏఈ గా నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన వినీత్ రావు చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ని మర్యాదపూర్వకంగా కార్పొరేటర్ కార్యాలయంలో కలిశారు. అనంతరం కార్పొరేటర్ ఏఈ వినీత్‌కి శాలువాతో సత్కరించి బాధ్యతగా పనిచేసుకోవాలని కోరారు. గతంలో పనిచేసిన ఏఈ రాజ్ కుమార్ జీహెచ్ఎంసీ పనులను సమయానుసారం పూర్తి చేసుకోవడం చాలా అభినందనమని వారి పని తీరుని కొత్తగా వచ్చిన ఏఈ వినీత్ కి తెలుపుతూ అలాగే పని చేసి మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు కాకుండా జగన్ మొద్దులకు వారు పాల్గొన్నారు.

## అంక్షరెడ్డిని కలిసిన యువజన కాంగ్రెస్ నాయకులు



**విశ్వంభర, సంగారెడ్డి:** సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం కంటెస్టెంట్ తూము కుంట అంక్ష రెడ్డి ని గుమ్మడిదల మండల కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు ముక్కల రామచందర్ గుప్తా, జిన్నారం మండల కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు జింక గణేష్ మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా గెలుపొందిన వెంటనే యువజన కార్యక్రమాలు, యువజన సమస్యలను తెలుసుకొని సమస్యల పరిష్కార దిశగా కార్యక్రమాలను కొనసాగించుటకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నానని ఆంక్ష రెడ్డి తెలియజేశారు. జిన్నారం, గుమ్మడిదల మండలాల యువజన నాయకులు ముక్క రామచంద్ర గుప్తా, జింక గణేష్ మాట్లాడుతూ సామాజిక కార్యక్రమాలతో పాటు యువజన కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకు పోవడం కోసం మా శక్తి వంచన లేకుండా పనిచేస్తూ గొప్ప విజయాన్ని సాధిస్తామని తెలిపారు.

## కుల గణన సన్నాహక సమావేశం



**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** మేడ్చల్– మల్కాజ్గిరి జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి లో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగి రెడ్డి హరివర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే విస్తృత స్థాయి సమావేశంలో భాగంగా కుల గణన సమావేశం నిర్వహించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కేవీఆర్ గార్డెన్స్ కొంపల్లి నందు నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి సింగి రెడ్డి హరివర్ధన్ రెడ్డి మాట్లాడారు. సమగ్రహ ఇంటింటి సర్వే కుటుంబ సర్వే లో ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త కుల గణన లో ప్రతి ఇంటికి వెళ్ళి సర్వే నిర్వహించే అధికారులకు తోడ్పడాలని కోరారు. ఇట్టి కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ శాసన మండలి చీఫ్ విప్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, జడ్పీటీసీ ఛైర్ పర్సన్ మల్కాజ్గిరి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పట్నం సునీత మహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, మైనంపల్లి హనుమంత రావు, కూన శ్రీశైలం గౌడ్, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జిలు కొలన్ హన్మంత్ రెడ్డి, జంగయ్య యాదవ్, పరమేశ్వర్ రెడ్డి, బండి రమేష్, డాక్టర్ జి.వి. వెన్నెల, డీసీసీ అధ్యక్షులు కే. యమ్ ప్రతాప్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యురాలు జోష్ణ శివారెడ్డి, రైతు కమిషన్ సభ్యురాలు భవాని, పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనలో అన్ని చర్యలు చేపడతాం : కార్పొరేటర్ బన్నాల



విశ్వంభర, సికింద్రబాద్ : చిల్కానగర్ డివిజన్‌లోని బాలాజీ ఎంక్లేవ్ కాలనీ అధ్యక్షుడు జగదీశ్వర్ రెడ్డి, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి కార్పొరేటర్ కార్యాలయంలో కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్‌కి పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. కాలనీలోని పలు రోడ్లలో చెత్త డంపింగ్ యార్డ్ గా మారుతుందని, పలు వీధుల్లో వాటర్ లాగింగ్ పాయింట్ గా రోడ్లు ఏర్పడ్డాయని, అదేవిధంగా కాలనీలో నాలుగు చోట్ల లేఅవుట్ లో ఓపెన్ స్పేసెస్ గా ఉన్న ప్రాంతాలను ఆర్టికల్చర్ డిపార్ట్మెంట్ వారిచే బెంచీలు వేయించి లాన్స్ గా ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. తరచుగా వాటర్ లీకేజ్ పాయింట్లను నూతన పైప్ లైన్ ల తో మార్చాల్సిందిగా.., ఓపెన్ స్పేస్ గా ఉన్న ఖాళీ స్థలంలో ఒక దానిలో సీనియర్ సిటిజనుల కొరకై భవనాన్ని నిర్మించాలని వినతిపత్రంలో కోరారు. కార్పొరేటర్ వెంటనే వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతూ, వీలైనంత త్వరలో పైన కోరిన అంశాలపై నూతన ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. కార్పొరేటర్ కాలనీ అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డితో కాలనీ నిధులతో గార్బేజ్ పాయింట్ వద్ద కెమెరాలకు కాలనీ ఫండ్ ద్వారా ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, బాలాజీ ఎంక్లేవ్ ప్రధాన కార్యదర్శి కవిన్ కెన్నెడీ, జాయింట్ సెక్రెటరీ శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం చెప్పుచేతల్లో పనిచేస్తున్న కమిషన్

### బీఆర్ఎస్ నేత డా. దాసోజు శ్రవణ్ ఆగ్రహం



**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రం లో 95 శాతం ఉన్న బీసీ ,ఎస్సీ ,ఎస్టీ ,మైనారిటీలను సీఎం రేవంత్ మోసం చేస్తున్నారని, కులగణన పై హై కోర్టు ఆదేశాలు అంద లేదని బీసీ కమిషన్ ఛైర్మన్ చెప్పడం దుర్మార్గమని సీఎం రేవంత్ చెప్పు చేతల్లో కమిషన్ పని చేస్తోందని బీఆర్ఎస్ నేత డాక్టర్ దాసోజు శ్రవణ్ విమర్శించారు. శనివారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. సుప్రీం కోర్టు తీర్పు కనుగుణంగా సీఎం రేవంత్ కుల గణన చేస్తే రేవంత్ కొమ్ములు ఊడతాయా ? అన్నారు. ఈ నెల ఐదున రాహుల్ గాంధీ కులగణన సందర్భంగా కాంగ్రెస్ పెట్టే సభ కు వస్తున్నారని తెలిసిందన్నారు. రాహుల్ గాంధీ ఓ చేతిలో రాజ్యాంగం పట్టుకుంటారని, కాని అదే రాజ్యాంగాన్ని రేవంత్ గౌరవించరని అన్నారు. అసెంబ్లీ తీర్మానంలో బీసీ కుల గణన అని స్పష్టంగా చెప్పారని, ప్రభుత్వం రకరకాల సందర్భంలో కులగణనే అని చెప్పిందని, సెన్సస్ చేసే భాధ్యత ఏ రాష్ట్ర ప్రభుత్వానికి లేదని, ఇది కేంద్ర ప్రభుత్వ పరిధి లోనిదని, ఏదైనా చేయాలంటే చట్టాన్ని సవరించాల్సిందేనని అన్నారు. కాస్ట్ సెన్సస్ అని జీవో ల్లో పేర్కొంటూ రేవంత్ ప్రభుత్వం బీసీల నోట్లో మట్టి కొట్టబోతోందన్నారు. ప్లానింగ్ డిపార్ట్ మెంటో ,బీసీ కమిషన్ ల వల్లో ఈ గణన చేస్తే న్యాయం దృష్టిలో చెల్లదన్నారు. ఆర్టికల్ 340 ప్రకారం ప్రత్యేక కమిషన్ నియమిస్తేనే ఈ గణన చెల్లుతుందని శ్రవణ్ చెప్పారు. సుప్రీం కోర్టు కూడా కులగణన మీద డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేయాలని చెప్పిందని, బీసీ యాక్ట్ లో ఎక్కడా రిజర్వేషన్ల గురించి బీసీ కమిషన్ కుల గణన చేయాలనీ లేదని అన్నారు. బీసీలను సెన్సస్ పేరుతో మోసం చేయాలని రేవంత్ కుట్ర పన్నారని, బీసీల చెవుల్లో పూలు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహించారు. 199 జీవో పై ఎవరు కోర్టు కు పోయినా కొట్టి వేస్తారని చెప్పారు. రాజ్యాంగం ప్రామాణికత పై, కోర్టు తీర్పులపై రేవంత్ ప్రభుత్వానికి గౌరవం లేదన్నారు. బీసీల కుల గణన కోసం ప్రత్యేక కమిషన్ వేస్తే తప్ప న్యాయం జరుగదన్నారు. డేడికేటెడ్ కమిషన్ వేయాలని గతంలో రామచంద్ర రావు నేతృత్వంలోని హై కోర్టు సింగిల్ డివిజన్ బెంచ్ తీర్పు ఇచ్చిందని, ఇప్పుడంటే హై కోర్టు కాపీ అందలేదంటున్నారని, గతంలో రామచందర్ రావు ఇచ్చిన తీర్పు కూడా ప్రభుత్వం చదవ లేదా ? అని ప్రశ్నించారు. సీఎస్ శాంతి కుమారి వివాదాస్పద 199 జీవో ఎనుకిచ్చారో తెలియడం లేదన్నారు. మూర?ంగా ముందుకుపోతూ రేవంత్ బీసీ ల నోళ్లు కొట్టాలని చూస్తున్నారన్నారు. రాహుల్ గాంధీని వాడుకుని రేవంత్ బీసీ ల గొంతు కోయాలని చూస్తున్నారని, సర్వే ఫారం పై సీఎం ,డిప్యూటీ సీఎం ల ఫోటోలు ఎందుకు ? అని ప్రశ్నించారు. స్వతంత్రంగా సర్వే చేస్తున్నపుడు ఫోటో లు ఎందుకు ? అన్నారు. కేవలం తూతూ మంత్రంగా బీసీ కులగణన ను పూర్తి చేయాలనీ రేవంత్ కుట్ర పన్నారని విమర్శించారు. సర్వే ల ప్రశ్నలు శాస్త్రీయంగా లేవన్నారు. ఇపుడున్న పద్ధతిలో రేవంత్ బీసీ కులగణన చేస్తే అది చెత్తబుట్ట కే పరిమితమవుతుందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ లోని బీసీ ఎమ్మెల్యేలు ఆలోచించి డేడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేయించాలని కోరారు. తమిళనాడు తరహాలో రిజర్వేషన్లు పెంచాలంటే సుప్రీం కోర్టు తీర్పు కనుగుణంగా కుల గణన కమిషన్ కు చట్టబద్దత కల్పించాలని, తక్షణమే అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేసి శాస్త్రీయంగా సర్వే నిర్వహించాలని అన్నారు. రాహుల్ గాంధీ ఈ విషయం లో జోక్యం చేసుకుని న్యాయం చేయాలని, బీసీల గొంతు కోయొద్దని శ్రవణ్ కోరారు.

# ఢిల్లీలో దారుణంగా వాయు నాణ్యత

## ఆస్తమా, కళ్ల మంటలతో ఇబ్బంది పడుతున్న నగర వాసులు



**ఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో గాలి నాణ్యత రోజురోజుకూ పడిపోతోంది. దీపావళి సందర్భంగా ప్రభుత్వం పటాకులపై నిషేధం విధించింది. అయినప్పటికీ ప్రజలు లెక్కచేయకుండా పెద్దమొత్తంలో బాంబులను కాల్చడంతో వాయుకాలుష్యం తీవ్ర స్థాయికి చేరుకుంది. దీంతో వాయు నాణ్యత దారుణంగా పడిపోతున్నది. ప్రస్తుతం ఢిల్లీ-ఎన్సీఆర్ ప్రాంతంలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 300కి పైనే నమోదవుతోంది. ఎయిర్ క్వాలిటీ అండ్ వెదర్ ఫోర్ కాస్టింగ్ అండ్ రిసెర్చ్ సంస్థ ప్రకారం.. ఇది చాలా అధ్వాన్నమైన స్థాయిలో ఉన్నట్లు. ఈ కారణంగా ఢిల్లీతోపాటు నేషనల్ క్యాపిటల్ రీజియన్‌లో ప్రజలు విష వాయువులను పీల్చుకుంటున్నారు. తద్వారా తీవ్రఅనారోగ్య సమస్యలను ఎదుర్కొం టున్నారు. దేశ రాజధానిలో దీపావళి రాత్రి అధిక స్థాయిలో వాయు కాలుష్యం నమోదైంది. పలు ప్రాంతాల్లో ఏక్యూఐ రీడింగ్‌లు గరిష్ఠ సాయి 999కి చేరాయి. దీని కారణంగా ఢిల్లీ - ఎన్సీఆర్ ప్రాంత ప్రజలు తీవ్ర ఆరోగ్య సమస్యలను నివేదించినట్లు ఓ సర్వే తాజాగా వెల్లడించింది. 69 శాతం కుటుంబాల్లో కనీసం ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మంది గొంతునొప్పి, దగ్గుతో సహా కాలుష్య సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నట్లు సదరు సర్వే నివేదించింది. డిజిటల్ ప్లాట్‌ఫారమ్ అయిన లోకల్ సర్కిల్స్ ఈ సర్వే నిర్వహించింది. ఢిల్లీ-ఎన్సీఆర్ ప్రాంతంలో 21 వేల కంటే ఎక్కువ మందిపై సర్వే చేసింది. పెరుగుతున్న వాయు కాలుష్యం కారణంగా 62 శాతం కుటుంబాల్లో ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మంది కళ్ల మంటలను ఎదుర్కొంటున్నట్లు తేలింది. 46 శాతం మంది ముక్కు కారటం వంటి సమస్యలు నివేదించారు. ఇక 31 శాతం మంది శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు లేదా ఆస్తమా ఉన్నట్లు తెలిపారు. మరో 31 శాతం మంది తలనొప్పిని ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. 23 శాతం మంది ఏకాగ్రతను కోల్పోతున్నట్లు ఆందోళన వ్యక్తం చేయగా.. 15 శాతం మంది నిద్రపోతున్న సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు నివేదించారు. అయితే, 31 శాతం మంది మాత్రం కాలుష్యం కారణంగా ఎలాంటి ఇబ్బందులనూ నివేదికంకపోవడం విశేషం. రాజధాని వాసులు చాలా మంది ఇప్పటికే దగ్గు, జలుబు, ఆస్తమా, బ్రోన్కైటిస్ క్రానిక్, క్రానిక్ అబ్స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజ్ వంటి శ్వాసకోశ రుగ్మతలతో బాధపడుతున్నట్లు సదరు నివేదిక వెల్లడించింది. రానున్నరోజుల్లో ఢిల్లీ దాని పరిసర ప్రాంతాల్లో ఏక్యూఐ స్థాయిలు మరింత దిగజారే అవకాశం ఉందని సదరు సర్వే ఆందోళన వ్యక్తం చేసింది.

ఇక ఇదే సర్వే.. రాజధానిలో క్షీణిస్తున్న గాలి నాణ్యతను ఎదుర్కొనేందుకు ఎలా సిద్ధమవుతున్నారని ఢిల్లీ వాసులను ప్రశ్నించింది. 10,630 మందిలో 15 శాతం మంది ఈ సీజన్‌లో నగరాన్ని వదిలి వెళ్లిపోవాలని యోచిస్తున్నట్లు తెలిపారు. మరో 9 శాతం మంది రోగనిరోధక శక్తి పెరిగే ఆహారాలు, పానీయాలు తీసుకుంటూ ఇంటి పట్టునే ఉండాలనుకుంటున్నట్లు సమాధానం ఇచ్చారు. మరో 23 శాతం మంది ఎయిర్ ప్యూరిఫైయర్‌లను ఉపయోగించాలని యోచిస్తున్నారు. కొందరు కాలుష్య సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు పలు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. మరికొందరు కాలుష్యాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు.

గాలి నాణ్యత సున్నా నుంచి 50 మధ్య ఉంటే బాగా ఉన్నట్టు అర్థం. 51 నుంచి 100 వరకు ఉంటే సంతృప్తికరమైనదని, 101 నుంచి 200 వరకు ఉంటే మితమైన నాణ్యత, 201 నుంచి 300 ఉంటే తక్కువ నాణ్యత అని, 301 నుంచి 400 వరకు ఉంటే చాలా పేలవమైనదని, 401 నుంచి 500 ఉంటే ప్రమాదకరస్థాయిగా పరిగణిస్తారు. అయితే, గత కొంతకాలంగా ఢిల్లీలో గాలి నాణ్యత ప్రమాదకరంగా మారుతోన్న విషయం తెలిసిందే. పొరుగు రాష్ట్రాల్లో పంట వ్యర్థాలను తగలపెట్టడానికి తోడు.. మంచు రాజధానిని కమ్మేయడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. కాలుష్య నియంత్రణకు పాలకులు ఎన్ని చర్యలు చేపట్టినా ఫలితం ఉండటం లేదు. రోజురోజుకూ గాలి నాణ్యత క్షీణిస్తోంది. ఈ కారణంగా నగర వాసులు తీవ్ర అనారోగ్య సమస్యలకు గురికావాల్సి వస్తోంది.

# ప్రజలను పాలించడం అంటే.. ఫేస్‌బుక్ లైవ్‌లో కనిపించడం కాదు: ఏక్‌నాథ్ శిందే



**ముంబయి:** మహారాష్ట్రలో ఎన్నికల వేళ రాజకీయాలు వేడెక్కాయి. అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఈక్రమంలో ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే, శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రేపై తీవ్ర విమర్శలు చేశారు. ఈమేరకు ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వ్యాఖ్యానించారు. 'నేను మహావికాస్ అఘాడి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండేవాణ్ణి. ఆ ప్రభుత్వం బాలాసాహెబ్ ఠాక్రే ఆశయాలకు విరుద్ధంగా పని చేస్తుంది. శివసేన, భాజపాలు సరైన మార్గంలోనే వెళుతున్నాయి. ఉద్ధవ్ ఠాక్రే ఆయన వ్యక్తిగత ప్రయోజనాల కోసమే కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్నారు. ఇది బాలాసాహెబ్ ఎప్పుడూ కోరుకోలేదు. శివసేన కార్యకర్తలుగా పార్టీ క్రమశిక్షణను అనుసరిస్తూ.. మార్పు అవసరమని గ్రహించాం. అందులోభాగంగానే భాజపాతో పొత్తు పెట్టుకున్నాం. సీఎంగా ప్రజలకు సేవ చేయడం అంటే ఆఫీసులో ఉండి, ఫేస్‌బుక్ లైవ్‌లో ప్రభుత్వాన్ని నడపడం కాదు. ప్రజల మధ్యలో ఉండి పాలన చేయాలి' అని ఉద్ధవ్‌ను ఉద్దేశించి విమర్శలు చేశారు.

### సిద్ధిఖీ హత్యలో నిందితులను కఠినంగా శిక్షిస్తాం

ఎన్సీపీ నేత బాబా సిద్ధిఖీ హత్యకు సంబంధించిన నిందితులను వదిలిపెట్టేది లేదని ఏక్‌నాథ్ శిందే పేర్కొన్నారు. 'శాంతి భద్రతలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఈ ఘటన చాలా దురదృష్టకరం. ఈ హత్యకు సంబంధించిన పలువురు నిందితులు ఇప్పటికే అరెస్ట్ అయ్యారు. ఇందులో భాగస్వాములైన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుంది' అని తెలిపారు. ఇక, మొత్తం 288 స్థానాలకు ఈనెల 20న మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. 23న ఓట్ల లెక్కింపు జరగనుంది.

# తులసేంద్రపురంలో కమలా హారిస్ ఫ్లెక్సీలు



వాషింగ్టన్: అమెరికాలో అధ్యక్ష ఎన్నికలకు సమయం దగ్గరపడుతోంది. ఈ ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థిగా డొనాల్డ్ ట్రంప్, డెమోక్రాటిక్ అభ్యర్థిగా కమలా హారిస్‌లు బరిలో ఉన్నారు. ఈక్రమంలో హారిస్ పూర్వీకుల గ్రామమైన తమిళనాడులోని తులసేంద్రపురంలో ఆమె ఫొటోలతో ఫ్లెక్సీలు వెలిశాయి. అంతేకాదుఆమె గెలవాలని స్థానికులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. కమలా హారిస్ తమిళ మూలాలున్న భారత సంతతి మహిళ. అమె తల్లి శ్యామలా గోపాలన్ భారతీయురాలు. శ్యామల తండ్రి గోపాలన్ తులసేంద్రపురంలో జన్మించారు. ఆయన భారత ప్రభుత్వ అధికారిగా వివిధ హోదాల్లో పని చేశారు. 19 ఏళ్ల వయసులో హారిస్ తల్లి శ్యామల ఉన్నత చదువుల కోసం కాలిఫోర్నియా వెళ్లి రొమ్ము క్యాన్సర్‌పై పరిశోధనలు చేశారు. జమైకాకు చెందిన డొనాల్డ్ హారిస్‌ను వివాహం చేసుకున్నారు. వీరి తొలి సంతానమే కమలా హారిస్. తన బాల్యంలో భారత్‌లోని అమ్మమ్మ, తాతయ్యలను కలిశానని ఇటీవల హారిస్ తన ఎక్స్ వేదికగా పంచుకున్నారు. ఇక, డెమోక్రాటిక్ అభ్యర్థిగా అధ్యక్ష బరిలో ఉన్న కమలాహారిస్ గెలుపొందాలని స్థానికులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. గ్రామంలో పలుచోట్ల ఆమెకు సంబంధించిన ఫ్లెక్సీలు వెలిశాయి. ఆమె పోటీ చారిత్రాత్మకమైనదని, అది తమకు ఎంతో గర్వంగా ఉందని ఈసందర్భంగా స్థానికులు వెల్లడించారు. మరోవైపు 2014లో హారిస్ బంధువులు ఆమె పేరు మీద ఆ ఊరిలోని 300 ఏళ్ల నాటి గుడికి విరాళం ఇచ్చారు. దీంతో హారిస్ పేరు గుడి శిలాఫలకాలపై ఉంది. హారిస్ గౌరవార్థం స్థానికంగా ఉన్న వాటర్ ట్యాంక్‌కు ఆమె పేరు పెట్టారట. త్వరలో ఆ గ్రామంలో నిర్మించే బస్టాప్‌కు సైతం ఆమె పేరే పెట్టాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈసందర్భంగా తమ ఊరి మూలాలున్న వ్యక్తి అధ్యక్ష ఎన్నికల్లో గెలవాలని స్థానికులు కోరుకుంటున్నారు. గతంలో కమలా హారిస్ ఉపాధ్యక్షురాలిగా పోటీ చేసిన సమయంలోనూ ఆమె గెలవాలని కోరుకుంటూ తులసేంద్రపురం గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేశారు.

# అన్మోల్ బిష్ణోయ్‌ని భారత్‌కు రప్పించేందుకు రంగం సిద్ధం



**ముంబయి:** లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ పేరు ఇటీవల కాలంలో దేశంలో మారుమోగిపోతోంది. ఈ సమయంలో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. లారెన్స్ సోదరుడు అన్మోల్ గురించి అమెరికా అలర్ట్ చేయడంతో అతడిని భారత్‌కు రప్పించే ప్రయత్నాలు మొదలయ్యాయి. ఈనేపథ్యంలో అతడిని భారత్‌కు తీసుకొచ్చే ప్రయత్నాలను ముంబయి పోలీసులు వేగవంతం చేశారు. కొన్ని నెలల క్రితం బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్ ఇంటి బయట కాల్పుల ఘటన సహా పలు కేసుల్లో అన్మోల్‌పై ఆరోపణలు ఉన్నాయి. అలాగే ఇటీవల ముంబయిలో సంచలనం సృష్టించిన బాబా సిద్ధిఖీ హత్య కేసు నిందితులతో టచ్‌లో ఉన్నట్లు పోలీసులు వెల్లడించిన సంగతి తెలిసిందే. దాంతో అతడిని భారత్‌కు రప్పించే ప్రక్రియను ప్రారంభించేందుకు అనుమతి కోరుతూ గత నెల ముంబయి పోలీసులు ప్రత్యేక న్యాయస్థానంలో పిటిషన్ వేశారు. లారెన్స్ తరఫున అన్మోల్ పలు చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో భాగమయ్యాడని ఆ సందర్భంగా పోలీసులు పేర్కొన్నారు. ఈనేపథ్యంలో అన్మోల్ కదలికల గురించి అమెరికా అధికారులు ఉప్పందించడంతో ముంబయి క్రైమ్ బ్రాంచ్ అతడిని భారత్‌కు రప్పించే ప్రయత్నాలను మొదలుపెట్టిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఇక, ఈ ఏడాది ఏప్రిల్ 14న సల్మాన్‌ఖాన్ ఇంటివద్ద కాల్పుల ఘటన చోటుచేసుకుంది. దానికి బాధ్యత వహిస్తూ అన్మోల్ సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టాడు. ఆ కేసు విచారణలో భాగంగా ముంబయి పోలీసులు అతడిపై లుకౌట్ నోటీసులు జారీ చేశారు. అలాగే 2022లో ప్రముఖ పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలా దారుణహత్యకు గురైన విషయం తెలిసిందే. ఆ కేసులోను అభియోగాలు ఎదుర్కొంటున్నాడు. అతడిపై సుమారు 18 కేసులున్నాయి. భాను పేరుతో చెలామణి అవుతున్న అన్మోల్.. నకిలీ పాస్‌పోర్టును ఉపయోగించి దేశం విడిచిపారిపోయాడు. ఈ కేసుల విచారణలో భాగంగా అన్మోల్ గురించి సమాచారం ఇచ్చినవారికి రూ.10 లక్షల రివార్డు ఇస్తామని ఇటీవల జాతీయ దర్యాప్తు సంస్థ ప్రకటించిన సంగతి తెలిసిందే.

# అనంత్‌నాగ్‌లో ఎన్‌కౌంటర్..

## ఇద్దరు ఉగ్రవాదులు హతం



**శ్రీనగర్:** జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాదుల ఏరివేత కొనసాగుతోంది. తాజాగా అనంత్ నాగ్ జిల్లాలో శనివారం ఉదయం ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. ఇద్దరు ఉగ్రవాదులను భద్రతాబలగాలు మట్టుబెట్టా యి. ఈ ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కి ఉన్నారన్న సమాచారంతో హల్కన్ గలి ప్రాంతంలో భద్రతా బలగాలు, స్థానిక పోలీసులు సంయుక్త ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో ఉగ్రవాదులకు భద్రతా బలగాల మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. కాగా, కశ్మీర్ లోయలో శుక్రవారం ఉత్తరప్రదేశ్‌కు చెందిన వలస కార్మికులపై ఉగ్రవాదులు కాల్పులకు తెగబడిన చేసిన విషయం తెలిసిందే. ఈ కాల్పుల ఘటనలో ఇద్దరు కార్మికులు చనిపోగా.. ఇద్దరు గాయప డ్డారు. గాయపడిన వారిని శ్రీనగర్‌లోని జేవీసీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనతో అప్రమత్తమైన భద్రతా బలగాలు కశ్మీర్ లోయలో ఉగ్రవాదుల కోసం తీవ్రంగా గాలింపు చేపడుతున్నారు.

### ఖాన్యార్ ప్రాంతంలో తుపాకుల మోత

మరోవైపు శనివారం ఉదయం నుంచి శ్రీనగర్‌లోని ఖాన్యార్ ప్రాంతంలో తుపాకుల మోత మోగుతోంది. ఇక్కడ ఉగ్రవాదులకు, భద్రతా బలగాలకు మధ్య ఎదురు కాల్పులు జరుగుతున్నట్లు కశ్మీర్‌జోన్ పోలీసులు తెలిపారు. శుక్రవారం యూపీ కి చెందిన ఇద్దరు వలస కార్మికులపై ఉగ్రవాదులు కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. దీంతో అప్రమత్తమైనభద్రతా బలగాలు, పోలీసులు సంయుక్తంగా ఆ ప్రాంతంలో కార్డన్‌సెర్చ్ ఆపరేషన్ ప్రారం భించాయి. ఈ క్రమంలో భద్రతాబలగాలపై ఉగ్రవాదు లు కాల్పులు జరిపారు. అప్రమత్తమైన భారత దళాలు.. వారిపై ఎదురు కాల్పులకుదిగారు. ప్రస్తుతం అక్కడ ఎదురుకాల్పులు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఇరు వైపులా ఎలాం టి ప్రాణ నష్టం జరగలేదు.

# ఎక్స్ ఉద్యోగులకు షాకిచ్చిన మస్క్.. ఇంజినీరింగ్ విభాగంలో లేఆఫ్స్



**ముంబయి:** ప్రపంచ వ్యాప్తంగా లేఆఫ్స్ పర్వం కొనసాగుతోంది. కరోనా మహమ్మారి వ్యాప్తి తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం సంకేతాల నేపథ్యంలో దాదాపు అన్ని సంస్థలు తమ ఉద్యోగుల్ని ఎడాపెడా పీకేసిన విషయం తెలిసిందే. చిన్నా, పెద్ద కంపెనీలన్న తేడా లేకుండా అన్ని సంస్థలూ ఉగ్యోలకు లేఆఫ్స్ ప్రకటించాయి. ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కారణంగా ఖర్చులు తగ్గించుకోవడంలో భాగంగా ఉద్యోగులకు ఉద్వాసన పలుకుతున్నాయి. విడతల వారీగా ఉద్యోగులను ఇంటికి పంపుతున్నాయి. తాజాగా బిలియనీర్ ఎలాన్ మస్క్ ఆధీనంలోని మైక్రోబ్లాగింగ్ సైట్ ఎక్స్ తన ఉద్యోగులకు షాక్ ఇచ్చింది నవంబర్ 5న జరగున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా బరిలోకి దిగిన మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ప్రమోట్ చేయడంలో బిజీగాఉన్న మస్క్.. తన ఎక్స్ ప్లాట్‌ఫామ్‌లో ఉద్యోగులకు ఉద్వాసన పలికినట్లు తెలిసింది. తాజా రౌండ్‌లో ఎక్స్‌లోని ఇంజినీరింగ్ విభాగం ఉద్యోగులను తొలగించినట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంది. అయితే ఎంతమంది ఉద్యోగులను తొలగిస్తున్నది ఇంకా స్పష్టత రాలేదని సదరు నివేదిక తెలిపింది. రెండు నెలల క్రితం కంపెనీకి సంబంధించిన విషయాలపై ఉద్యోగులకు ఓ పేజీ నివేదిక ఇవ్వాలని ఎక్స్ కోరింది. దాని ఆధారంగా ఉద్వాసన పలికినట్లు సదరు నివేదిక పేర్కొంది. ఉద్యోగులకు మెయిల్స్ ద్వారా లేఆఫ్స్ సమాచారం అందించినట్లు తెలిసింది. అయితే, ఈ తాజా లేఆఫ్స్‌పై ఎక్స్ బహిరంగంగా ఎలాంటి ప్రకటనా చేయలేదు.

# ఇంపోర్టెడ్ మాల్ వ్యాఖ్యలను సమర్థించిన సంజయ్ రౌత్



ముంబై: ఉద్ధవ్ ఠాక్రేకు చెందిన శివసేన పార్టీ ఎంపీ అరవింద్ సావంత్.. షిండే వర్గానికి చెందిన శివసేన నేత షైనా ఎన్‌సీపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆమె ఇంపోర్టెడ్ మాల్ అంటూ ఆయన విమర్శించారు. ఎంపీ అరవింద్ చేసిన వ్యాఖ్యలను శివసేన నేత సంజయ్ రౌత్ సమర్థించారు. తమ పార్టీ ఎంపీని ఆయన డిఫెండ్ చేసుకున్నారు. తమ నేత ఎవరినీ అవమానించలేదని, అరవింద్ సావంత్ తమ సీనియర్ ఎంపీ అని, ముంబాదేవి స్థానానికి చెందిన బీజేపీ నేత షైనా ఎన్సీ బయటి వ్యక్తి అని, ఆమె ముమ్మాటికీ ఇంపోర్టెడ్ మాల్ అని రౌత్ అన్నారు. ఎంపీ అరవింద్ చేసిన వ్యాఖ్యల్లో.. మహిళలను అవమానించినట్లు లేదని ఆయన అన్నారు. సోనియా గాంధీ, ప్రియాంకా గాంధీ గురించి మీరెటువంటి వ్యాఖ్యలు చేశారో గుర్తు లేదా అని రౌత్ విమర్శించారు. బయిటి వ్యక్తులు ఎన్నికల్లో పోటీ చేస్తే, వాళ్లు బయటి నుంచి వచ్చారనే చెబుతామన్నారు. దీంట్లో పెద్ద రాద్ధాంతం చేయాల్సిన అవసరం లేదన్నారు. ఎంపీ అరవింద్ సావంత్ చేసిన వ్యాఖ్యలను షైనా ఎన్సీ ఖండించారు. మాల్‌ను కాదు.. మహిళను అంటూ ఆమె పేర్కొన్నారు. సెక్షన్ 79, సెక్షన్ 356(2) కింద ముంబై పోలీసులు కేసు బుక్ చేశారు.

# వరుస బెదిరింపుల వేళ.. విమానంలో క్యాట్రిడ్జ్ గుర్తింపు



**ఢిల్లీ:** దేశంలో వరుస బాంబు బెదిరింపులు ఆందోళన కలిగిస్తున్నాయి. మొన్నటి వరకూ వందలాది విమానాలకు ఇలాంటి బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఓ విమానంలో మందుగుండు గుళిక దొరకడం కలకలం రేపుతోంది. గత నెలలో దుబాయ్ నుంచి దేశ రాజధాని ఢిల్లీకి వచ్చిన ఎయిర్ ఇండియా విమానంలో క్యాట్రిడ్జ్‌ను సిబ్బంది గుర్తించారు. ఈ విషయాన్ని ఎయిర్ ఇండియా సంస్థ శనివారం ఉదయం తెలిపింది. 'అక్టోబర్ 27న దుబాయ్ నుంచి దిల్లీకి వచ్చిన ఎయిర్ ఇండియా ఫ్లైట్ %ూ×%916 సీటు జేబులో క్యాట్రిడ్జ్ దొరికింది. అయితే, అప్పటికే ప్రయాణికులంతా సురక్షితంగా దిగారు. భద్రతా ప్రొటోకాల్‌ను పాటిస్తూ ఈ విషయంపై ఎయిర్‌పోర్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశాం' అని ఎయిర్ ఇండియా ప్రతినిధి తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించినట్లు వెల్లడించారు. గత కొన్ని రోజులుగా విమానాలకు వరుస బాంబు బెదిరింపులు వస్తున్నాయి. గడిచిన 20 రోజుల్లో మొత్తం 600కుపైగా దేశీయ, అంతర్జాతీయ విమానాలకు బెదిరింపులు రాగా.. అవన్నీ ఉత్తుత్తివేనని తేలింది. ఈ బెదిరింపులన్నీ సోషల్ మీడియా ద్వారానే ఎక్కువగా వచ్చినట్లు అధికార వర్గాలు తెలిపాయి. మరోవైపు ఇలాంటి బెదిరింపులపై కేంద్రం తీవ్రంగా స్పందించింది. ఇలాంటి ఘటనలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. నిందితులను నో ఫ్లై లిస్టులో చేర్చనున్నట్లు కేంద్ర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. వరుస బాంబు బెదిరింపుల కారణంగా విమానయాన సంస్థలకు రూ.కోట్ల మేర నష్టం వాటిల్లుతోంది.

# ఆటోమేటిక్ కార్గో ట్రాన్స్‌పోర్ట్.. జపాన్‌లో మరో విప్లవాత్మక ముందడుగు

**టోక్యో:** జనాభా సంక్షోభంతో కొట్టుమిట్టాడుతోన్న జపాన్ విప్లవాత్మక ముందడుగు వేసింది. డ్రైవర్ల కొరతను అధిగమించడంతో పాటు కర్బన ఉద్గారాలను తగ్గించడం కోసం ఆటోమేటిక్ కార్గో ట్రాన్స్‌పోర్ట్ వ్యవస్థను తెరపైకి తీసుకువచ్చింది. ఇందుకోసం కన్వేయర్ బెల్ట్ సాయంతో ఒసాకా, టోక్యో నగరాల మధ్య పార్శిళ్ల రవాణాకు ప్రత్యేక మార్గం వేస్తామని ప్రకటించింది. అలాగే ఆ ప్రాజెక్టు నమూనా వీడియోను కూడా విడుదల చేసింది. 2027 నాటికి ట్రయల్ రన్ నిర్వహించి, 2030 కల్లా ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించేలా ప్రభుత్వం ముందుకు కదులుతోంది. డ్రైవర్లు ఓవర్ టైం విధులను పరిమితం చేసేలా ఈ ఏడాది జపాన్ కొత్త చట్టాలను తీసుకువచ్చింది. దాంతో డ్రైవర్ల కొరత మరింత తీవ్రమైంది. మరోవైపు కొవిడ్ సమయంలో ఆన్‌లైన్ షాపింగ్ చేసే వారి సంఖ్య పెరిగింది. ఈ ట్రెండ్ డెలివరీ వ్యవస్థపై ఒత్తిడి పెంచుతోంది. వీటిని దృష్టిలోపెట్టుకొని ప్రభుత్వం ఈ కొత్త ప్రాజెక్టును తీసుకువచ్చింది. దానికి సంబంధించిన వీడియోలో.. ఒక పెద్ద హైవే మధ్యలో మూడు వరుసల కారిడార్‌పై చక్రాలతో ఉన్న బాక్సులు ప్రయాణించడం కనిపిస్తోంది. వాటంతట అవే దారి మార్చుకుంటున్నాయి. ఆ వ్యవస్థ అందుబాటులోకి వస్తే..రోడ్ నెట్‌వర్క్‌లోని ప్రత్యేకకారిడార్లలో24 గంటల పాటు ఆటోమేటెడ్, మానవరహితంగా సరకుల రవాణా జరుగుతుంది. ప్రపంచంలోమూడోఅతిపెద్ద ఆర్థికవ్యవస్థఅయిన జపాన్‌లో వరుసగా కొన్నేళ్లపాటు జనాభా క్షీణత నమోదవుతూనే ఉంది. జననాల కన్నా మరణాల సంఖ్య అధికంగా ఉంటోంది. ఒకవైపు వివాహంచేసుకొని సంతానాన్ని కనేవారికిఆర్థిక ప్రోత్సాహకాలు ప్రకటిస్తూనే..మరోవైపు మానవ వనరుల కొరతను అధిగమించేందుకు జపాన్ ప్రభుత్వం కొత్త ఆలోచనలు చేస్తోంది.



# సంక్రాంతిలోపు రోడ్లపై ఉన్న గుంతలన్నీ పూడ్చాలి : సీఎం చంద్రబాబు



**విశ్వంభర, అనకాపల్లి:** రోడ్లు అనేవి నాగరికతకు చిహ్నమని.. రహదారులు బాగుంటే పరిశ్రమలు వస్తాయని సీఎం చంద్రబాబు అన్నారు. అనకాపల్లి జిల్లాలో ఆయన పర్యటించారు. వెన్నెల పాలంలో రహదారిపై ఉన్న గుంతలు పూడ్చే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం వెంట మంత్రులు అనిత, కొల్లు రవీంద్ర తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడారు."రాష్ట్రంలోని రోడ్లు నరకానికి రహదారిగా మారాయి. రహదారులు ఈ దుస్థితికి రావడానికి గత పాలకులే కారణం. గత సీఎం రోడ్లపై ఈత కొలనులు ఏర్పాటు చేశారు. రహదారులు అభివృద్ధికి చిహ్నం. గుంతలు లేని రోడ్లకు వెన్నలపాలెంలో శంకుస్థాపన చేశాం. రహదారులు బాగుంటే వ్యాపారాలు బాగా జరుగుతాయి. సంక్రాంతిలోపు రోడ్లపై ఉన్నటువంటి గుంతలన్నీ పూడ్చాలి. రౌడీ రాజకీయాలు వద్దు.. అభివృద్ధి రాజకీయాలు కావాలి. 2014-19లో రహదారులు ఎలా ఉండేవో గుర్తుకు తెచ్చుకోవాలి. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 24 వేల కి.మీ సిమెంట్ రోడ్లు వేశాం. రహదారులపై గుంతలు లేకుండా చూసే బాధ్యత మాది. రాష్ట్రంలో మళ్లీ భూతం రాకుండా చూసే బాధ్యత ప్రజలది"

### గుంతలు పూడ్చేందుకు వారికి మనసు రాలేదు..

"గతసీఎం రాజధాని పేరిట మూడు ముక్కలాట ఆడారు. రోడ్లపై గుంతలు పూడ్చేందుకు జగన్‌కు మనసు రాలేదు. రూ.450 కోట్లు పెట్టి రుషికొండలో మాత్రం ప్యాలెస్ కట్టుకున్నారు. ఇలాంటి వారికి ఎలాంటి శిక్ష వేయాలో కూడా తెలియట్లేదు"

### దోచుకోవడం తప్ప జగన్‌కు అభివృద్ధి తెలియదు..

"విశాఖపట్నంలో రైల్వే జోన్ ఏర్పాటుకు వైసీపీ స్థలం ఇవ్వలేదు. దోచుకోవడం తప్ప అభివృద్ధి తెలియని జగన్ కేంద్ర ప్రభుత్వానికి సహకరించకుండా రాష్ట్ర అభివృద్ధిని గాలికొదిలేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విశాఖ రైల్వే జోన్‌కు స్థలం కేటాయించాం. నక్కపల్లి వద్ద స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తాం.ఇంటికొక ఐటీ ఉద్యోగి రావాలని గతంలో పిలుపు ఇచ్చాం. గ్రామాల్లో సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. దీపం పథకాన్ని గతంలో అవహేళన చేశారు. నేడు దీపం 2 కింద మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం. వ్యవసాయానికి, డ్వాక్రా మహిళలకు డ్రోన్లు అందించే కార్యక్రమాన్ని చేపట్టాం. 175 నియోజక వర్గాల్లో 175 పారిశ్రామిక హబ్‌లు ఏర్పాటు చేస్తాం. రతన్ టాటా స్ఫూర్తితో ఇంటికొక పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్నది కూటమి ప్రభుత్వ లక్ష్యం".."ఐదేళ్ల విధ్వంసంతో రాష్ట్రంలో అనేక సవాళ్లు ఎదురయ్యాయి. జరిగిన నష్టాన్ని ఐదు నెలల సమయంలో సరిదిద్దే చర్యలు చేపట్టాం. పోలవరం నీళ్లు విశాఖకు తరలిస్తాం. అనకాపల్లిని పేదరికం లేని జిల్లాగా మారుస్తాం" అని చంద్రబాబు అన్నారు.

### దొంగతనంగా ఇసుక వ్యాపారం చేస్తే ఊరుకునేది లేదు..

"రాష్ట్రంలో ఉచిత ఇసుకలో ఎక్కడా రాజీ లేదు. దొంగతనంగా ఇసుక వ్యాపారం చేస్తే ఊరుకునేది లేదు. మద్యంలో ఇష్టానుసారం ధరలు పెంచితే ఊరుకోను. బెల్ట్ షాపులు పెడితే బెల్ట్ తీస్తా. గతంలో చెత్త పన్ను అంటూ చెత్త పాలన చేశారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా గుంతలు లేని రోడ్లు ఉండాలి. డ్రోన్లు పంపించి గుంతల రోడ్లను పరిశీలిస్తాం"."సమాజంలో పరమ నీచులు ఉన్నారు. ఆడపిల్ల అంటే విలాస వస్తువు కాదు. పసిపిల్లలపై అత్యాచారాలు చేస్తున్నారంటే వారిని ఏమనాలి? ఎవరైనా ఆడపిల్లల జోలికొస్తే వారికి అదే చివరి రోజు" అని చంద్రబాబు హెచ్చరించారు.

# ముగిసిన నారా లోకేశ్ అమెరికా పర్యటన



**న్యూయార్క్:** అమెరికాలో ఏపీ మంత్రి నారా లోకేశ్ పెట్టుబడుల యాత్ర విజయవంతంగా ముగిసింది. వారం రోజుల పర్యటనలో 100కు పైగా దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో ఆయన వరుస భేటీలు నిర్వహించారు. పరిశ్రమల ప్రతినిధుల్లో రాష్ట్రంలో పెట్టుబడులపై నమ్మకం కలిగించారు. ఏపీలో పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అనుకూలతలతో పాటు సీఎం చంద్రబాబు విజన్‌ను ఆయన ఆవిష్కరించారు. ఐదేళ్ల విధ్వంసక పాలనలో దెబ్బతిన్న బ్రాండ్ ఏపీని పునరుద్ధరించడమే లక్ష్యంగా లోకేశ్ పర్యటన సాగింది. ఆయన ప్రతిపాదనలపై పలు దిగ్గజ కంపెనీలు సానుకూల సంకేతాలు ఇచ్చాయి. ఈ భేటీల ఫలితంగా జనవరిలో దావోస్‌లో జరిగే పెట్టుబడుల సదస్సులో పెద్దఎత్తున ఒప్పందాలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు కల్పించే పరిశ్రమలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తామని లోకేశ్ తెలిపారు. చివరి రోజున న్యూయార్క్‌లోని విట్ బై హోటల్‌లో పారిశ్రామివేత్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. బ్యాంక్ ఆఫ్ అమెరికా వైస్ ఛైర్మన్ పూర్ణ ఆర్ సగ్గుర్తిని కలవడానికి ట్రాఫిక్ రద్దీలో కాలినడకన వెళ్లారు. బ్లూప్రింట్‌తో వచ్చే పరిశ్రమలకు ఎటువంటి జాప్యం లేకుండా వెనువెంటనే అనుమతులు ఇచ్చేందుకు ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు చురుగ్గా పనిచేస్తోందని తెలిపారు. పెట్టుబడులకు అన్నివిధాలా అనుకూలమైన వాతావరణం నెలకొన్న ఏపీని ఒకసారి సందర్శించాల్సిందిగా అమెరికా పారిశ్రామికవేత్తలకు లోకేశ్ విజ్ఞప్తి చేశారు.

# వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసిన వాసిరెడ్డి పద్మ



విశ్వంభర, విజయవాడ: వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌పై ఏపీ మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అత్యాచార బాధితుల పేర్లను మాధవ్ వెల్లడిస్తున్నారని విజయవాడ సీపీ రాజశేఖర్‌బాబుకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అత్యాచార బాధితుల పేర్లు వెల్లడించడం దుర్మార్గమని, వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌పై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. రాజకీయపరమైన నిర్ణయాన్ని వారంలో ప్రకటిస్తానని ఆమె ఈ సందర్భంగా తెలిపారు. విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని తనకు ఆప్తులు అని చెప్పారు.వాసిరెడ్డి పద్మ ఇటీవల వైకాపా పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆ సందర్భంగా ఆమె వైకాపా అధ్యక్షుడు జగన్‌పై తీవ్ర విమర్శలు చేశారు.

# తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ



**విశ్వంభర, అమరావతి :** తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. నిత్యకళ్యాణుడు వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కంపార్టుమెంట్లు నిండిపోయాయి. అతిథి గెస్ట్‌హౌస్ వరకు భక్తులు క్యూ లైన్లో నిలబడ్డారు.టోకెన్లు లేని భక్తులకు 18-20గంటల్లో స్వామివారిదర్శనం అవుతుందని టీటీడీ అధికారులు తెలి పారు. స్వామివారిని 67,785 మం ది భ క్తులు దర్శించుకోగా 27,753 మంది తల నీలాలుసమర్పించుకున్నారు.భక్తులు సమ ర్పించుకున్న కానుకల ద్వారా హుండీ ఆదాయంరూ. 2.38 కోట్లు వచ్చిందన్నారు.

# విష వాయువులు పీల్చి అస్వస్థతకు గురైన కార్మికులు

**విశ్వంభర, నిజాంపట్నం :** బాపట్ల జిల్లా నిజాంపట్నం మండలం గోకర్ణమటంలో రొయ్యలు ఒలిచే కంపెనీలో కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. విషవాయువు విడుదల కావడంతో సుమారు 30 మంది అస్వస్థతకు గురైనట్లు తెలుస్తోంది. నిజాంపట్నం, పిట్టలవానిపాలెం ప్రభుత్వ ఆసుపత్రులకు బాధితులను తరలించారు.

# బాలుర వసతి గృహంలో వాచ్‌మన్ అరాచకం.. విద్యార్థులపై దాడి

**విశ్వంభర, పెద్దనందిపాడు:** గుంటూరు జిల్లాపెద్దనందిపాడు ఎస్సీబాలుర వసతి గృహంలో వాచ్‌మన్ విద్యార్థులపై దాడికి పాల్పడ్డాడు. గాయపడిన ఇద్దరు విద్యార్థులను ఆస్పత్రికి తరలించారు. ఓ బాలుడిని పైకెత్తి వాచ్‌మెన్ కిందపడేశాడు. దీంతో అతడు నడవలేకపోతున్నాడు. మరో బాలుడిని తలుపు మీదకు నెట్టడంతో తలకు గాయమైంది. గాయపడిన ఇద్దరు బాలురను అన్నదమ్ములుగా గుర్తించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# శ్రీశైలంలో కార్తికమాసోత్సవాలు షురూ..

## నెలరోజులపాటు గర్భాలయ దర్శనాలు బంద్






**విశ్వంభర, శ్రీశైలం:** అష్టాదశ శక్తిపీఠాల్లో ఒకటైన శ్రీశైల మల్లన్న ఆలయంలో కార్తీక మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. శనివారం నుంచి డిసెంబర్ 1 వరకు కార్తీక మాసోత్సవాలను నిర్వహించనున్నారు. ఆధ్యాత్మికంగా దివ్యమైనదిగా భావించే ఈ మాసంలో మల్లికార్జున స్వామివారి దర్శనానికి లక్షలాదిమంది భక్తులు తరలివస్తారు.ఈనేపథ్యంలో నెల రోజుల పాటు గర్భాలయ దర్శనాలను అధికారులు నిలిపివేశారు. అదేవిధంగా శని, ఆది, సోమవారాల్లో మలన్న స్పర్శదర్శనాన్ని కూడా బంద్ చేశారు. మంగళవారం నుంచి శుక్రవారం వరకు సామూహిక అభిషేకాలు, స్పర్శ దర్శనాలు యధావిధిగా కొనసాగుతాయి. కార్తికమాసంలో దీపాలు వెలిగించడాన్ని భక్తులు శుభప్రదంగా భావిస్తారు. ఈ నేపథ్యంలో ఆలయ ఉత్తర మాఢ వీధుల్లో మట్టి దీపాలు వెలిగించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. కార్తీకమాస పర్వదినాలు, సెలవు రోజులలో భక్తుల సంఖ్య అధికంగా ఉండే అవకాశం ఉంది. కావున భక్తులందరికీ సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు వీలుగా కార్తీక మాసమంతా కూడా గర్భాలయ ఆర్జిత అభిషేకాలను పూర్తిగా నిలిపివేశారు. అలాగే కార్తీకమాస రద్దీ రోజులలో అనగా శని, ఆది, సోమ వారాలు శుద్ధ ఏకాదశి, కార్తీక పూర్ణిమ మొదలైన రోజులు ( కార్తీకమాసంలో మొత్తం 16 రోజులు) స్వామివారి స్పర్శదర్శనం పూర్తిగా నిలిపివేశారు. ఈ రద్దీ రోజుల్లో సామూహిక ఆర్జిత అభిషేకాలను కూడా నిలిపివేశారు. కార్తీకమాసంలో ఉచిత స్పర్శదర్శనం తాత్కాలికంగా రద్దు చేశారు.సాధారణ రోజుల్లో రోజుకు మూడు విడతలుగా స్పర్శదర్శనం, మూడు విడతలుగా సామూహిక ఆర్జిత అభిషేకాలకు అవకాశం కల్పించబడుతుంది. కాగా భక్తులు స్పర్శదర్శనం టికెట్లను, ఆర్జిత అభిషేకాల టికెట్లను ఆన్‌లైన్‌లో మాత్రమే పొందవలసి ఉంటుంది.

ఇప్పటికే నవంబర్ నెల టికెట్ల కోటాను దేవస్థానం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచడం జరిగింది. టికెట్ల లభ్యతను బట్టి ప్రారంభ సమయానికి కంటే ఒక గంట ముందు వరకు కూడా భక్తులు ఆన్‌లైన్ ద్వారా టికెట్లను పొందే అవకాశం కల్పించ బడింది. టికెట్లను www.srisailadevasthanam.org వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చు లేదా ఆండ్రాయిడ్ మొబైల్‌లో srisaila devasthanamయాప్ డౌన్‌లోడ్ చేసుకుని కూడా టికెట్లు పొందవచ్చు.

# సీఎం చంద్రబాబు ఏపీని అభివృద్ధికి సూచికగా మారుస్తున్నారు: ఎమ్మెల్యే జీవీ



**విశ్వంభర, వినుకొండ:** వైసీపీ అధినేత జగన్ గత ఐదేళ్ల పాలనలో ఏపీని విధ్వంసానికి, దోపిడీకి మారుపేరుగా మారిస్తే.. నేడు సీఎం చంద్రబాబు రాష్ట్రాన్నిఅభివృద్ధికి సూచికగా మారుస్తున్నారని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. ఏపీ ప్రభుత్వం రోడ్ల మరమ్మతులపై ప్రత్యేక దృష్టి సారించటంతో గ్రామీణ ప్రాంతాల్లో రహదారులకు మహర్దశ పట్టనుందన్నారు. శనివారం కొండ్రముట్ల-దుర్గి రోడ్డు మరమ్మతు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అప్పుల్లో ఉన్నా సీఎం చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రూ.4వేల చొప్పున పెన్షన్ ప్రతి నెలా 1వ తేదీన పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పన ద్వారా జీవన ప్రమాణాలు పెంపొందించేలా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. గత పాలనలో రహదారుల నిర్వహణను జగన్ పట్టించుకోలేదని, 'కనీసం ఒక కొత్త రోడ్డు అయినా వేశారా? ఒక్క రోడ్డుకు గుంతలు పూడ్చారా..' అని జీవీ ప్రశ్నించారు. రాష్ట్రంలో రోడ్ల మరమ్మతులకు సీఎం చంద్రబాబు రూ.826 కోట్లు నిధులు మంజూరు చేశారని తెలిపారు. 2014-2019లో చంద్రబాబు పాలనలో రూ.12 వేల కోట్లతో రోడ్ల నిర్మాణాలు జరిగితే.. వైసీపీ హయాంలో గుత్తేదారులకు జగన్ బిల్లులు కూడా చెల్లించలేదని ఏద్దేవా చేశారు. అప్పులున్నా ఏపీలో అభివృద్ధి పనులు ఆగడంలేదన్నారు. గత ప్రభుత్వంలోరోడ్డు ప్రమాదాల్లో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వాగులు, కుంటలు, స్మశాన స్థలాల్లో జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి, కనీసం ఒక్క కాలనీ కూడా పూర్తి చేయలేదన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రూ.4,500 కోట్ల నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలకు కృషి చేస్తున్నారని చెప్పారు.

# మూడేళ్ల బాలికపై హత్యాచార ఘటన.. నిందితులపై కఠిన చర్యలు: సీఎం చంద్రబాబు




**విశ్వంభర, అమరావతి:** తిరుపతి జిల్లా వడమాలపేటలో మూడేళ్ల బాలికపై హత్యాచార ఘటనపై సీఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.బాలిక కుటుంబానికి ప్రభుత్వం అండగాఉంటుందన్నారు. చిన్నారి కుటుంబానికి రూ.10 లక్షలు అందజేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఆదివారం మధ్యాహ్నం బాధిత కుటుంబానికి హోంమంత్రి అనిత ఇందుకు సంబంధించిన చెక్కును అందజేయనున్నారు.

### ఘటనపై హోంమంత్రి అనిత దిగ్భ్రాంతి

తిరుపతి జిల్లా వడమాలపేట మండలంలో మూడేళ్ల బాలికపై హత్యాచారం ఘటనపై హోంమంత్రి అనిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అభం శుభం తెలియని చిన్నారికి చాక్లెట్లు ఆశ చూపి దారుణానికి పాల్పడటం హేయమన్నారు. నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. మృతి చెందిన బాలిక కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఈ ఘటనపై సత్వరమే విచారణ జరిపి నిందితుడికి శిక్ష పడేలా చేస్తామని అనిత తెలిపారు.

# కర్నూలు జిల్లాలో రోడ్డు ప్రమాదం.. ముగ్గురి మృతి



**విశ్వంభర, ఎమ్మిగనూరు:** కర్నూలు జిల్లాలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. నందవరం మండలం ధర్మాపురం వద్ద ఓ కారు ఆటోను ఢీకొంది. దీంతో ఆటోలోని ముగ్గురు మహిళలు అక్కడికక్కడే మృతి చెందగా.. ఓ బాలికకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.మృతులను వీర నాగమ్మ(60), గౌరమ్మ(61) బేబీ(32)లుగా గుర్తించారు. తీవ్రంగా గాయపడిన బాలిక రజియాను ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారు మితిమీరిన వేగమే కారణంగా తెలుస్తోంది. ప్రమాద ధాటికి కారు, ఆటో ఎగిరిపడి రహదారి పక్కన పడ్డాయి.

# రొయ్యల ప్రాసెసింగ్ కంపెనీలో విషవాయువు లీక్.. 30 మంది కార్మికులకు అస్వస్థత

**విశ్వంభర,అమరావతి :**
బాపట్ల జిల్లా నిజాంపట్నం మండలం గోకర్ణమఠంలో రాయల్ మెరైన్ రొయ్యల ప్రాసెసింగ్ కంపెనీలో విషవాయువు లీకై 30 మంది కార్మికులు తీవ్ర అస్వస్థతకు గుర య్యారు. శనివారం ఉదయం కంపెనీలోని పైపులైన్ నుంచి లీకేజీ ఏర్పడి విషవాయువు వెలువడింది. దీంతో అక్కడే పనిచేస్తున్న సుమారు 30మంది కార్మికులు తీవ్రఅస్వస్థతలోన య్యారు. కార్మికులకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, కళ్లు మండడం , కళ్లు ఎర్రగా కావడంతో వారిని నిజాంపట్నం , పిట్టవానిపాలెం ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం అందించేందుకు బాపట్ల, గుంటూరు ఆస్పత్రికి తరలిస్తున్నారు.ఒక ప్రాంతంలో మాత్రమే విషవాయువు లీకైందని అగ్నిమాపక సిబ్బంది ప్రాథమిక అంచనాకు వచ్చారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు. విషవాయువు లీకేజీలో యాజమాన్యం నిర్లక్ష్యంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. విషయం తెలుసుకున్న మంత్రి సత్యగాని ప్రసాద్ మాట్లాడుతూ బాధితులకు వెంటనే మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.



### టీమిండియా అభిమానుల కోసం

# ఛాంపియన్స్ ట్రోఫీపై పాక్ కీలక నిర్ణయం



**విశ్వంభర, క్రిడావిభాగం :** వచ్చే ఏడాది పాకిస్థాన్ వేదికగా ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీకి జరగనుంది. ఈ మెగా టోర్నీ కోసం పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తీవ్రంగా సన్నాహాలు చేస్తోంది. అయితే, ఛాంపియన్స్ ట్రోఫీ కోసం భారత క్రికెట్ జట్టు పాకిస్థాన్ వెళ్లే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయి. భారత్ పాక్ మధ్య సంబంధాలు అంతగా లేకపోవడమే ఇందుకు కారణం. అయితే ఈ ఛాంపియన్స్ ట్రోఫీకి టీమ్ ఇండియా తమ దేశానికి వస్తుందని పీసీబీ ఆశాభావం వ్యక్తం చేసింది. అలాగే భారత అభిమానుల కోసం పీసీబీ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అదేంటంటే?

**త్వరితగతిన వీసాలు!**

వచ్చే ఏడాది జరిగే ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌లను చూసేందుకు తమ దేశానికి రావాలనుకునే భారత అభిమానులకు త్వరితగతిన వీసాలు మంజూరు చేస్తామని పాకిస్థాన్ క్రికెట్ బోర్డ్ ఛైర్మన్, మంత్రి మొహ్సిన్ నఖ్వీ హామీ ఇచ్చారని ఓ వార్తా పత్రిక తన కథనంలో పేర్కొంది. అలాగే ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌లను చూసేందుకు భారత క్రికెట్ ప్రేమికులు పెద్ద సంఖ్యలో పాకిస్థాన్‌కు వస్తారని పీసీబీ ఆశాభావంతో ఉందని నఖ్వీ చెప్పారని తెలుస్తోంది. లాహోర్‌లో ఈ రెండు దేశాల మధ్య జరిగే మ్యాచ్ ను భారత అభిమానులు పాకిస్థాన్ కు వచ్చి వీక్షించాలని నఖ్వీ కోరారట.

"భారతీయ అభిమానుల కోసం ప్రత్యేక టికెట్ల కోటాను ఉంచుతాం. వీలైనంత త్వరగా వీసాలు జారీ చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటాం. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం టీమ్ఇండియా పాకిస్థాన్ వస్తుందని ఆశాజనకంగా ఉన్నాం. భారత జట్టు పాక్‌కు రావాలి. వారు ఇక్కడికి రారని నేను అనుకోవట్లేదు. పాకిస్థాన్‌లో జరిగే ఛాంపియన్స్ ట్రోఫీలో అన్ని జట్లకు మేము ఆతిథ్యం ఇస్తాం." అని పీసీబీ ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ ఓ వార్తా పత్రికకు తెలిపారు.

2008లో ముంబయి ఉగ్రదాడి జరిగినప్పటి నుంచి పాకిస్థాన్ లో భారత జట్టు పర్యటించడం లేదు. ఇరు జట్లూ ఐసీసీ టోర్నీల్లో మాత్రమే మ్యాచ్ లు ఆడుతున్నాయి. అదీనూ తటస్థ వేదికలపైనే. ఇప్పుడు ఛాంపియన్స్ లోనూ ఫిబ్రవరి 23న భారత్ పాక్ మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. ఇక ఫైనల్ కు లాహోర్ లోని గడాఫీ స్టేడియం ఆతిథ్యం ఇవ్వనుంది. ఒకవేళ భారత్ తుది పోరుకు చేరినా అక్కడే నిర్వహించాలనే ఉద్దేశంతోనే పాక్ బోర్డు ఉన్నట్లు తెలుస్తోంది. కానీ, టోర్నీలో భారత్ ఆడే ప్రతి మ్యాచ్ కూడా తటస్థ వేదికల్లోనే జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని క్రికెట్ పండితులు అంచనా వేస్తున్నారు. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం భారత జట్టు పాకిస్థాన్ కు వెళ్లే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. ఈ క్రమంలో హైబ్రిడ్ మోడల్ లో మ్యాచ్ లు నిర్వహించేందుకు అవకాశాలు ఉన్నట్లు సమాచారం. భారత్ ఆడే మ్యాచ్ లు పాక్ లో కాకుండా, తటస్థ వేదికల్లో నిర్వహించడమే హైబ్రిడ్ మోడల్. ఇప్పటికే గత ఆసియా కప్ ను హైబ్రిడ్ మోడల్ లోనే నిర్వహించారు.

### భారత్- న్యూజిలాండ్ మూడో టెస్టు.. రెండో రోజు ముగిసిన ఆట

# చెలరేగిన టీమిండియా స్పిన్నర్లు



**ముంబయి:** భారత్ న్యూజిలాండ్ మూడో టెస్టులో రెండో రోజు ఆట ముగిసింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి సెకండ్ ఇన్నింగ్స్‌లో కివీస్ 9 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. క్రీజులో అజాజ్ పటేల్ (7) ఉన్నాడు. దీంతో కివీస్ ప్రస్తుతం 143 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా 4, రవిచంద్రన్ అశ్విన్ 3, వాషింగ్టన్ సుందర్, ఆకాశ్ దీప్ చెరో 1 వికెట్ దక్కించుకున్నారు.

28 పరుగుల వెనుకంజతో కివీస్ రెండో ఇన్నింగ్స్ ప్రారంభమైంది. తొలి ఓవర్‌లోనే టామ్ లేథమ్ (1 పరుగు)ను ఆకాశ్ దీప్ క్లీన్‌బౌల్డ్ చేశాడు. ఆ తర్వాత పిచ్ నెమ్మదిగా స్పిన్నర్లకు సహకరించింది. దీంతో సీనియర్ ప్లేయర్ జడేజా, అశ్విన్ చెలరేగిపోయారు. వీళ్ల దెబ్బకు కివీస్ బ్యాటింగ్ కుదేలైంది. డేవన్ కాన్వే (22 పరుగులు), రచిన్ రవీంద్ర (4), డారిల్ మిచెల్ (21), టామ్ బ్లండెల్ (4), గ్లెన్ ఫిలిప్ (26) ఇష్ సోధి (8), మ్యాట్ హెన్రీ (10) స్వల్ప స్కోర్లకే పెవిలియన్ చేరారు.

అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో 86 4తో రెండో రోజు ఇన్నింగ్స్ కొనసాగించిన టీమ్ఇండియా 263 పరుగులకు ఆలౌటైంది. శుభ్ మన్ గిల్ (90 పరుగులు), రిషభ్ పంత్ (60 పరుగులు) హాఫ్ సెంచరీల తో రాణించారు. వాషింగ్టన్ సుందర్ (38* పరుగులు) ఆకట్టుకున్నాడు. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 28 పరుగుల స్వల్ప ఆధిక్యం సాధించింది. ఇక కివీస్ రెండో ఇన్నింగ్స్ దాదాపు ముగిసిట్లే! దీంతో మూడో రోజే మ్యాచ్ ముగిసే ఛాన్స్ ఉంది.






# నేటి నుండి పారాగ్లైడింగ్ ప్రపంచకప్ టోర్నీ

### 32 దేశాల నుండి ఆటగాళ్లు



**హిమాచల్ ప్రదేశ్ :** హిమాచల్ ప్రదేశ్‌లోని బీడ్ బిల్లింగ్ వ్యాలీలో శనివారం నుండి పారాగ్లైడింగ్ ప్రపంచకప్ టోర్నీని రెండోసారి నిర్వహించనున్నారు. పారాగ్లైడింగ్ ప్రపంచకప్ నవంబర్ 2 నుంచి 9 వరకు జరగనుంది. ఈరోజు ఉదయం 11 గంటలకు హిమాచల్ ప్రదేశ్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ ప్రెసిడెంట్ ఆర్ఎస్ బాలి టేకాఫ్ సైట్ బిల్లింగ్‌లో హవన్ యాగం తర్వాత ప్రారంభోత్సవం చేస్తారు. 32 దేశాల నుంచి దాదాపు 100 మంది ఆటగాళ్లు ఈ టోర్నీలో పాల్గొంటారు. పాల్గనేవారి తుది జాబితాను నేటి ఉదయం విడుదల చేస్తారు. దీని తరువాత, పాల్గొనేవారికి బిల్లింగ్ ఆకాశం నుండి గ్రీన్ సిగ్నల్ ఇస్తారు.

మొదటి రోజు ట్రయల్ టాస్క్‌లు మాత్రమే ఉంటాయి. బిల్లింగ్ పారాగ్లైడింగ్ అసోసియేషన్ (బీపీఏ) ప్రెసిడెంట్ అనురాగ్ శర్మ మాట్లాడుతూ.. 2015 తర్వాత రెండోసారి ప్రపంచకప్ బిల్లింగ్‌లో జరగబోతోంది. భారతదేశంలో పారాగ్లైడింగ్ ప్రపంచ కప్ బిల్లింగ్‌లో మాత్రమే నిర్వహించబడింది. ఇప్పటికే పారాగ్లైడింగ్ వరల్డ్ కప్ అధికారులు బీడ్ చేరుకున్నారు. పాల్గొనే వారందరికీ ప్రతిరోజూ ప్రయాణించడానికి ఒక టాస్క్ ఇవ్వబడుతుందని, దీని దూరం 50 నుండి 130 కిలోమీటర్ల వరకు ఉంటుందని తెలిపారు. పాల్గొనేవారి భద్రత కోసం రెస్క్యూ, సెక్యూరిటీ టీమ్‌లు ఉంటాయని.. అంతే కాకుండా అత్యవసర పరిస్థితుల్లో హెలికాప్టర్ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయని ఆయన అన్నారు. శనివారం సాయంత్రం ల్యాండింగ్ సైట్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు కూడా జరుగుతాయి.

ప్రపంచ కప్‌ను పారాగ్లైడింగ్ వరల్డ్ కప్ అసోసియేషన్ (PWCA) గుర్తించింది. అలాగే ఫెడరేషన్ ఏరోనాటిక్ ఇంటర్నేషనల్ (FAI) ద్వారా కేటగిరీ 2 ఈవెంట్‌గా రేట్ చేయబడింది. ఏరో క్లబ్ ఆఫ్ ఇండియా కూడా దీన్ని గుర్తించింది. అమెరికా, ఇంగ్లాండ్, చైనా, భారతదేశం, రష్యా, నెదర్లాండ్స్, కొరియా, మలేషియా, బ్రెజిల్, సింగపూర్, ఫ్రాన్స్, వియత్నాం, కజకిస్తాన్, పోలాండ్, ఇరాన్, హంగరీ, తైపీ, నేపాల్, ఇజ్రాయెల్ ఇంకా బంగ్లాదేశ్‌తో సహా ఇతర దేశాల నుండి పాల్గొనేవారు ప్రపంచ కప్‌లో పాల్గొంటారు. వీక్షకుల కోసం వైమానిక సాహస క్రీడలు, మారథాన్, సైక్లింగ్‌కు సంబంధించిన అనేక విన్యాసాలు కూడా నిర్వహించబడతాయి.

# 6 బంతుల్లో 6 సిక్స్‌లు 14 బంతుల్లోనే హాఫ్ సెంచరీ

**హాంకాంగ్ :** టీమిండియా మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్ప చెత్త రికార్డ్ నమోదు చేశాడు. 6 బంతుల్లో 6 సిక్స్‌లు సమర్పించుకొని అత్యధిక పరుగులిచ్చిన బౌలర్‌గా నిలిచాడు. 6 సిక్స్‌లతో పాటు ఓ వైడ్ కూడా వేయడంతో ఈ ఓవర్‌లో ఊతప్ప 37 పరుగులు ఇచ్చుకున్నాడు. హాంకాంగ్ సిక్సెస్ టోర్నీలో ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఊతప్ప ఈ చెత్త రికార్డ్‌ను మూటగట్టుకున్నాడు.

ప్రస్తుతం రవి బోపారా 6 సిక్స్‌లకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ రవి బొపారా ఊతప్ప బౌలింగ్‌లో వరుసగా 6 సిక్స్‌లు బాదాడు. ఈ మ్యాచ్‌లో 14 బంతులాడిన బొపరా 53 పరుగులు చేశాడు. దాంతో ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ 15 పరుగుల తేడాతో విజయం సాధించింది.

శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నిర్ణీత 6 ఓవర్లలో వికెట్ నష్టానికి 120 పరుగులు చేసింది. కెప్టెన్ రవి బోపారా(14 బంతుల్లో 8 సిక్స్‌లతో 53), సమిత్ పటేల్(18 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లతో 51) హాఫ్ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లు ఒక్క వికెట్ కూడా తీయలేకపోయారు.

అనంతరం టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లకు 105 పరుగులే చేసి ఓటమిపాలైంది. కేదార్ జాదవ్(15 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లతో 48 నాటౌట్) రాణించినా ఫలితం లేకపోయింది. ఇంగ్లండ్ బౌలర్లలో రవి బోపారా 2 వికెట్లు తీయగా.. జోర్డాన్ ఓ వికెట్ తీసాడు.

యూఏఈతో జరిగిన మరో మ్యాచ్‌లోనూ టీమిండియా ఒక్క పరుగు తేడాతో ఓటమిపాలైంది. ఆఖరి ఓవర్‌లో భారత్ విజయానికి 32 పరుగులు అవసరమవ్వగా.. స్టువర్ట్ బిన్నీ వరుసగా 4, వైడ్, 6, 6, 6, 6, 1 బాదాడు. ఆఖరి బంతికి క్విక్ డబుల్ తీసే ప్రయత్నంలో రనౌటయ్యాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన యూఏఈ నిర్ణీత 6 ఓవర్లలో 5 వికెట్లకు 130 పరుగులు చేసింది. ఖలిద్ షా(10 బంతుల్లో ఫోర్, 6 సిక్స్‌లతో 42), జహూర్ ఖాన్(11 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లతో 37 నాటౌట్) రాణించారు. భారత్ బౌలర్లలో స్టువర్ట్ బిన్నీ(3/31)నే మూడు వికెట్లు తీసాడు. భరత్ చిప్లి, షెహ్‌బాజ్ నదీమ్‌కు ఓ వికెట్ దక్కింది.

అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 6 ఓవర్లలో 4 వికెట్లకు 129 పరుగులే చేసింది. కెప్టెన్ రాబిన్ ఊతప్ప(10 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్స్‌లతో 43), స్టువర్ట్ బిన్నీ రాణించినా ఫలితం లేకపోయింది. యూఏఈ బౌలర్లలో అకిఫ్ రాజా, సంచిత్ శర్మ, ముహమ్మద్ జుహైబ్ తలో వికెట్ తీసారు.

ఏడేళ్ల తర్వాత మళ్లీ మొదలైన హాంకాంగ్ క్రికెట్ సిక్సెస్ టోర్నీలో మొత్తం 12 జట్లు పాల్గొంటున్నాయి. ఈ టోర్నీలో ప్రతి జట్టులో ఆరుగురు ప్లేయర్లే ఉంటారు. ఓ మ్యాచ్‌లో ప్రతి జట్టు ఆరు ఓవర్లు ఆడుతుంది.

# మొబైల్ యాప్‌ను లాంచ్ చేసిన ఎన్ఎస్ఈ



**తెలుగు సహా 11 భాషల్లో వెబ్‌సైట్**

నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ ఎస్ ఈ) మొబైల్ యాప్‌ను లాంచ్ చేసింది. దీంతో పాటు తన వెబ్‌సైట్ సేవల్ని మరింత మెరుగుపర్చింది. ఇప్పటివరకు కేవలం ఆంగ్లంలోనే అందుబాటులో ఉన్న వెబ్‌సైట్ సేవల్ని మరిన్ని భాషలకు విస్తరించింది. తెలుగు సహా 11 ప్రాంతీయ భాషల్లోకి అందుబాటులోకి తెచ్చింది. దీంతో మదుపరులు సులభంగా డేటాను యాక్సెస్ చేసే సదుపాయం లభించింది. ఎన్ఎస్ఈ మొబైల్ అప్లికేషన్‌ను ఆండ్రాయిడ్, ఐఫోన్ యూజర్లు యాక్సెస్ చేయొచ్చు. పెట్టుబడిదారులు సురక్షితమైన సమాచారాన్ని యాప్ ద్వారా సులభంగా తెలుసుకోవచ్చు. ఇందులోనే ఇండెక్స్ ఓవర్‌వ్యూలు, మార్కెట్ అప్‌డేట్లు, ట్రేడింగ్ వాల్యూమ్‌లు, నిఫ్టీ50 పర్‌ఫార్మెన్స్ ఇండికేటర్లు, స్టాక్ సెర్చ్ క్యాపబులిటీస్, కస్టమైజ్డ్ వాచ్‌లిస్ట్స్.. ఇలా అనేక విషయాలు తెలుసుకోవచ్చు. దీంతో పాటు ఆప్షన్ ట్రేడింగ్‌కు సంబంధించిన కాల్స్, పుట్స్.. లాంటి మొత్తం డేటా ఉంటుందని ఎన్ఎస్ఈ తెలిపింది. నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ వెబ్‌సైట్‌లో తెలుగుతో పాటు అస్సాం, బెంగాలీ, కన్నడ, మలయాళం, ఒడియా, పంజాబీ, తమిళం, హిందీ, మరాఠీ, గుజరాత్ భాషల్లో అందుబాటులోకి వచ్చింది. వివిధ ప్రాంతాల్లోని పెట్టుబడి దారులకు ఎలాంటి భాషాపరమైన సమస్యలు ఎదురవ్వకుండా ఉండేందుకు ఈ మార్పులు సహాయపడనున్నాయి.







విశ్వంభర V3 NEWS



# బాక్సాఫీస్ వద్ద కిరణ్ అబ్బవరం "క" మూవీ సెన్సేషన్

యంగ్ హీరో కిరణ్ అబ్బవరం లెటెస్ట్ మూవీ "క" బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ప్రేక్షకుల నుంచి "క" సినిమా హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చుకుంటోంది. రోజు రోజుకు కలెక్షన్స్ పెరుగుతున్నాయి. క సినిమా 2 రోజుల్లో 13.11 కోట్ల రూపాయల గ్రాస్ కలెక్షన్స్ సాధించింది. 3వ రోజు బుకింగ్స్ ఉధృతి కొనసాగుతోంది. ఈ ట్రెండ్ చూస్తుంటే "క" ఫస్ట్ వీక్ హ్యూజ్ కలెక్షన్స్ సాధించనున్నట్లు తెలుస్తోంది. ఓ సరికొత్త థ్రిల్లర్ మూవీని చూశామనే ప్రశంసలు "క" సినిమాకు దక్కుతున్నాయి. కిరణ్ అబ్బవరం పర్ ఫార్మెన్స్ హైలైట్ అవుతోంది. రాధగా తన్వీరామ్, సత్యభామగా నయన్ సారిక అప్రిషియేషన్స్ అందుకుంటున్నారు. ప్రేక్షకులను సర్ ప్రైజ్ చేసే ట్విస్టులతో దర్శకులు సుజీత్, సందీప్ ఈ సినిమాను రూపొందించి తొలి చిత్రంతోనే ఘన విజయాన్ని అందుకున్నారు. "క" సినిమాను చింతా వరలక్ష్మి సమర్పణలో శ్రీచక్రాస్ ఎంటర్ టైన్ మెంట్స్ తో బ్యానర్ పై చింతా గోపాలకృష్ణ రెడ్డి భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్ తో నిర్మించారు. తెలుగులో ప్రొడ్యూసర్ వంశీ నందిపాటి రిలీజ్ చేశారు.

# నా కెరీర్‌లో నమ్మలేని క్షణాలివి!

'కంగువా'తో మరికొద్ది రోజుల్లో అగ్రకథానాయకుడు సూర్యతో కలిసి తెరపై సందడి చేయడానికి సిద్ధమవుతోంది బాలీవుడ్ తార దిశా పటాని. ఈ ఫాంటసీ యాక్షన్ చిత్రంలో ఏంజెలీనా అనే పాత్రలో సందడి చేయనుందామె. ప్రచార కార్యక్రమంలో భాగంగా.. ఈ చిత్రంలో నటించడం గురించి తన ఉత్సాహాన్ని పంచుకుంది దిశ. "నా కెరీర్‌లో ఇప్పటికీ నమ్మశక్యం కానీ క్షణాలు ఇవి. ఎందుకంటే నేను ఈ చిత్రంలో అద్భుతమైన వ్యక్తులు, దర్శకుడు, నటులతో కలిసి పని చేశాను. తక్కువ సమయంలోనే మేమంతా ఒక కుటుంబంలా అయ్యాము. చిత్రబృందం సహకారంతోనే ఎన్ని సవాళ్లు ఎదురైనా చిత్రీకరణను పూర్తిచేయగలిగాను. తన సినిమాలో నటీనటులు సెట్‌స్‌కి వచ్చినప్పుడు సంతోషంగా పనిచేసుకోవాలని కోరుకుంటున్నాని దర్శకుడు శివ నాకు తొలి రోజే చెప్పిన మాటలు ఇవి. షూటింగ్ సమయంలో నన్ను ఎంతో జాగ్రత్తగా చూసుకున్నారు. సూర్యతో కలిసి పనిచేయడం నా జీవితంలో మర్చిపోలేని ఓ మంచి అనుభవం. ఆయన కంటే తన కళ్లు ఎక్కువగా మాట్లాడతాయి. ఆయన నుంచి ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చు. బాబీదేవోల్, జగపతి బాబు.. ఇలా చాలా మంది లెజెండ్‌స్‌తో కలిసి పనిచేయడం నా అదృష్టంగా భావిస్తున్నాన"ని చెప్పుకొచ్చింది. శివ దర్శకత్వం వహించిన ఈ చిత్రం నవంబరు 14న విడుదలకు సిద్ధంగా ఉంది.



# 200కి పైగా థియేటర్లలో 'ఉక్కు సత్యాగ్రహం'



దివంగత ప్రజా గాయకుడు గద్దర్ కీలక పాత్రలో నటించిన ఆఖరి చిత్రం ఉక్కు సత్యాగ్రహం. "విశాఖ ఉక్కు తెలుగు వారి హక్కు" అనే నినాదంతో తెరకెక్కిన ఈ సినిమా నవంబర్ 29 న ప్రేక్షకుల ముందుకు రానుంది. పి సత్యారెడ్డి దర్శక నిర్మాణంలో రానున్న ఈ సినిమా లో అతనే హీరోగా నటించగా, పల్సర్ బైక్ ఫేమ్, విశాఖ కండక్టర్ ఝాన్సీ కీలక పాత్ర చేశారు. కొన్ని సందేశాత్మక సన్నివేశాల్లో నటించడమే కాకుండా గద్దర్ ఈ చిత్రం లో మూడు పాటలు కూడా పాడారు. ఈ చిత్రానికి సంబంధించిన రిలీజ్ డేట్ ప్రకటించారు. ఉక్కు సత్యాగ్రహం విడుదల తేదీ ప్రకటించిన సందర్భంగా దర్శక నిర్మాత, హీరో పి సత్యా రెడ్డి మాట్లాడుతూ... ''విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, అక్కడ భూ నిర్వసితులకు న్యాయం జరగాలని మూడేళ్లు కష్టపడి తెరకెక్కించిన సినిమా 'ఉక్కు సత్యాగ్రహం'. స్టీల్ ప్లాంట్ యూనియన్ నాయకులు, ఉద్యోగులు, ఎంతో మంది మేధావులు, భూనిర్వాసితులు, కవులు కళాకారుల, రచయితలు నటించిన ఈ సినిమాని 200కు పైగా థియేటర్లలో విడుదల చేయనున్నాం'' అని చెప్పారు. తారాగణం: గద్దర్, సత్యా రెడ్డి, 'పల్సర్ బైక్' ఝాన్సీ, ఎమ్మెల్యే ధర్మశ్రీ, ఎంవీవీ సత్యనారాయణ, ప్రసన్నకుమార్, వెన్నెల తదితరులు.

# సురేష్ కొండేటికి మరో బాధ్యత



సినీ జర్నలిస్ట్, సంతోషం సంస్థల అధినేత, నిర్మాత సురేష్ కొండేటిని మరో పదవి వివరించింది. ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్లో గతంలో ఎఫ్.ఎన్.సి.సి. కల్చరల్ కమిటీ సభ్యుడిగా, ప్రచార కమిటీకి చైర్మన్ గా ఎఫ్.ఎన్.సి.సి. కల్చరల్ కమిటీ చైర్మన్ గా, తరువాత మేనేజ్మెంట్ కమిటీ మెంబర్ గా, కల్చరల్ కమిటీ వైస్ చైర్మన్ గా పనిచేసిన సురేష్ కొండేటి ఈసారి ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ లో కల్చరల్ కమిటీకి అడిషనల్ చైర్మన్ గా వ్యవహరించబోతున్నారు. దీనికి చైర్మన్ గా ఎ.గోపాలరావు, కన్వీనర్ గా ఏడిద రాజా నియమితులయ్యారు. ఈ మేరకు ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ ప్రెసిడెంట్ శ్రీ కె.ఎస్. రామారావు , సెక్రటరీ తుమ్మల రంగారావు చేతుల మీదుగా నియామక పత్రం సురేష్ కొండేటి అందుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను దీన్ని ఒక పదవిలా కాకుండా బాధ్యతలా చూస్తానని, కల్చరల్ కమిటీ అడిషనల్ చైర్మన్ గా తన వంతు కృషి చేస్తానని సురేష్ కొండేటి అన్నారు.

# లక్కీ భాస్కర్ చిత్రానికి ప్రేక్షకుల బ్రహ్మరథం

'మహానటి', 'సీతారామం ' వంటి విజయవంతమైన చిత్రాల తర్వాత మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్ తెలుగులో నటించిన హ్యాట్రిక్ చిత్రం 'లక్కీ భాస్కర్'. ప్రతిభగల దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మీనాక్షి చౌదరి కథానాయిక. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మించారు. జి.వి. ప్రకాష్‌కుమార్ సంగీత దర్శకుడు. దీపావళి కానుకగా అక్టోబర్ 31వ తేదీన ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదలైంది. ఈ సినిమా పట్ల ఎంతో నమ్మకంగా ఉన్న నిర్మాతలు, అక్టోబర్ 30వ తేదీ సాయంత్రం నుంచే ప్రీమియర్ షోలు ప్రదర్శించారు. నిర్మాతల నమ్మకం నిజమై మొదటి షో నుంచే ఈ సినిమాకి పాజిటివ్ టాక్ లభించింది. షో షోకి వసూళ్లు భారీగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో నిర్మాత సూర్యదేవర నాగవంశీ, దర్శకుడు వెంకీ అట్లూరి ప్రెస్ మీట్ నిర్వహించి తమ సంతోషాన్ని పంచుకున్నారు. సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ, "సోషల్ మీడియాలో ఎక్కడా సినిమా గురించి ఒక్క నెగటివ్ కామెంట్ కూడా కనిపించలేదు. అంతలా సినిమాకి పాజిటివ్ టాక్ వచ్చింది. అందుకే ప్రేక్షకులకు థాంక్స్ చెప్పడం కోసం మీడియా ముందుకి వచ్చాము. థాంక్స్ అనేది చాలా చిన్న మాట. సినిమా పట్ల మీరు చూపిస్తున్న ప్రేమకు మాటల్లో చెప్పలేనంత సంతోషం కలుగుతోంది. అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు." అన్నారు. దర్శకుడు వెంకీ అట్లూరి, "నాగవంశీ ఈ సినిమా మీద ఎంతో నమ్మకంగా ఉన్నారు. సినిమా విడుదలకు ముందే వంశీ చెప్పారు.. సినిమాకి ఎక్కడైనా నెగటివ్ కామెంట్ వస్తే అడగండని. అయితే ఈస్థాయి స్పందన లభిస్తుందని నేను కూడా ఊహించలేదు. ప్రీమియర్ షోల నుంచే సినిమాకి ఎంతో మంచి టాక్ వచ్చింది. నాకు చాలా చాలా ఆనందంగా ఉంది. దర్శకుడిగా ఇంత మంచి పేరు రావడమనేది చాలా అరుదైన విషయం. ఈ సినిమా పట్ల మీడియా మద్దతుకి, ప్రేక్షకుల ఆదరణకి చాలా చాలా థాంక్స్. పండగ అయినా కూడా మొదటిరోజు మంచి వసూళ్లు రావడం సంతోషంగా ఉంది. తెలుగు రాష్ట్రాలతో పాటు అన్ని చోట్లా మంచి స్పందన లభిస్తుంది. మలయాళం ప్రేక్షకులు దీనిని డబ్బింగ్ సినిమాలా చూడటంలేదు. సొంత సినిమాగానే భావిస్తున్నారు. ఖర్చు పెట్టిన ప్రతి రూపాయికి న్యాయం జరిగిందని సినిమా చూసిన ప్రేక్షకులు సంతృప్తి చెందుతున్నారు. నటీనటులు, సాంకేతిక నిపుణులు అనే తేడా లేకుండా సినిమాకి పని చేసిన ప్రతి ఒక్కరికీ ప్రశంసలు దక్కుతున్నాయి. ఆ దేవుని ఆశీస్సులతోనే సినిమాకి ఈ స్థాయి ఆదరణ లభిస్తోందని నమ్ముతున్నాను." అన్నారు.



# విడుదలకు సిద్ధమైన "ఝాన్సీ ఐపీఎస్"



ఆర్ కె ఫిలిమ్స్ పతాకంపై డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ నిర్మాతగా, తెలుగులో మెగాస్టార్ లాంటి లెజెండ్ సరసన నటించిన బ్యూటీ క్వీన్ లక్ష్మీ రాయ్ ప్రధాన పాత్రలో గురుప్రసాద్ దర్శకత్వంలో తమిళంలో విడుదలై ఘన విజయాన్ని సాధించిన "ఝాన్సీ ఐపీఎస్" చిత్రం నవంబర్ 22న విడుదలకు సిద్ధమైంది.

ఈ సందర్భంగా చిత్ర నిర్మాత, తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ చైర్మన్ డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ.. తమిళ్ లో సూపర్ హిట్ అయిన "ఝాన్సీ ఐపిఎస్" చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేస్తున్నందుకు ఆనందంగా ఉంది. లక్ష్మీ రాయ్ త్రిపాత్రాభినయం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణ. ఫైట్ మాస్టర్ థ్రిల్లర్ మంజు కంపోజ్ చేసిన 8 ఫైట్స్ లక్ష్మీరాయ్ కెరీర్లో మైలు రాయిగా నిలిచిపోతాయి. ఈ చిత్రానికి కూడా ఫైట్స్ హైలెట్ గా నిలుస్తాయి. లక్ష్మీ రాయ్ చేసిన మూడు క్యారెక్టర్స్ డిఫరెంట్ షేడ్స్ లో ఉంటాయి. విద్యార్థులను మాదక ద్రవ్యాలకు అలవాటు చేసి, యువత భవిష్యత్ ను పెడదారి పట్టించే, డ్రగ్స్ ముఠా ఆటకట్టించే ఐపీఎస్ ఆఫీసర్ గా, గ్రామాల్లో రౌడీల అగడాలకు అడ్డుకట్టవేసే ఉగ్రనారిగా, కుర్రకారును ఉర్రూతలూగించే గ్లామర్ పాత్రల్లో లక్ష్మీ రాయ్ తన నట విశ్వ రూపాన్ని ప్రదర్శించింది. విజయశాంతి నటించిన కర్తవ్యం, ఇలాంటి సినిమాలకు ఇన్స్పిరేషన్. కర్తవ్యం చిత్రంతో విజయశాంతి గారు లేడీ సూపర్ స్టార్ గా ఎదిగారు. కర్తవ్యం చిత్రం ఎలాంటి విజయాన్ని సాధించిందో, ఈ "ఝాన్సీ ఐపీఎస్" చిత్రం కూడా ఘన విజయాన్ని సాధిస్తుంది. సెన్సార్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం నవంబర్ 22న అత్యధిక థియేటర్లలో ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం అన్నారు. ప్రముఖ డాన్సర్, నటి ఆక్సఖాన్ మాట్లాడుతూ.. గతంలో లేడీ ఓరియెంటెడ్ చిత్రాలు ఎన్నో వచ్చాయి. కానీ లక్ష్మీరాయ్ నటించిన "ఝాన్సీ ఐపీఎస్" చిత్రానికి ప్రత్యేకత ఉంది. మూడు పాత్రల్లో అద్భుతంగా నటించారు లక్ష్మీ రాయ్. ఈ చిత్రం ఘన విజయాన్ని అందుకోవాలని కోరుకుంటున్నాను అన్నారు. నటుడు జె.వి.ఆర్ మాట్లాడుతూ..ఆర్కే ఫిలిమ్స్ బ్యానర్ కు "ఝాన్సీ ఐపిఎస్" చిత్రం మంచి పేరు, డబ్బు తీసుకువచ్చే చిత్రం అవుతుంది. మంచి పబ్లిసిటీతో, అత్యధిక థియేటర్లలో నవంబర్ 22న రిలీజ్ అవుతున్న ఈ చిత్రం ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నాను అన్నారు.

# నిమ్మరసం ఎక్కువ తీసుకుంటే ప్రమాదం



నిమ్మకాయలో అనేక పోషకాలు, ఔషధ గుణాలు దాగున్నాయి. పుల్లటి రుచితో ఉండే ఈ నిమ్మకాయ రసాన్ని తీసుకోవడం ఆరోగ్యానికి చాలా మంచిది. అందుకే.. నిమ్మకాయను రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలి.. దీనిని తీసుకోవడం వల్ల చాలా ప్రయోజనాలు చేకూరుతాయి.. విటమిన్ సీ తోపాటు.. అనే పోషకాలున్న నిమ్మకాయను సూపర్ ఫుడ్ అని కూడా పిలుస్తారు. విటమిన్ సి అవసరాలను తీర్చడానికి నిమ్మకాయను ఉపయోగిస్తారు.. ఇది రోగనిరోధక శక్తిని పెంచే పోషకం.. దీంతో మీరు జలుబు, దగ్గు, ఫ్లూ, జ్వరం వంటి వైరల్ వ్యాధులను నివారించవచ్చు. అయితే.. నిమ్మకాయ తీసుకోవడం చాలామంచిదే, కానీ మీరు నిమ్మకాయను పరిమితికి మించి తీసుకుంటే శరీరానికి మేలు బదులు చెడు జరుగుతుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందువల్ల, నిమ్మకాయ ప్రతికూల ప్రభావాలేంటో తెలుసుకోవడం ఉత్తమం.. నిమ్మకాయ లేదా నిమ్మ రసాన్ని ఎక్కువగా తీసుకోవడం వల్ల కలిగే నష్టాలు ఏంటో తెలుసుకోండి.

దంత సమస్యలు: నిమ్మకాయను ఎక్కువగా తీసుకోవడం వల్ల దంత సమస్యలు వస్తాయి. నిమ్మకాయ ఆమ్ల స్వభావం దంతాల ఎనామెల్ దెబ్బతినడం, సున్నితత్వం పెరగడం వంటి దంత నష్టాన్ని కలిగిస్తుంది.

కడుపు సంబంధిత సమస్యలు: నిమ్మరసం జీర్ణక్రియకు ఉత్తమమైనదిగా పరిగణించినప్పటికీ.. మీరు నిమ్మకాయను ఎక్కువగా తీసుకుంటే గ్యాస్, ఉబ్బరం, ఆమ్లత్వం వంటి కడుపు సంబంధిత సమస్యలు పెరుగుతాయి.

చర్మ సమస్యలు: నిమ్మకాయను ఎక్కువగా తీసుకోవడం వల్ల చర్మం మొద్దుబారడంతోపాటు పొడిబారుతుంది.. ఇది చర్మాన్ని అసౌకర్యానికి గురి చేస్తుంది. ఇది సూర్యకాంతి, యూవీ రేడియేషన్‌ను తట్టుకోగల చర్మం సామర్థ్యాన్ని తగ్గిస్తుంది.

బరువు పెరిగే ప్రమాదం: నిమ్మకాయను పరిమిత పరిమాణంలో తీసుకుంటే.. అది బరువును తగ్గిస్తుంది. కానీ ఎక్కువ నిమ్మకాయను తీసుకోవడం వల్ల ఎక్కువ ఆహారం తినాలనే కోరిక పెరుగుతుంది. మీరు ఎక్కువ ఆహారం తీసుకుంటే, మీ బరువు క్రమంగా పెరుగుతుంది.

నొప్పి - వాపు: నిమ్మకాయను అధికంగా తీసుకోవడం వల్ల శరీరంలో అదనపు విటమిన్ సి ఏర్పడుతుంది. ఇది కీళ్లలో నొప్పివాపును పెంచుతుంది. కాబట్టి, నిమ్మకాయను పరిమితుల్లో మాత్రమే తీసుకోవాలి.

# గోరుచిక్కుడుతో గొప్ప బెనిఫిట్స్



గోరు చిక్కుడు కాయలు.. దాదాపు అందరికీ తెలిసిన కూరగాయే..కానీ, దీన్ని తినేందుకు మాత్రం చాలా మంది ఇష్టపడరు. కానీ, గోరుచిక్కుడు వల్ల ఆరోగ్యప్రయోజనాలు చాలానే ఉన్నాయంటున్నారు ఆరోగ్యనిపుణులు. గోరు చిక్కుడును ఆహారంలో తీసుకోవడం వల్ల మన శరీరానికి అవసరమైన అన్ని పోషక విలువలు లభిస్తాయి. గోరు చిక్కుడులో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. దీంతో రక్తంలో చెడు కొలెస్ట్రాల్ తగ్గిస్తుంది. రక్తహీనత సమస్యలను దూరం చేస్తుంది. గోరుచిక్కుడు.. సాధారణంగా ఇది చిక్కుడు జాతికి చెందిన మొక్క. ఇంగ్లీషులో దీన్ని క్లస్టర్ బీన్స్ అంటారు. గోరుచిక్కుడులో కార్బోహైడ్రేట్స్, ప్రోటీన్స్ పుష్కలంగా ఉంటాయి. తక్కువ కేలరీలతో పాటు కార్బోహైడ్రేట్స్, ప్రోటీన్, నీరు, ఫైబర్, చక్కెర, కాల్షియం, ఐరన్, విటమిన్ సి లభిస్తుంది. గోరుచిక్కుడులోని గుణాలు ఆస్తమాకి చక్కని పరిష్కారంగా ఉంటుంది. కాబట్టి, ఆస్తమా ఉన్నవారు గోరుచిక్కుడుని రెగ్యులర్‌గా తీసుకోవడం మంచిది. గోరుచిక్కుడులో ప్రోటీన్, ఫైబర్, కార్బోహైడ్రేట్లు, కాల్షియం విటమిన్ సి ఉంటాయి. ఇది చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తుంది. హిమోగ్లోబిన్ పెరుగుతుంది. ఐరన్ లేమి సమస్యకు చెక్ పెట్టొచ్చు. గోరుచిక్కుడులో అనేక గుణాలు ఉన్నాయి. వీటిని తీసుకోవడం వల్ల బాహ్య, అంతర్గత పుండ్లు తగ్గుతాయి. ఇన్ఫెక్షన్లని దూరం చేసి మంటను తగ్గించడంలో హెల్ప్ చేస్తుంది. గోరుచిక్కుడులో ఎన్నో యాంటీ మైక్రోబియల్ లక్షణాలు ఉన్నాయి. ఇవి సాల్మొనెల్లో సహా బ్యాక్టీరియాతో పోరాడే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. గోక్కుడుతో ఒంట్లోని హై కొలెస్ట్రాల్ తగ్గుతుంది. ఎల్‌డిఎల్ కొలెస్ట్రాల్‌ని తగ్గించే ఈ గోరుచిక్కుడు మంచి కొలెస్ట్రాల్ హెచ్‌డిఎల్ కొలెస్ట్రాల్‌ని పెంచడంలో సాయపడుతుంది. జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఇందులోని ఫైబర్ మలబద్ధకాన్ని నివారిస్తుంది. ఇందులోని ఫైటోకెమికల్స్ క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తాయి. అంతేకాదు ప్రెగ్నెన్సీ ఉన్న మహిళలకు కూడా గోరుచిక్కుడు ఎంతో ఉపయోగకరం. ఇందులో ఉండే ఫోలెట్ పిండం అభివృద్ధికి సహాయపడుతుంది. ఐరన్ ,కాల్షియం కూడా అందిస్తుంది. గోరు చిక్కుడు విటమిన్లు, ఖనిజాలకు మూలం. ఇది విటమిన్లు A, C, E, K, B6, ఫోలేట్ , ఐరన్, కాల్షియం, మెగ్నీషియం వంటి పోషకాలను అందిస్తుంది.ముఖ్యంగా చాలామంది మహిళలు ఐరన్ లేమితో బాధపడుతుంటారు. దీంతో వారు బలహీన సమస్యతో బాధపడుతుంటారు. అందుకే గోరుచిక్కుడు మహిళలకు వరం. వారానికి ఒకసారైనా తినాలి. డయాబెటీస్, బీపీతో బాధపడుతున్న వారు కచ్చితంగా వారానికి ఒక్కసారైనా గోరుచిక్కుడు తినాలి. ఇది ఆరోగ్యానికి మంచిది. గుండె జబ్బులు ఉన్నవారు కూడా గోరుచిక్కుడు తినాలి.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com